www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సీఎం రేఖా గుప్తా

ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠంపై వీడిన ఉత్కంఠ

తొలిసారి ఎమ్మెల్యేను వరించిన అదృష్టం

కలిసొచ్చిన ఆర్‌ఎస్ఎస్, ఏబీవీపీ నేపథ్యం

నేడు రామ్‌లీలా మైదానంలో ప్రమాణం

హాజరుకానున్న ప్రధాని మోదీ, బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు

2



ఢిల్లీలోని బీజేపీ ఆఫీసులో రేఖా గుప్తా విజయ సంకేతం

గురువారం | 20-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 306 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి ఉ. 9.58 తదుపరి అష్టమి; నక్షత్రం: విశాఖ మ. 1.30 తదుపరి అనూరాధ; వర్జ్యం: సా. 5.54-7.39; దుర్ముహూర్తం: ఉ. 10.33-11.19, మ. 3.10-3.56; అమృతఘడియలు: తె. 4.27-6.13; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రిజిస్ట్రేషన్ల శాఖలో బిల్లుల దందా!

అప్పనంగా 50 కోట్లు చెల్లించేందుకు స్కెచ్

శాఖలో ఉన్నతాధికారి పావులు

రైటర్స్ బ్లాక్ కంపెనీకి ఇవ్వాలని ఒత్తిడి

అప్పగించిన పని పూర్తి చేయకపోయినా

నాణ్యత లేకున్నా చెల్లింపునకు ఆదేశం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓ కాంట్రాక్టు సంస్థకు కానీ లేదా కంపెనీకి కానీ ప్రభుత్వం బిల్లులు చెల్లించాలంటే ఆ మేరకు అప్పగించిన పని పూర్తి చేయాలి. అది కూడా నిబంధనల ప్రకారం నాణ్యతతో చేయాలి. కానీ పని పూర్తి చేయకపోయినా, చేసిన పనిలో కూడా నాణ్యత లేకపోయినా ఓ కంపెనీకి అప్పనంగా మొత్తం బిల్లులు చెల్లించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఉన్నతాధికారి ఒకరు పావులు కదుపుతున్నారు. రైటర్స్ బ్లాక్ అనే ప్రైవేట్ కంపెనీకి ఏకంగా రూ.50 కోట్లు అడ్డగోలుగా చెల్లించేందుకు ఆ శాఖ అధికారులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. రైటర్స్ బ్లాక్ కంపెనీ, రిజిస్ట్రేషన్ల శాఖకు కుదిరిన ఒప్పందం ప్రకారం అప్పగించిన 3 పనులు పూర్తి చేస్తేనే చెల్లింపులు జరుగుతాయని స్పష్టంగా ఉంది. ఒప్పందం మేరకు ఆ కంపెనీ పనులు పూర్తి చేయలేదు. అయినా ఆ కంపెనీకి మొత్తం బిల్లులు చెల్లించాలని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి ఒత్తిడి తెస్తున్నారు. భూరికార్డులను డిజిటల్‌గా భద్రపరచడం కోసం జాతీయ సంస్థ ఎన్ఎల్ఆర్ఎంపీ నుంచి రాష్ట్రాలకు నిధులు వస్తాయి. ఆ నిధులను రైటర్స్ బ్లాక్ కంపెనీకి

మిగతా 14వ పేజీలో...

విజిలెన్స్ గుప్పిట్లో 'టీడీఆర్' గుట్టు

తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి హస్తం!

ముగ్గురు మహిళలకు చెందిన బాండ్లను రూ.12 కోట్లకు విక్రయించి... కుచ్చుటోపీ

బిల్డర్‌కు నాలుగో వంతు ముడుపులు

స్థలం యజమానులకు తెలియకుండానే బాండ్లు

12

"మా ప్రభుత్వంలో క్వింటా మిర్చి ధర రూ.21 వేల నుంచి రూ.27 వేలు పలికింది. కూటమి ప్రభుత్వంలో మిర్చి రేటు 8-11 వేలకు పడిపోయింది" అని మాజీ సీఎం జగన్ సెలవిచ్చారు. కానీ, తాను అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి మూడేళ్లు ఇచ్చిన 'మద్దతు' కేవలం రూ.7 వేలేననేది ఆయన కావాలనే దాచిపెట్టారు. ఆయన నిర్వాకంతో నాడు మునిగిన రైతుల సాక్షిగానే అబద్ధాలు వల్లించారు.



గుంటూరు మిర్చి యార్డులో రైతులను పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం జగన్

ధరలపై అబద్ధాల దరువు

మిర్చి రేట్లపై జగన్ రాజకీయ డ్రామా

నాడు మార్కెట్ కన్నా తక్కువగా మద్దతు ధర

కేవలం రూ. 7 వేలు చేస్తూ ప్రత్యేకంగా జీవో

చెలరేగిపోయిన సిండికేట్.. మునిగిన రైతులు

ఇప్పుడు గిట్టుబాటు ధర లేదంటూ గగ్గోలు

గోతాలూ ఇవ్వకుండా రైతులకు నాడు నరకం

ఆ ఐదేళ్లూ పంటలు అమ్మాలంటే అవస్థలే

బీమా లేదు..అప్పట్లో రైతుల్లో ధీమా లేదు

మిర్చి ధరల సమస్యపై బాబు ఢిల్లీకి పయనం

అందుకే రైతుల్లో గందరగోళానికి జగన్ యత్నం

'గన్నవరం' విషయంలోనూ ముందురోజు బోల్తా

గుంటూరు, అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను తెలుసుకోవడానికి బుధవారం గుంటూరు మిర్చి యార్డును మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అవలీలగా అబద్ధాలు ఆడారు. కూటమి ప్రభుత్వంలో రైతన్నకు గిట్టుబాటు ధర కరువైందంటూ మొసలికన్నీరు పెట్టుకున్నారు. పండించిన పంటను దాచుకోవడానికి గోతాలు కూడా జగన్ ఇవ్వలేకపోయారు. అలాంటిది.. మిర్చి రైతులను చంద్రబాబు ప్రభుత్వం దోచేస్తోందంటూ అసత్యాలు

మిగతా 13వ పేజీలో...

వైసీపీకి అసెంబ్లీకి వెళ్లే దమ్ము లేదు

జగన్‌కు నేరస్థుల పరామర్శకు సమయముంది

షర్మిల మండిపాటు

మిర్చి రైతులకు ధర లోటు చెల్లించండి

మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అమలు చేయండి

కేంద్రానికి సీఎం లేఖ

13



పెగాసస్ క్యాపిటల్ ప్రతినిధులతో సమావేశమైన సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్న, ఉన్నతాధికారులు

ఏపీ రైతులకు 'అమెరికా' సహకారం

సీఎం చంద్రబాబుతో పెగాసస్ క్యాపిటల్ సంస్థ ప్రతినిధుల భేటీ

దావోస్ సమావేశంలో చర్చలకు కొనసాగింపు

గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా ఏపీ

మార్కెట్ నుంచి ఫైనాన్స్ వరకు ప్రకృతి సాగుకు తోడ్పాటు

రైతు నుంచి వినియోగదారుడి వరకు అనుసంధాన వ్యవస్థ

ప్రకృతి సేద్యం నా కల: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రైతులకు తోడ్పాటు అందించేందుకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థలతో కలిసి పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ పలు సంస్థలకు ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆ సంస్థలను ఆహ్వానించారు. అక్కడ సీఎంతో సమావేశమైన అమెరికా సంస్థ పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం ఏపీకి వచ్చారు. ఆ సంస్థ చైర్మన్ క్రైగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వైజర్

మిగతా 14వ పేజీలో...

ప్రకృతి విపత్తుల సాయం కింద.. ఆంధ్రకు అదనంగా 608 కోట్లు

తెలంగాణకు 231 కోట్లు .. మొత్తంగా 5 రాష్ట్రాలకు 1,554 కోట్లు

14

హస్తిన చేరిన చంద్రబాబు

కేంద్ర మంత్రులు అమిత్‌షా, పాటిల్‌తో నేడు భేటీ

మిర్చి ధరపై వ్యవసాయ మంత్రితో చర్చించే చాన్స్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం ఢిల్లీ రాక

13

దళిత విద్యార్థుల ఆపద్బంధువు!

సాంఘిక సంక్షేమ గురుకులాలు, హాస్టల్ విద్యార్థులపై మంత్రి డోలా ప్రత్యేక శ్రద్ధ

అనారోగ్యం పాలైనవిద్యార్థులకు అండ

చొరవ తీసుకొని 15 మందికి పైగా పిల్లల ప్రాణాలు కాపాడిన 'డాక్టర్ స్వామి'

మెరుగైన విద్య అందించేలా పలు చర్యలు



అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆపద్బంధువుగా మారారు. స్వతహాగా వైద్యుడైన ఆయన ఒక్క విద్యార్థి కూడా అనారోగ్యం బారినపడి, మరణించకూడదని కంకణం కట్టుకున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంపై ఆరా తీశారు. ఏటా 15 మంది విద్యార్థులు అనారోగ్యం కారణంగా మరణిస్తున్నారన్న అంశం ఆయన్ను ఆలోచింపచేసింది. దీంతో విద్యార్థులకు అండగా.. వారి ప్రాణాలకు

మిగతా 14వ పేజీలో...



అలా ఆలోచించడమే తప్పు

మూలాలు తెలుసుకోకుండా స్టూవర్టుపురంపై ఆ ముద్ర వేశారు

నిరుద్యోగం, ఉపాధి లేమే అసలు సమస్యలు

ఆకలిగొన్నవాడికి నీతులు రుచించవు

పరిష్కారంపై ఆనాడు దృష్టి లేదు

ఊరిని మార్చిన లవణం, హేమలత కృషి

తాతయ్య కూడా సామాజిక సేవకుడే

నాన్న ఊరితో ఇప్పటికీ చెరగని బంధం

ఉపాధ్యాయ వృత్తిపై తొలి నుంచీ మక్కువ

అందుకే డిప్యూటీ కలెక్టర్ పోస్టు కాదనుకున్నా..

ఇక్కడివరకు నా ప్రయాణం సంతృప్తికరం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నూతన వీసీ ప్రసన్నశ్రీ వెల్లడి

స్టూవర్టుపురం! ఈ పేరు వింటేనే చిన్న కలవరపాటు. ఎందుకంటే గజదొంగల అడ్డాగానే ఈ ఊరు ప్రపంచానికి తెలుసు. చదువు తక్కువ. చీకటి ఎక్కువ! అలాంటిచోటు నుంచి అక్షర జ్యోతిలా దూసుకొచ్చిందామె. ఆమే ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నూతన వీసీ సాతుపాటి ప్రసన్నశ్రీ. స్టూవర్టుపురం నుంచి నన్నయ్య వర్సిటీ వరకు సాగిన ప్రస్థానం ఆమె మాటల్లో.. ...14లో



ఆర్టీసీలో కారుణ్యానికి పచ్చజెండా

12

అసైన్డ్ భూములపై ఉపసంఘం!

నిషేధిత జాబితా నుంచి ప్రైవేటు భూములకు విముక్తి

13

రాష్ట్రంలో 3చోట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు

12

నాతో వాదనలా!



మోదీ చెప్పినా నేను వినలేదు

మీరెంత సుంకం విధిస్తే మేమూ అంతే వేస్తామని ఆయనకు గట్టిగా చెప్పా

భారత్‌కు ఎటువంటి మినహాయింపూ ఉండదని స్పష్టం చేశా

ఇకపై అన్ని దేశాలతో ఇలాగే వ్యవహరిస్తాం.. అట్లాగైతేనే దారికొస్తాయి

భారత్‌లో బోలెడంత డబ్బు.. అక్కడ ఓటింగ్‌కు మనం డబ్బెందుకివ్వాలి?

అమెరికా కంపెనీల వాహనాలపై భారత్‌లో 100% పన్ను విధిస్తున్నారు

ఆ దేశంలో టెస్లా ఫ్యాక్టరీ పెడితే అమెరికాకు అన్యాయమే

ఫాక్స్ ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

2



ఏఐ, డ్రోన్ సాంకేతికతతో ఆలయాల్లో రద్దీ నియంత్రణ



టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా మనల్ని నడిపించేది దేవుడే

పిల్లలకు ఫోన్లు, ఐప్యాడ్లు ఇచ్చి పుస్తకాలకు దూరం చేస్తున్నాం

చిన్నారులకు స్పైడర్‌మ్యాన్ బదులు శ్రీకృష్ణ లీలలను చెప్పాలి

ఐటీసీఎక్స్ సదస్సు ముగింపు సభలో మంత్రి నారా లోకేశ్

14

ఢిల్లీ సీఎం రేఖా గుప్త



నేడు రామ్‌లీలా మైదానంలో ప్రమాణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి19: ఢిల్లీ కొత్త సీఎం ఎవరనే ఉత్కంఠ వీడింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా(50) ఎంపిక య్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె షాలిమార్ బాగ్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన శాస నసభాపక్ష సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు రేఖా గుప్తను తమ నాయకురాలిగా ఎన్నుకున్నారు. ఈ సమావే శానికి బీజేపీ అధిష్ఠానం ప్రతినిధులుగా మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, బీజేపీ కార్య దర్శి ఓం ప్రకాశ్ ధన్‌కర్ హాజరయ్యారు. సీఎం రేసులో ముందున్నారని ప్రచారం జరిగిన పర్వేశ్ వర్మ, విజేంద్ర గుప్త ఆమె పేరును శాసనసభాపక్ష నాయకురాలిగా ప్రతిపాదించారు. ఆ వెంటనే ఎమ్మెల్యేలంతా అంగీకరిం చారు. అనంతరం రేఖా గుప్త ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏర్పాటుకు సక్సేనా ఆమెను ఆహ్వానించారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. దీనికి ప్రధాని మోదీ, బీజేపీ, ఎన్డీయే పాలిత సీఎంలు, డిప్యూటీ సీఎంలు హాజరుకానున్నారు. ప్రమాణ స్వీకారం కోసం ఢిల్లీలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

ఢిల్లీ నాలుగో మహిళా సీఎం

రేఖా గుప్తా ఢిల్లీకి నాలుగో మహిళా ముఖ్య మంత్రిగా సేవలు అందించనున్నారు. గతంలో బీజేపీ నుంచి సుష్మా స్వరాజ్, కాంగ్రెస్ తరఫున షీలాదీక్షిత్, ఆమ్ ఆద్మీ నుంచి అతిశీ ముఖ్య మంత్రులుగా పనిచేశారు. నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

తొలిసారి ఎమ్మెల్యేకు అదృష్టం

1974 జులై 19న హర్యానాలోని జుల్నాలో రేఖా గుప్త జన్మించారు. ఆ తర్వాత రెండేళ్లకే ఆమె తండ్రి ఉద్యోగరీత్యా ఢిల్లీకి వచ్చారు. దీంతో ఆమె విద్యాభ్యాసమంతా ఢిల్లీలోనే సాగింది. 1992లో దౌలత్ రామ్ కాలేజీలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించారు. న్యాయ వాద విద్యనభ్యసించారు. 1996-97లో ఏబీవీపీ తరఫున ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ అధ్యక్షు రాలిగా గెలిచారు. ఢిల్లీ పితంపురా కౌన్సిలర్‌గా గెలిచి, ఆ తర్వాత మేయర్‌గా పని చేశారు. 2015, 2020 ఎన్నికల్లో షాలీమార్ బాగ్‌లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లో 29,595 ఓట్ల తేడాతో ఆప్ అభ్యర్థి వందనపై తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు.

లోకం తీరు



సినిమా థియేటర్‌లో యాడ్స్‌పై కేసు

» పీవీఆర్ సినిమాస్, ఐనాక్స్, బుక్‌మైషోకు జరిమానా

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సినిమా చూసేందుకు థియేట ర్‌కు వెళితే సుదీర్ఘ వాణిజ్య ప్రకటనతో తన విలువైన సమయాన్ని వృథా చేశారని, అందువల్ల థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బెంగుళూరులో ఓ ప్రేక్షకుడు వినియోగదారుల కోర్టును ఆశ్రయిం చాడు. 25 నిమిషాలకుపైగా సమయం వృథా కావడంతో ఇతర ముఖ్యమైన కార్యక్రమాలకు హాజరు కాలేకపోయానని, దీనితో తనకు మానసిక వేదన కలిగిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల పిటిషన్‌ను విచారించిన కోర్టు.. సమయాన్ని కూడా డబ్బు అంత విలువైనదిగా భావించాలని పేర్కొంది. ఇతరుల విలువైన సమయంతో లబ్ధిపొందే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసింది. ప్రేక్షకుడికి రూ. 65 వేల పరిహారంగా చెల్లించాలని బెంగళూ రులోని పీవీఆర్, ఐనాక్స్ థియేటర్లు, బుక్‌మైషోకు జరిమానా విధించింది. 2023లో 'శ్యామ్ బహద్దూర్' అనే సినిమా చూడటానికి అభిషేక్ అనే ప్రేక్ష కుడు 3 టికెట్లు బుక్ చేశాడు. అయితే 4.05 గంటల సినిమా ప్రారంభమవు తుందని ప్రకటించినా.. 4.30 వరకు యాడ్స్ కొనసాగించారు.

పరిమితికి మించి టికెట్లు ఎందుకు అమ్మారు?

» ఢిల్లీ తొక్కిసలాట ఘటనపై కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: కుంభమేళాకు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజర్వేషన్ టికెట్లను కూడా పరిమితికి మించి టికెట్లు ఎందుకు విక్ర యించారని ప్రశ్నించింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలను నివారించేం దుకు భద్రత చర్యలు, రైలు బోగీల్లో ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే నిబంధనల అమలు కోరుతూ దాఖలైన పిల్‌పై బుధవారం కోర్టు విచారణ చేపట్టింది. ప్రయాణికులకు జారీ చేసే టికెట్ల సంఖ్యకు సీట్ల సంఖ్యకు ఎందుకు వ్యత్యాసం ఉంటోందని అటు కేంద్రాన్ని, ఇటు రైల్వే శాఖను ధర్మా సనం ప్రశ్నించింది. కేసు విచారణను మార్చి 26కు వాయిదా వేసింది.

ప్రైవేటు అంతరిక్ష సంస్థల కోసం రూ.500కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చేసిన ప్రారంభ దశ సాంకేతికతలను వాణిజ్యపరమైన లాభదాయక ఉత్ప త్తులుగా మార్చడానికి ఆర్థిక చేయూతను అందిస్తామని భారత అంతరిక్ష ప్రోత్సాహక సంస్థ 'ఇన్‌స్పేస్' ప్రకటించింది. దీని కోసం రూ.500 కోట్లతో నిధి(టీఏఎఫ్-టెక్నికల్ అడాప్షన్ ఫండ్)ని ఏర్పాటు చేసింది. అంతరిక్ష రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయ కంపెనీలు అంతరిక్ష సాంకేతికతలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించడం ఈ నిధి ఏర్పాటు లక్ష్యమని ఇన్‌స్పేస్ బుధవారం వెల్లడించింది. 'స్టార్టప్‌లు, ఎంఎస్ ఎంఈలకు ప్రాజెక్టు వ్యయంలో 60% వరకు, భారీ పరిశ్రమలకు ప్రాజెక్టు వ్యయంలో 40% వరకు టీఏఎఫ్ నుంచి అందిస్తాం. ఒక్కో ప్రాజెక్టుకు గరి ష్ఠంగా రూ.25 కోట్ల వరకు ఇస్తాం' అని ఇన్‌స్పేస్ ఛైర్మన్ పవన్ చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 4వేల అప్రెంటిస్ ఖాళీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశంలోని ప్రముఖ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు అప్రెంటిస్ ఉద్యోగాల కోసం వి డివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేశాయి. 2025 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు ఉండి, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారే ఈ ఉద్యోగాలకు అర్హులు. యూనియన్ బ్యాంకులో మొత్తం 2,691 అప్రెం టిస్ ఖాళీలు ఉండగా, వీటిలో తెలంగాణలో 304, ఆంధ్రప్రదేశ్‌లో 549 ఖాళీలు ఉన్నాయి. మార్చి 5వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశమిచ్చారు. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడాలో 4,000 అప్రెంటిస్ ఖాళీలు ఉండగా, ఇందులో తెలంగా ణలో 193, ఆంధ్రప్రదేశ్‌లో 59 ఖాళీలు ఉన్నాయి. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్య ర్థులు మార్చి 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరోవైపు, రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మరో 518 పోస్టుల భర్తీకి కూడా బ్యాంక్ బరోడా నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో సీనియర్ మేనేజర్ మొదలుకొని నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్ వరకు పలు పోస్టులు ఉన్నాయి.

రేపిస్టుకు ఉరిశిక్ష రద్దు.. బయటకి వచ్చి మళ్లీ రేప్

భోపాల్, ఫిబ్రవరి 19: చిన్నారులపై వరుస అత్యాచారాలకు పాల్పడుతున్న ఓ మృగాడిని న్యాయ వ్యవస్థ కఠినంగా శిక్షించకపోవడమే పాపమైంది. చివరి సారి కింది కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు రద్దు చేయడంతో బయటికొ చ్చిన ఆ ఉన్మాది తాజాగా మరో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు.. మధ్య ప్రదేశ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. దబ్రిపురకు చెందిన రమేశ్ సింగ్ ఓ సీరియల్ రేపిస్ట్.. 2003లో ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కోర్టు అతడికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. శిక్ష అనంతరం బయటికొచ్చిన అతడు 2014లో 8 ఏళ్ల బాలికపై అకృత్యానికి ఒడిగట్టాడు. దీంతో కోర్టు అతడికి ఉరి శిక్ష విధించింది. అయితే 2019లో సాంకేతిక కారణాలతో హైకోర్టు అతడి ఉరి శిక్షను రద్దు చేసింది. మళ్లీ బయటకు వచ్చిన రమేశ్ మరో బాలికపై అఘా యిత్యానికి పాల్పడ్డాడు. కాగా, నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ముడా కేసులో సిద్దూకు బిగ్ రిలీఫ్?

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర కలకలం రేపిన ముడా ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరా మయ్య, ఆయన భార్య పార్వతికి భారీ ఊరట లభించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. కేసును దర్యాప్తు చేస్తున్న లోకాయుక్త పోలీసులు.. కోర్టుకు బి రిపోర్టు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఫిర్యాదిదారుడు, సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు బుధవారం నోటీసు ఇచ్చారు. సాక్ష్యా ధారాల కొరత ఉందని, ఆరోపణలకు తగిన రుజువులు లేవని అందులో పేర్కొన్నారు. ఏ1 నుంచి ఏ4 నిందితుల వరకూ అందరినీ విచారించామని లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ నోటీసులో పేర్కొన్నారు. ఇది సివిల్ వ్యాజ్యమని, దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదని, పలు ఆరోపణలకు సాక్ష్యాలు లేవని నోటీసులో ప్రస్తావించారు. సీఎం సిద్దరామయ్య భార్యకు 2016 నుంచి 2024 వరకు 50:50 నిష్పత్తిలో ముడా పరిహారంగా ఇచ్చిన ఇంటి స్థలాలపై వచ్చిన ఆరోపణల గురించి దర్యాప్తు నివేదికను కోర్టుకు లోకాయుక్త సమర్పిస్తోందని పేర్కొన్నారు. నోటీసు అందుకున్న వారంలోగా అభ్యంతరాలు ఏమైనా ఉంటే మెజిస్ట్రేట్ ఎదుట చెప్పవచ్చునని సూచించారు.

సీఈసీగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: కేంద్ర ఎన్నికల సంఘం 26వ ప్రధాన కమిషన ర్‌గా నియమితులైన జ్ఞానేశ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఓటు వేయడం అనేది తొలి అడుగు అని చెప్పారు. 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడు ఓటరుగా మారి ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

నాతో వాదనలా!



» మోదీ చెప్పినా నేను వినలేదు

» మీరెంత సుంకం విధిస్తే మేమూ అంతే వేస్తామని ఆయనకు గట్టిగా చెప్పా: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 19: పరస్పర సుంకాల విష యంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారి స్తున్నా తాను వినలేదని, మీరు ఎంత పన్నులు వి ధిస్తే తామూ అంతే విధిస్తామని ఆయన ముఖం మీదే చెప్పానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడిం చారు. ఈ అంశం మీద తనతో ఎవరూ వాదించటా నికి వీల్లేదని పేర్కొన్నారు. తాను ప్రతిపాదించిన పర స్పర పన్నుల నుంచి భారత్‌ను మినహాయించే ప్రసక్తే లేదని తెలిపారు. ఫాక్స్ న్యూస్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 13వ తేదీన మోదీతో భేటీకి ముందు ట్రంప్.. పరస్పర పన్నుల (రెసిప్రోకల్ టారిఫ్) గురించి ప్రకటించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. తమ ఉత్పత్తులపై ఒక దేశం ఎంత సుంకం విధిస్తే ఆ దేశం ఉత్పత్తులపై అమెరికా కూడా అంతే సుంకం విధిస్తుంది. ప్రస్తుతం అమెరి కాకు చెందిన వాహనాలు తదితర ఉత్పత్తుల మీద భారత్ అధిక పన్నులు వేస్తుండగా, భారత ఉత్ప త్తుల మీద అమెరికా ఆ స్థాయిలో విధించటం లేదు. మోదీతో జరిగిన సమావేశంలో దీని గురించి ప్రత్యే కంగా ప్రస్తావించానని ట్రంప్ తాజాగా ఫాక్స్ ఇంట ర్వ్యూలో వెల్లడించారు. 'మీరు మా మీద ఎంత పన్ను వేస్తే మేం మీ మీద అంతే పన్ను వేస్తాం అని మోదీకి స్పష్టంగా చెప్పా. దానికి మోదీ స్పందిస్తూ.. అది తనకు ఇష్టం లేదన్నారు. అయినప్పటికీ, నేను మళ్లీ అదే విషయాన్ని పునరుద్ఘాటించా. భారత్‌తోనే కాదు, ప్రతీ దేశంతోనూ ఇకపై మా వ్యవహారం ఇలాగే ఉంటుందని ఆయనకు స్పష్టం చేశా' అని తెలిపారు. పరస్పర పన్నుల గురించి తనతో ఎవరూ వాదించటానికి వీల్లేదని, ఇలా పన్నులు వేస్తేనే ఆయా దేశాలు అమెరికా మీద భారీ సుంకాలు వి ధించటం ఆపుతాయని ట్రంప్ చెప్పారు. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచటానికి ఉద్దే శించిన 2.1 కోట్ల డాలర్ల (రూ.182 కోట్లు) నిధుల్ని ఇటీవల అమెరికా నిలిపివేయటంపై స్పందిస్తూ.. 'భారత్ వద్ద బోలెడంత డబ్బు ఉంది. మనం ఆ దేశా నికి 2.1 కోట్ల డాలర్లు ఎందుకివ్వాలి? మన మీద అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అందువల్లే ఆ దేశ మార్కెట్లోకి దాదాపుగా వెళ్లలేకపో తున్నాం. నాకు భారత్ అన్నా, ఆ దేశ ప్రధాని అన్నా చాలా గౌరవం. కానీ, ఆ దేశంలో ఓటింగ్ శాతం పెంచటానికి మనం డబ్బులు ఎందుకివ్వాలి? అమెరి కాలో ఓటింగ్ శాతం పరిస్థితి ఏమిటి?' అని వ్యాఖ్యా నించారు. ఎలాన్ మస్క్ సారథ్యంలోని 'అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ' (డోజ్) భారత్‌లో ఓటింగ్‌శాతం పెంపునకు ఉద్దేశించిన 2.1 కోట్ల డాలర్ల నిధులను ఇటీవల నిలిపివేసింది. ఈ నిర్ణయాన్ని ట్రంప్ తాజాగా మరోసారి సమర్థించారు.

అక్కడ మీరు ఫ్యాక్టరీ పెట్టొద్దు

అమెరికా వాహనాలపై భారత్ 100% సుంకం వి ధిస్తున్నదంటూ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అన్ని దేశాలూ అధిక సుంకాలు మోపుతూ అమెరికాతో అన్యాయంగానే వ్యవహరిస్తు న్నాయని పేర్కొన్నారు. ఇదే ఇంటర్వ్యూలో తనతో పాటు పాల్గొంటున్న టెస్లా కంపెనీ అధిపతి ఎలాన్ మస్క్‌ను చూపిస్తూ.. భారత్‌లో ఈయన టెస్లా ఫ్యాక్టరీ పెడితే అది అమెరికాకు అన్యాయం చేసినట్లే అవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌లో తాము కార్ల తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబో మని, బెర్లిన్‌లో ఉన్న తమ ఫ్యాక్టరీ నుంచే 25 వేల డాలర్లలోపు (రూ.21.72 లక్షలు) ఈవీలను భారత్‌కు సరఫరా చేస్తామని టెస్లా కంపెనీ వర్గాలు వెల్లడిం చాయి. మరోవైపు, అక్రమ వలసదారుల పట్ల తామెంత కఠినంగా వ్యవహరిస్తామో ప్రపంచానికి తెలుపుతూ వైట్ హౌస్ ఓ వీడియోను విడుదల చేసింది. 42 సెకన్ల నిడివి గల ఆ వీడియోను సామా జిక మాధ్యమాల్లో మంగళవారం పోస్టు చేసింది. వి మానం ఎక్కించే ముందు వలసదారుల కాళ్లకు గొలు సులు వేసే దృశ్యాలు అందులో ఉన్నాయి. అలాగే వారి చేతులకు వేయడానికి సంకెళ్లను సిద్ధం చేస్తు న్నట్లు వీడియోలో కనిపిస్తోంది. అయితే విమానం ఎక్కుతున్న వలసదారుల ముఖాలు మాత్రం వీడి యోలో కనిపించలేదు. అమెరికాలోకి అక్రమంగా వచ్చే వారికి హెచ్చరికగానే వైట్‌హౌస్ ఈ వీడి యోను విడుదల చేసినట్లు తెలుస్తోంది. కాగా, మస్క్ ఈ వీడియోను రీపోస్టు చేస్తూ 'వావ్' అని క్యాప్షన్ పెట్టారు.

నా దేశం అమ్మకానికి లేదు



తన దేశం అమ్మకానికి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మొదట్లోనే చర్చలతో నిలిపి వేయాల్సిందని, ఉక్రెయిన్ తీరుతోనే ఈ యుద్ధం మొదలైందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. "ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలయ్యాక అమెరికా సాయం చేసింది. 67 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేసింది. 31.5 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేసింది. అయితే.. ఇప్పుడు అమెరికా మా దేశంలోని 500 బిలియన్ డాలర్ల విలువైన వనరులను ధారాదత్తం చేయాలని కోరుతోంది. మా దేశం అమ్మకానికి లేదు" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ట్రంప్ తన చుట్టూ ఉన్న తప్పుడు సమాచారంలో కూరుకుపో యారని జెలెన్‌స్కీ ఎద్దేవా చేశారు. "నన్ను ఉక్రెయిన్ అధ్యక్ష పదవి నుంచి దింపే యాలని ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నం విఫలమవు తుంది. నా ప్రజామోదం 4% మాత్రమేనని ట్రంప్ అంటున్నారు. అది రష్యా నుంచి వచ్చిన తప్పుడు సమాచారమే" అంటూ మండిపడ్డారు. కీవ్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ విడుదల చేసిన సర్వే నివేదికలో తనకు 57% మేర ప్రజామోదం ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ట్రంప్ వాస్తవా లను తెలుసుకోవాలన్నారు.

24న పీఎం కిసాన్‌నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్రప్ర భుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్ పథకం.. 19వ విడత నిధుల విడుదలకు తేదీ ఖరారైంది. ఈ నెల 24న రూ. 2వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బిహార్‌లోని బాగల్పూర్‌లో జరిగే కార్య క్రమంలో ప్రధాని మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతు లకు ప్రయోజనం కలగనున్నట్లు వారు తెలిపారు.

ప్రైవేట్ పీఎస్ఎల్వీ రాకెట్‌తో ఇస్రో తొలి ప్రయోగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్), ఎల్ అండ్‌టీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా టెక్నాలజీ డిమాన్‌స్ట్రేషన్ శాటిలైట్-1 (టీడీఎస్-1) ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో సన్నా హాలు చేస్తోంది. 5 రాకెట్ల తయారీ ఒప్పందం కింద ప్రైవేటు రంగం తయారు చేసిన తొలి పీఎస్ఎల్వీ రా కెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో టీడీఎస్-1 ప్రయో గం ఉంటు ందని చెప్పారు. ప్రైవేటు రంగం తయారు చేసిన పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాన్ని చేపట్టడం ఇస్రోకు ఇదే తొలిసారి. ఈ ప్రయోగాన్ని దేశంలో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఉదాహర ణగా చెప్పుకోవచ్చు. ఈ మార్పు ద్వారా ఇస్రో తన పనిభారాన్ని తగ్గించుకోవడమే కాకుండా.. ప్రైవేట్ కంపెనీలకు అవకాశాలను ఇవ్వనుంది. టీడీఎస్-1 ఉపగ్రహ ప్రయోగంలో 35 నూతన టెక్నాలజీలను పరీక్షించనున్నారు. దీన్ని భూమికి 747 కి.మీ ఎత్తు లోని సూర్యసమకాలీన కక్ష్యలోకి చేరవేస్తారు. అనం తరం ఈ ఉపగ్రహం 12 రోజులకోసారి భూభాగాన్ని మొత్తం పరిశీలించి కీలక డేటాను అందిస్తుంది.

పుస్తకాలకు 'టెండర్'!

» సేల్ బుక్స్ ప్రింటింగ్‌లో అడ్డగోలు నిబంధనలు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పాఠశాల విద్యాశాఖ అధికారుల తీరు మారలేదు. గత వైసీపీ సర్కారు విధానాలనే ఇప్పటికీ కొన సాగిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ముద్రించే సేల్ బుక్స్(విక్రయించే పుస్తకాలు) కాంట్రాక్టు పెద్ద కంపెనీలకు దక్కేలా నిబంధనలు రూపొందించారు. బుధవారం అందుబాటులోకి వచ్చిన సేల్ బుక్స్ టెండర్ డాక్యుమెంట్... గైడ్‌లు ముద్రించే కంపెనీలకు మేలు చేసేలా, చిన్న ముద్రణదారులను దెబ్బతీసేలా ఉందని వి మర్శలొస్తున్నాయి. రాబోయే రెండు విద్యాసంవత్సరాల సేల్ బుక్స్‌కు ముద్రణదారులను ఎంప్యానెల్ చేసేందుకు పాఠ శాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. పేపరుతో కలిపి ఒక్కో పేజీ ధరను రూ.38.5గా నిర్ణయించింది. ఆ ధరకు పుస్తకాలు ముద్రించేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలని కోరింది. ప్రైవేటు బడుల్లోని 30,82 ,922 మంది విద్యార్థులకు సేల్‌బుక్స్ ముద్రించే కాంట్రాక్టును ఎంప్యానెల్ అయిన ప్రింటర్లు, ప్రచురణకర్తల(పబ్లిషర్ల)కు ఇస్తుంది. ఇందుకోసం ఈ నెల 18న టెండర్లు పిలవగా, మార్చి 3 దర ఖాస్తులకు చివరి తేదీ. అర్హత సాధించిన కంపెనీల వివరా లను మార్చి 10న ప్రకటిస్తారు.

ప్రభుత్వం మారినా అదే తీరు

రాష్ట్రంలో దాదాపు 60మంది ముద్రణదారులు ఉండగా వారిలో 50మంది వరకూ చిన్న ప్రింటర్ల కేటగిరీలో ఉన్నారు. పాఠ్యపుస్తకాల టెండర్ నిబంధనలు వారికీ ఉపాధి కల్పించేలా ఉండేవి. కానీ ఇప్పుడు కేవలం పెద్ద కంపెనీల ముద్రణదారులకు మాత్రమే లబ్ధి చేకూరేలా నిబంధనలు విధించారు. గతేడాది నిబంధనల్లో గత మూడేళ్లలో ఏదైనా ఒక ఏడాదిలో రూ.5కోట్ల టర్నోవర్ ఉండాలనే నిబంధన ఉంది. కానీ ఇప్పుడు గత మూడేళ్లలో ప్రతి సంవత్సరం రూ.10కోట్ల టర్నోవర్ ఉండాలనే పేర్కొ న్నారు. 2024-25 ఆర్థికసంవత్సరం ఇంకా పూర్తికాకముందే ఈ ఏడాది కూడా రూ.10కోట్లు ఉండాలని స్పష్టం చేశారు. గత మూడేళ్లలో కచ్చితంగా రెండేళ్లు పాఠ్యపుస్తకాలు ముద్రించి ఉండాలనే నిబంధన కూడా పెట్టారు. పాఠశాల విద్యాశాఖ విధించిన నిబంధనలతో నాలుగు కంపెనీలకు ఎక్కువ మేలు జరిగే అవకాశం కనిపిస్తోంది. వారి కోసమే టర్నోవర్ పెంచారని, వైసీపీ విధానాలు కొనసాగిస్తున్నా రనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక ఉచిత పుస్తకాల విషయంలో పేపరును ప్రభుత్వమే ఇచ్చేలా నిబంధనలు మార్చారు. కానీ ఇప్పుడు సేల్ బుక్స్ విషయంలో టర్నోవర్ రెట్టింపు చేయడంతో చిన్న ప్రింట ర్లకు అవకాశం లేకుండా పోయింది.

స్నానాలకే కాదు.. తాగడానికీ అనుకూలమే



త్రివేణీ సంగమ జలాలపై యూపీ సీఎం యోగి స్పష్టీకరణ

లఖ్‌నవూ/ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 19: ప్రయాగ్ రాజ్‌లోని త్రివేణీ సంగమం వద్ద నదిలో నీరు కలు షితమైందని సాగుతున్న ప్రచారాన్ని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. బుధవారం ఆయన యూపీ అసెంబ్లీలో మాట్లాడుతూ కుంభ మేళా గొప్పతనాన్ని పునరుద్ఘాటించారు. సనాతన ధర్మం, గంగానది, భారతదేశం, మహా కుంభమేళాపై నిరాధార ఆరోపణలు చేస్తూ, నకిలీ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు చేసిన 56.25 కోట్ల మంది ప్రజల విశ్వాసాలతో ఆడుకోవడమే అన్నారు. త్రివేణీ సంగమంలోని నీరు స్నానాలు చేయడానికే కాదు తాగడానికి కూడా పనికొస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఫీకల్ బ్యాక్టీరియా నివేదిక తర్వాత కుంభమే ళాను కించపరిచేలా అసత్య ప్రచారాలు చేస్తున్నా రని ఆరోపించారు. నీటి నాణ్యతపై యూపీ పీసీబీ నిరంతరం పర్యవేక్షిస్తోందని చెప్పారు. బుధవారం నివేదికల ప్రకారం సంగమం వద్ద నీటిలో బీవోడీ పరిమాణం 3 కంటే తక్కువగానే ఉందని, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీవో) 8 నుంచి 9 వరకూ నమోదైందని యోగి వివరించారు. దీనిప్రకారం సంగమం లోని నీరు స్నానాలకే కాదు ఆచమనా నికి కూడా అనుకూలమేనని స్పష్టం చేశారు. మహాకుంభమేళాలో ఇంకా ఏడు రోజులు మిగిలి ఉన్నాయని, బుధ వారం మధ్యాహ్నం వరకూ 56.25 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని సీఎం ప్రకటించారు. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు, రోడ్డు ప్రమా దాల్లో మృతిచెందినవారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీన్ని కూడా రాజ కీయం చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీ, టీఎంసీ నేతలు బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేస్తున్నా రని, సనాతన ధర్మానికి సంబంధించిన కార్యక్ర మాలు నిర్వహించడం నేరమైతే తమ ప్రభుత్వం ఆ నేరాన్ని చేస్తూనే ఉంటుందని యోగి స్పష్టం చేశారు.

కుంభమేళాతో 3లక్షల కోట్ల వ్యాపారం

ప్రయాగ్‌రాజ్‌లో రూ.3లక్షల కోట్ల వ్యాపారాన్ని సృష్టించడం ద్వారా మహా కుంభమేళా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక కార్యక్రమాల్లో ఒకటిగా మారిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (కాయిట్) సెక్రటరీ జనరల్, ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. కుంభ్ ప్రారంభానికి ముందు 40కోట్ల మంది ప్రజలు వస్తారని, సుమారు రూ.2లక్షల కోట్ల లావాదేవీలు సాగుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఇప్పటికీ వెల్లువలా తరలివ స్తున్న భక్తులను చూస్తుంటే ఈ నెల 26న కుంభ మేళా చివరిరోజు నాటికి వీరి సంఖ్య 60 కోట్లు దాటుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాగ్ రాజ్‌తో పాటు దానికి 150 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పట్టణాలు, నగరాల్లో కూడా గణనీయమైన వ్యాపారాభివృద్ధి జరిగిందని తెలిపారు.

12ఏళ్ల నుంచి ఏం చేస్తున్నారు?: అవిముక్తేశ్వరానంద

మహాకుంభ్.. 'మృత్యుకుంభ్'గా మారుతోందంటూ వ్యాఖ్యానించిన బెంగాల్ సీఎం మమతకు ఉత్తరా ఖండ్‌లోని జ్యోతిష్ పీఠ్ 46వ శంకరాచార్య అవిము క్తేశ్వరానంద సరస్వతి మద్దతు పలికారు. కుంభమే ళా నిర్వాహకులు సరైన రద్దీ నియంత్రణ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. '12ఏళ్ల తర్వాత కుంభ మేళా వస్తుందని 12 ఏళ్ల క్రితమే తెలుసు. అయినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదేం' అని నిలదీశారు.

సంస్కృతి పరిరక్షణకు యూపీ స్ఫూర్తితో కంకణబద్ధులు కావాలి



» మహా కుంభమేళాలో కుటుంబ సభ్యులతో పురందేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మన దేశంలోని ప్రతి ఒక్కరూ హాయిగా, ఆనందంగా ఉండాలని గంగాదేవిని వేడుకున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మహా కుంభమేళాను పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగ్ రాజ్‌లోని త్రివేణి సంగమంలో ఆమె పవిత్ర పుష్కర స్నానం ఆచరించారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చేసిన అద్భుతమైన ఏర్పాట్లు చూసి ఆశ్చర్యం కలిగిందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

ఎన్నికల ఫలితాలకు ఇక మీదే బాధ్యత

ఏఐసీసీ ఇన్‌చార్జులకు ఖర్గే స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: పార్టీలో భారీగా సంస్థాగత మార్పులు చేపట్టిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే.. భవిష్యత్‌లో రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల ఫలితాలకు ఆ రాష్ట్రా లకు ఇన్‌చార్జులుగా ఉన్న ఏఐసీసీ ఆఫీసు బేరర్లనే జవా బుదారీ చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయమైన ఇందిరాభవన్‌లో ఆయన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. పార్టీ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ వాద్రా, సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా హాజరయ్యారు. 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్' కార్యక్రమం మరో ఏడాది కొనసాగుతుందని.. ఇందులో భాగంగా పాదయాత్రలు, చర్చలు, వీధిమ లుపు సమావేశాల వంటివి నిర్వహిస్తామని ఖర్గే చెప్పారు. 'ఎన్నికల ముందు కొత్త ఓట ర్లను బీజేపీ చేరుస్తోంది. ఈ తరహా రిగ్గిం గ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవాలి' అని సూచించారు. అమెరికా నుంచి పంపేస్తున్న భారతీయులకు అవమానాలు జరక్కుండా నిరోధించడంలో ప్రధాని మోదీ విఫలమ య్యారని, బహిరంగంగా నిరసన తెలుప డంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.



ఏఐసీసీ ఇన్‌చార్జులతో భేటీలో ఖర్గే, వేణుగోపాల్, రాహుల్

మదనపల్లె ఫైళ్ల కేసు.. 5 నెలల్లో తుది దశకు!

» లోతుగా సీఐడీ దర్యాప్తు

» ఇప్పటికే కొందరి అరెస్టు

» రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా వెల్లడి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె ఫైల్స్ దహనం కేసు ఐదు నెలల్లో తుది దశకు చేరుతుందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పరిపాలనా భవనాన్ని కలెక్టర్ శ్రీధర్‌తో కలసి ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్లను దహనం చేసిన కేసులో సీఐడీ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారని.. ఇప్పటికే కొందరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. 'ఈ కేసులో బయటి వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది రాజకీయ నాయకులపై ప్రజలు ఫిర్యాదు చేశారు. రెవెన్యూపరంగా అన్ని అర్జీలను విచారించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాం. వాటి ఆధారంగా సీఐడీ పోలీసులు కూడా దర్యాప్తు వేగవంతం చేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 2,400 కీలక ఫైళ్లను రికవరీ చేశాం. ఏడు నెలల క్రితం నేను మదనపల్లెకు వచ్చినప్పుడు 487 మంది ప్రజలు భూసమస్యలపై అర్జీలు ఇచ్చారు. వాటిలో 80 శాతం పరిష్కరించాం. మిగిలిన 20 శాతానికి సంబంధించి కోర్టు కేసులు, ఆర్‌వోఆర్ అప్పీల్స్ పెండింగ్ ఉన్నాయి' అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ జరిగిందని.. వీటిలో 8 వేల ఎకరాల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు తేలాయని చెప్పారు. వీటి రిజిస్ట్రేషన్ రద్దుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో 350 తహశీల్దార్, 250 డిప్యూటీ తహశీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని మీడియా ప్రస్తావించగా.. ఈ పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్లు, పదోన్నతి భర్తీలకు సంబంధించి కోర్టు కేసులు ఉన్నాయని, వీటి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక అడ్వకేట్ జనరల్‌ను నియమించామని చెప్పారు. తీర్పు వచ్చిన వెంటనే తహశీల్దార్ల నియామకం చేపడతామన్నారు. కోర్టు కేసులు పరిష్కారమైతే అన్నీ సర్దుకుంటాయని సిసోడియా చెప్పారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఉన్నారు.





బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం ఆలయంలో ధ్వజపటం ఆవిష్కరణ, యాగశాలలో ఉత్సవమూర్తులు(ఇన్‌సెట్లో)

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ధ్వజారోహణంతో సకల దేవతలకు ఆహ్వానం

శ్రీశైలం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు యాగశాల ప్రవేశంతో ఉత్సవాలను ఆలయ అర్చకులు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షకుడైన చండీశ్వరుడికి ప్రత్యేకంగా పూజలు జరిపారు. రాత్రి 7 గంటలకు బేరిపూజ, బేరితాండవం సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ, ధ్వజపటం ఆవిష్కరణతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారంచుట్టారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామివార్లకు శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మార్చి 1న ముగియనున్నాయి. కాగా గురువారం స్వామి, అమ్మవార్లకు భృంగివాహన సేవ నిర్వహించనున్నారు.

రేపటి నుంచి శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14 రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలకు 21న కన్నప్ప ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. భక్తుడైన కన్నప్పకు తొలి పూజలు అందుకునేలా ఇచ్చిన వరాన్ని ఈ క్షేత్రంలో నిర్వహించడం అనాదిగా వస్తోంది. 21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామి వారి ధ్వజారోహణం నిర్వహించనున్నారు.



రేపటి నుంచి హై లైఫ్ ఎగ్జిబిషన్

▸ రెండ్రోజులపాటు విజయవాడలో నిర్వహణ

విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ప్రియమైన లగ్జరీ షాపింగ్ అనుభవం విజయవాడ ప్రజలకు అందించడానికి సిద్ధమైంది. హై లైఫ్ ఎగ్జిబిషన్, ప్రత్యేక ప్రదర్శన రేపు, ఎల్లుండి విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో జరగనుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని అత్యుత్తమ డిజైనర్ల నుంచి ఎంపిక చేయబడిన హైఎండ్ డిజైనర్ దుస్తులు, అద్భుతమైన ఆభరణాలు, బెస్పోక్ ఫ్యాషన్ ఉపకరణాలు, కళాత్మక గృహాలంకరణల ఎంపిక చేసిన సేకరణను ఇందులో అందుబాటులో ఉంచామన్నారు. మరచిపోలేని అనుభవం కోసం, ఉత్తమ షాపింగ్ అనుభూతి కోసం హై లైఫ్ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని నిర్వాహకులు కోరారు.

'తహశీల్దార్' భూములపై కలకలం!

సమగ్ర విచారణకు రెవెన్యూ శాఖ ఆదేశం

- రెడీమేడ్ డ్రామా రెడీచేసిన విశాఖ అధికారులు
- సాంకేతిక పొరపాటంటూ నివేదిక
- కంప్యూటర్ ఆపరేటర్‌పై నెట్టేసే యత్నం
- నమ్మశక్యంగా లేదన్న ఉన్నతాధికారులు
- ఆ తహశీల్దార్‌కు ఆ మండలంతో సంబంధమే లేదు
- మరి అక్కడి భూములకు ఆయన ఆధార్‌ను ఎలా సీడింగ్ చేస్తారు?
- ఆయన మరణించాక.. ఆ భూముల మ్యుటేషన్ ఎవరు చేశారు?
- ఆసాంతం పరిశీలించాలని స్పెషల్ సీఎస్ సిసోడియా నిర్దేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖ జిల్లాలో రిటైర్డ్ తహశీల్దార్ లాలం సుధాకర్‌నాయుడి పేరిట 400 ఎకరాల భూములు నమోదైన వ్యవహారం రెవెన్యూ శాఖ ప్రతిష్ఠను మరింత మసకబార్చింది. ప్రజలు, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే వందల ఎకరాల సర్కారు, ప్రైవేటు భూములను తమ ఖాతాలో వేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపుతోంది. దీంతో రెవెన్యూ శాఖ సమగ్ర విచారణకు ఆదేశించింది. సుధాకర్‌నాయుడి ఖాతాలో 400 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఎలా నమోదు చేశారో విచారించి నివేదిక ఇవ్వాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), విశాఖ జిల్లా కలెక్టర్‌ను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా నిర్దేశించారు. ఇంకా ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నాయేమో రికార్డులను ఆసాంతం పరిశీలించాలని స్పష్టం చేశారు. నిజానికి కూటమి ప్రభుత్వం వచ్చాక అసైన్డ్ భూముల అక్రమాలను నిగ్గుతేల్చేందుకు రెవెన్యూ రికార్డుల పునఃపరిశీలన జరిగింది. డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్, సర్వేయర్‌లతో కూడిన బృందాలు విచారణ జరిపాయి. ఆ సమయంలోనూ ఈ అక్రమం వెలుగు చూడలేదు. అసలు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో అసైన్డ్ భూముల అక్రమాలే జరుగలేదంటూ అధికారులు నివేదికలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు తహశీల్దార్ పేరిట 400 ఎకరాల భూములున్నట్లు వెలుగు చూడడం సంచలనంగా మారింది. 'రిటైర్డ్ తహశీల్దార్ పేరుతో 400 ఎకరాలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏం జరిగిందో తెలుసుకునేందుకు రెవెన్యూ శాఖ మధ్యాహ్నం వరకు అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు అదేదో సాంకేతిక పొరపాటుగా చూపించేందుకు విశాఖ అధికారులు ముందుగానే స్కెచ్ సిద్ధం చేసి పెట్టారు. పొరపాటున సుధాకర్‌నాయుడి ఆధార్ నంబర్‌ను ఆ భూములతో సీడింగ్ చేశారని.. అది కంప్యూటర్ ఆపరేటర్ చేసిన పొరపాటుగా ఓ రెడీమేడ్ డ్రామాను తయారుచేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇది నమ్మశక్యంగా లేదని రెవెన్యూ ఉన్నతాధికారులే చెబుతున్నారు. 'ఆ మండలంతో సంబంధమే లేని ఓ (రిటైర్డ్) తహశీల్దార్ ఆధార్ నంబర్‌ను సంబంధం లేని భూములకు ఎలా సీడింగ్ చేస్తారు? సీడింగ్ చేసే సమయంలో ఇటు తహశీల్దార్‌కు, అటు ఆధార్ నంబర్ ఉన్న వ్యక్తికి ఓటీపీలు వస్తాయి. ఇదేదో ఆదమరపులో చేసే పనికాదు' అని స్పష్టం చేస్తున్నారు. భూగరిష్ఠ పరిమితి (ల్యాండ్ సీలింగ్) చట్టం అమల్లో ఉన్నప్పుడు.. ఒకే వ్యక్తి పేరిట వందల ఎకరాలు ఎలా నమోదు చేస్తారన్న ప్రశ్నకూ జవాబు రాలేదు. కంప్యూటర్ ఆపరేటర్‌కు తహశీల్దార్ లాగిన్ ఇచ్చి పనులు చేయించవద్దని గతంలోనే రెవెన్యూ శాఖ ఆదేశాలు ఇచ్చింది. ఇదేదో సాంకేతికంగా జరిగిన పొరపాటుగా చూపి కంప్యూటర్ ఆపరేటర్‌పైకి నెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఒకవేళ అదే నిజమైతే.. మరణించిన రిటైర్డ్ తహశీల్దార్ పేరు మీద ఉన్న భూములను ఇతరుల పేరిట ఎలా మ్యుటేషన్ చేశారు? తహశీల్దార్ ఆమోదం లేకుండా ఇదేదీ జరిగే అవకాశం లేదన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ నేపథ్యంలోనే సమగ్ర విచారణ జరపాలని సిసోడియా ఆదేశించారు.

సుధాకర్‌నాయుడి ఖాతా నంబర్‌పై 470 ఎకరాలు: జేసీ

- నా అన్న పేరుతో నమోదు చేసిందెవరు?
- ఇప్పుడు ఎవరి పేరిట బదిలీ చేస్తున్నారు?
- తేల్చాలని రిటైర్డ్ తహశీల్దార్ తమ్ముడి డిమాండ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ తహశీల్దార్ సుధాకర్‌నాయుడి ఖాతాపై పెందుర్తి మండలంలో 400 ఎకరాలు కాదు.. 470 ఎకరాలపైనే ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు ఈ విషయాన్ని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సాధారణంగా రైతుల వివరాలు తెలియనప్పుడు స్థానిక మండలాధికారి నోషనల్ ఖాతా ఏర్పాటుచేసి అందులో నమోదు చేస్తారని.. అయితే ఈ కేసులో సుధాకర్‌నాయుడి ఆధార్ నంబరు కూడా లింకై ఉందన్నారు. అలా చేయాల్సిన అవసరం లేదని, కానీ ఎవరు చేశారు.. ఎందుకు చేశారో విచారణ చేస్తామని చెప్పారు. ఎక్కువగా వ్యవసాయ భూములే ఆయన ఖాతాపై ఉన్నట్లు గుర్తించామన్నారు. గత నెలలో వాటిలో కొన్ని భూముల మ్యుటేషన్ జరిగిందని.. వాటిపైనా విచారణ జరుగుతుందని తెలిపారు. ఎవరు దరఖాస్తు చేశారు.. వాటిని ప్రాసెస్ చేసిందెవరో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ భూముల వ్యవహారంపై అనుమానాలుంటే నేరుగా తన కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కాగా.. సుధాకర్‌నాయుడి పేరిట పెందుర్తి మండలంలో వందల ఎకరాల భూములు నమోదైన విషయాన్ని జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అదీగాక ఆ అధికారి చనిపోయిన తర్వాత కొన్ని భూములను మ్యుటేషన్ చేశారని తేలడంతో.. ఆ పని చేసింది.. చేయించింది ఎవరనే దానిపై ఆరా తీస్తున్నారు. సుధాకర్‌నాయుడి కుటుంబం రాజకీయంగా క్రియాశీలంగా ఉంది. ఆయన వదిన లాలం భవాని గతంలో విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. వారికి అనకాపల్లి జిల్లాలో వ్యవసాయ భూములు ఉన్నాయి. తమ కుటుంబంలో ఎవరూ పెందుర్తిలో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేయలేదని, ఆయన పేరిట అన్ని వందల ఎకరాలు ఉన్న విషయం కూడా తమకు తెలియదని ఆయన తమ్ముడు లాలం ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. తన సోదరుడి పేరిట భూములు నమోదు చేసి, ఇప్పుడు వాటిని వేరే వారికి ఎలా బదిలీ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'రివర్స్ టెండర్'ను ఎత్తేసిన తుంగభద్ర బోర్డు

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏడాదిపాటు ప్రయోగాత్మకంగా అమలు చేసిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని తుంగభద్ర బోర్డు ఎత్తేసింది. ఈ మేరకు బోర్డు చైర్మన్ ఎస్ఎన్ పాండే అధ్యక్షతన ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ టెండర్ విధానాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చారు. పోలవరం ప్రాజెక్టులో అమలుచేశారు. ఈ విధానాన్ని 2020లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన తుంగభద్ర బోర్డు.. ఏడాదిపాటు చూశాక.. వ్యతిరేక ఫలితాలు వస్తున్నాయంటూ ఆపేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేసింది.

మరో రెండు జీబీఎస్ కేసులు

▸ గుంటూరులో పదికి చేరిన బాధితులు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో కొత్తగా మరో రెండు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసులు నమోదయ్యాయి. దీంతో జీబీఎస్‌తో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ విభాగంలో చేరిన రోగుల సంఖ్య పదికి చేరింది. గత వారం ఎనిమిది మంది చికిత్స పొందగా, తాజాగా మంగళ, బుధవారాల్లో మరో రెండు కొత్త కేసులు నమోదయ్యాయి. సత్తెనపల్లికి చెందిన 58 ఏళ్ల వ్యక్తికి జీబీఎస్ సోకగా, చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. ఇదిలా ఉంటే జీబీఎస్ లక్షణాలతో వివిధ ప్రాంతాలకు చెందిన మరో ముగ్గురు అనుమానిత రోగులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు.

తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద బోర్డు సభ్యుడి వీరంగం ఘటనపై టీటీడీ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. గత మంగళవారం ఉదయం బయోమెట్రిక్ నుంచి బయటకు వెళ్లాలని చెప్పిన ఉద్యోగిపై బోర్డు సభ్యుడు నరేశ్ తిట్ల దండకం అందుకున్న సంగతి తెలిసిందే.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు టీడీపీ, జనసేన మద్దతు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్)కు తెలుగుదేశం, జనసేన మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు విశాఖ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇతర నాయకులు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి లోకేశ్ ఆదేశం మేరకు రఘువర్మకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఎన్డీఏలో మరో మిత్రపక్షం బీజేపీ మద్దతు కోసం ఆ పార్టీ నాయకులతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాసరావు బరి నుంచి తప్పుకున్నట్లు ప్రకటించి, రఘువర్మకు మద్దతు తెలిపారు. బ్యాలెట్ పత్రంలో తన పేరు ఉన్నప్పటికీ రఘువర్మకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 27వ తేదీన జరగనుంది.

రఘువర్మకు స్కూల్ అసిస్టెంట్ల సంఘం మద్దతు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో ఏపీటీఎఫ్-257 అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇవ్వనున్నట్లు స్కూల్ అసిస్టెంట్ల సంఘం ప్రధాన కార్యదర్శి పి.నరోత్తమరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన, అనుభవం ఉన్న రఘువర్మకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని స్కూల్ అసిస్టెంట్లను కోరారు.

టెన్త్ ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వ పరీక్షల విభాగం కీలక మార్పు చేసింది. ఇప్పటివరకూ టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సెకండరీ గ్రేడ్ టీచర్లు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తుండగా తొలిసారి స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ), భాషా పండితులకు ఇన్విజిలేషన్ బాధ్యత అప్పగించనుంది. ఈ మేరకు ఎస్ఏలను ఇన్విజిలేటర్లుగా నియమించాలని ఆదేశిస్తూ బుధవారం మార్గదర్శకాలు జారీచేసింది. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ఉండాలని స్పష్టం చేసింది. స్కూల్ అసిస్టెంట్లు సరిపోకపోతే ఎస్జీటీలను తీసుకోవాలని సూచించింది. కాగా.. ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తే సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఎప్పటిలాగే ఎస్జీటీలను నియమించాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ.ప్రసాద్ కోరారు.

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు మే నెల జీతం చెల్లించండి

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు 2024 మే నెల జీతం చెల్లించాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నేతలు కుమ్మరకుంట సురేష్, కల్లూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టు జేఎల్స్‌కు 11 నెలల జీతం ఇస్తున్నారని, కానీ గతేడాది మేలో ఫెయిల్ అయిన విద్యార్థులకు శిక్షణ తరగతులకు తమను వినియోగించుకున్నారని తెలిపారు. తీవ్రమైన ఎండల్లో పనిచేసినందున ఆ నెల జీతం ఇప్పించాలని సీఎంను కోరారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై జడ్జీలతో కమిటీ వేశాం

- దాని నిర్ణయం వచ్చేవరకు వేచిచూడండి
- నివేదికపై అభ్యంతరముంటే సవాల్ చేసుకోవచ్చు
- పిటిషనర్లకు ధర్మాసనం సూచన
- అపరిపక్వ దశలో పిల్ వేశారని వ్యాఖ్య
- విచారణ మూడు నెలలకు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు న్యాయమూర్తులతో కమిటీ వేశామని, అది నిర్ణయం వెల్లడించే వరకు వేచి చూడాలని హైకోర్టు స్పష్టంచేసింది. కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఎవరూ ఊహించలేరు కదా అని వ్యాఖ్యానించింది. ఆ నివేదికను ఫుల్ కోర్టు ముందుపెట్టి బెంచ్ ఏర్పాటుపై ఓ నిర్ణయానికి వస్తామని తెలిపింది. అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారని, కమిటీ నివేదిక ఇచ్చాక దానిపై అభ్యంతరం ఉంటే దానిని సవాల్ చేసుకోవచ్చని పిటిషనర్లకు స్పష్టత ఇచ్చింది. విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయవాదులు తాండవ యోగేశ్, తురగా సాయిసూర్య వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. యోగేశ్ స్పందిస్తూ... గుంటూరులో హైకోర్టు బెంచ్ కోసం 1993లో న్యాయవాదులు 103 రోజులపాటు ఆందోళన చేశారని.. బెంచ్ ఏర్పాటును అప్పటి సీజే తిరస్కరించారని తెలిపారు. ప్రజాగళం యాత్ర సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు.. కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు న్యాయశాఖ కార్యదర్శి గతేడాది అక్టోబరు 28న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాసిన లేఖలో ప్రస్తావించారని వివరించారు. ఈ లేఖను పరిశీలిస్తే బెంచ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి, కార్యదర్శి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లుగా ఉందని.. ఇది న్యాయవ్యవస్థ అధికారంలో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ముఖ్యమంత్రి, న్యాయశాఖ కార్యదర్శి నిర్ణయాలకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంది. బెంచ్ ఏర్పాటు విషయంలో కమిటీ నిర్ణయం వెల్లడించాల్సిన నేపథ్యంలో పిల్ ఉపసంహరించుకోవాలని పిటిషనర్లకు సూచించింది. దానిని పెండింగ్‌లో ఉంచాలని తాండవ యోగేశ్ అభ్యర్థించడంతో విచారణను వాయిదా వేసింది. ఇదే వ్యవహారంపై న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను కూడా దీనికి జతచేస్తూ విచారణనూ 3 నెలలకు వాయిదా వేసింది.

అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీం మార్గదర్శకాలు పాటించండి

కిరణ్ రాయల్‌పై కేసులో పోలీసులకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్ కిరణ్ కుమార్(కిరణ్ రాయల్)పై ఎస్వీయూ క్యాంపస్ ఠాణాలో నమోదైన కేసు విషయంలో అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు పాటించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. లక్ష్మీరెడ్డి అనే మహిళ ఫిర్యాదు ఆధారంగా తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు కిరణ్ రాయల్‌పై కేసు నమోదు చేశారు. విచారణకు హాజరుకావాలంటూ సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఈ నెల 13న ఆయనకు నోటీసులు ఇచ్చారు. అర్నేష్ కుమార్ కేసులో సుప్రీం మార్గదర్శకాలు అనుసరించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ కిరణ్ రాయల్ తాజాగా హైకోర్టును ఆశ్రయించారు.

విద్యుత్ ఒప్పందాల్లో పెద్ద కుంభకోణం: సీపీఎం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాల్లో పెద్ద కుంభకోణానికి పాల్పడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాక్సిస్ ఎనర్జీ కంపెనీతో యూనిట్ విద్యుత్ సరఫరాకు రూ.4.23లతో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందం వెనుక మతలబు ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ప్రజలపై రూ.2లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా పీటముడి

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌ను అసమర్థుడిగా, ఉగ్రవాదిగా అభివర్ణిస్తూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా మంగళవారం తీవ్ర విమర్శలు చేశారు. అవామీలీగ్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి, వర్చువల్‌గా చేసిన ప్రసంగంలో తాను స్వదేశం తిరిగివచ్చి, జరిగిన నష్టానికి ప్రతీకారం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమికొట్టాలంటూ పిలుపునిచ్చారు. ఆమె భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న విషయం ప్రపంచమంతటికీ తెలుసు. మీ దేశంలో కూర్చొని మాకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయనివ్వకండి అని బంగ్లాపాలకులు మనకు ఎప్పటికప్పుడు ఓ సుతిమెత్తని హెచ్చరిక చేస్తుంటారు. ఆమె నిశ్శబ్దంగా ఉంటే సంబంధాలు మెరుగుపడతాయని ఆశపెడుతుంటారు. ఆమె నోరువిప్పినప్పుడల్లా అప్పగింత డిమాండ్‌ను గుర్తుచేస్తుంటారు. ఎప్పటిలాగానే ఆమె జూమ్‌కాల్‌లో చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా హసీనాను వెనక్కు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని యూనస్ కార్యదర్శి ప్రకటించారు. అధికారంలో ఉండగా ఆమె చేసిన నేరాలూ ఘోరాలకు తగిన శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారాయన. స్వదేశానికి వెళ్ళి ప్రతీకారం తీర్చుకుంటానని హసీనా, వెనక్కు రప్పించి తీరుతామని యూనస్ ఎలాగూ అంటున్నందున, పంపిచేస్తే సరిపోతుంది కదా అన్నది కొందరు సరదాగా చేస్తున్న వ్యాఖ్య.

కొద్దిరోజుల క్రితం భారతవిదేశాంగ మంత్రి జయశంకర్‌తో బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహీద్ హుస్సేన్‌తో మస్కట్‌లో చర్చలు జరిపారు. ఉభయదేశాల సంబంధాలు ప్రస్తుతం మెరుగుపడుతున్నాయని, ఏప్రిల్‌లో బిమ్స్‌టెక్ సదస్సు సందర్భంగా మోదీ, యూనస్ భేటీ జరిగినపక్షంలో ఘర్షణ మరింత తొలగిపోతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. బోర్డర్‌గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) ప్రతినిధి బృందం సరిహద్దు సమస్యల పరిష్కారం, సమన్వయం లక్ష్యంగా చర్చలకు మనదేశం రావడం మంచి సంకేతం. గత ఆర్నెల్లకాలంలో స్మగ్లర్లు, క్రిమినల్స్ సహా వందలాది చొరబాటు యత్నాలు జరగడం, కొందరిని బీఎస్ఎఫ్ కాల్చివేయడం ఉద్రిక్తతలకు దారితీస్తోంది. సరిహద్దు నిర్వహణ సజావుగా ఉంటే, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటానికి అవకాశం ఏర్పడుతుంది.

హసీనా నిష్క్రమణ తరువాత, యూనస్ ప్రభుత్వం పాకిస్తాన్‌కు అన్ని రంగాల్లో వేగంగా దగ్గరవుతోంది. పాకిస్థాన్ ప్రధానితో యూనస్ పలుమార్లు భేటీ అయ్యారు. మంత్రులు, ఉన్నతస్థాయి సైనికాధికారుల రాకపోకలు సాగుతున్నాయి. సైనికశిక్షణలు, ఉమ్మడి విన్యాసాలకు అవగాహనలు, ఒప్పందాలు కుదిరాయి. ప్రభుత్వం ఎంత దగ్గరవుతున్నప్పటికీ, ప్రజలు చారిత్రకంగా తమకు జరిగిన అన్యాయాన్ని విస్మరించి పాకిస్థాన్‌కు చేరువకాకపోవచ్చు. అంతమాత్రాన యూనస్ ప్రభుత్వంతో ఎంతోకొంత స్థాయిలో వ్యవహారాలు నడపకుండా వదిలివేయడం సరికాదు. భారతప్రధాని మోదీ ఒక్కసారి కూడా యూనస్‌తో భేటీ కాకపోవడం వల్ల మనకు కొత్తగా ఒరిగేదీ కూడా ఏమీ లేదు. సరిహద్దు ఉగ్రవాదం, ఆయుధాల అక్రమరవాణా తదితర కీలకమైన అంశాల విషయంలో నిక్కచ్చిగా ఉంటూ, మిగతా విషయాల్లో గతంలో మాదిరిగానే ఇచ్చిపుచ్చుకొనే వైఖరి చూపవచ్చు. సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న భారత్‌ను కాదని, పాకిస్థాన్‌తో వ్యవహరించడంలో బంగ్లాదేశ్‌కు కచ్చితంగా కొన్ని భౌగోళిక పరిమితులు ఉంటాయి. అప్పుల్లో ఉన్న పాకిస్థాన్ కంటే భారత్‌తోనే తమకు మేలు జరుగుతుందని బంగ్లాదేశ్ ప్రజలకు తెలియకపోదు. హసీనా వ్యాఖ్యానించినప్పుడల్లా బంగ్లాదేశ్‌లో మైనారిటీలమీద దాడులు జరుగుతాయి, ఢాకా నడిబొడ్డున పాలకుల పరోక్ష ఆశీస్సులతో జరిగిన బుల్‌డోజర్ మార్చ్‌లో భాగంగా ముజిబూర్ రహ్మాన్ ఇల్లు నేలమట్టమవుతుంది. యూనస్ ప్రభుత్వం పాకిస్థాన్‌కు చేరువుగా అడుగులు వేసినప్పుడల్లా హసీనా విమర్శలు చేస్తున్నారు. ఉభయ దేశాల మధ్యా ఈ విష వలయాన్ని ఛేదించాలంటే హసీనా కొంతకాలం మాట్లాడకపోవడం అవసరం. బంగ్లాదేశ్ వ్యవహారాలను అమెరికా పట్టించుకోదని, ఆ దేశాన్ని ప్రధానమంత్రికి ఇచ్చేశానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మోదీ సమక్షంలో ప్రకటించారు. చేతికందిన ఆయుధాన్ని అతిజాగ్రత్తగా వినియోగించడం మన చేతుల్లోనే ఉంది.

కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలూ!



ఈ మధ్య, 'కృత్రిమ మేధ'ని ఆకాశానికి ఎత్తేస్తూ పత్రికల్లో వ్యాసాలూ సంపాదకీయాలూ వస్తున్నాయి. దాన్ని 'శ్రేయో మేధ' అనీ, 'మేధో విప్లవం' అనీ, ఇంకేదో అనీ, చెపుతున్నారు. 'కృత్రిమ మేధ' గురించి నాకు పెద్దగా తెలియదు. అందుకని, కంప్యూటర్ రంగంలో దాదాపు 40ఏళ్ళ అనుభవం వున్నవాడు, అమెరికాలో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసిన జె.ప్రసాద్‌తో మాట్లాడితే, కొంచెం అర్థం అయింది. అయితే, నేను ఈ వ్యాసంలో రాయదలుచుకున్నది, ఆ సైన్స్ గురించి కాదు. నిజానికి ఏ సైన్సు అయినా, ప్రస్తుత సమాజంలో, ఏ వర్గ ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందో చెప్పాలని మాత్రమే!

'కృత్రిమ మేధ' అనేది, మనుషులు కొన్ని పనులు జరగడం కోసం రాసుకునే ఒక కంప్యూటర్ ప్రోగ్రాం అట! ఇంకా, సరిగా చెప్పాలంటే, 'మనుషులు రాసుకునే' అనే బదులు, 'పెట్టుబడిదారీ యజమానులు రాయించుకునే' అంటేనే బాగా సరిపోతుంది! మొత్తానికి, 'కృత్రిమ మేధ' అంటే, ఒక 'కంప్యూటర్ మీద పని చేసే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం' అనుకోవచ్చు. ఈ ప్రోగ్రాం, మానవ భాషనూ, వ్యక్తీకరణనూ అర్థం చేసుకుంటూ, అనేక రంగాలకు సంబంధించిన, ఎంతో విస్తారమైన సమాచారాన్ని పోగుచేసి, అనేక విషయాలను, అనేక కోణాల్లో వివరంగా విశ్లేషించి చెపుతుందట! 'కృత్రిమ మేధ' కూడా మానవులు తమ 'ఉత్పత్తి శక్తులు పెరగడం కోసం' తయారు చేసుకున్న ఒక సాధనమే! 'ఉత్పత్తి శక్తులు పెరగడం' అంటే మెరుగైన ఉత్పత్తి సాధనాలను చేతిలోకి తీసుకుని పనిచేసే శ్రామికులు (ఇక్కడ 'సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు') తక్కువ మంది, తక్కువ సమయంలో, ఎక్కువ పనిని, ఎక్కువ సామర్థ్యంతో చేయడం. అంతే! (వారికి పని గంటలు తగ్గేదేమీ వుండదు సుమా!)

ఈ 'కృత్రిమ మేధ' చేయగలిగే పనులు ఇన్నిన్ని కావట! ఎన్నెన్నోనట! వాటిల్లో కొన్ని మాత్రమే చూద్దాం ఇక్కడ: (1) ఏ రంగానికి సంబంధించినదైనా, అనంతమైన సమాచారాన్ని, అతితక్కువ సమయంలో, వేగంగా, ఎక్కువ ఖచ్చితత్వంతో, అనేక కోణాల్లో విశ్లేషిస్తుందట! (2) రోగ నిర్ధారణను పొరపాట్లు లేకుండా చేసి, చికిత్సా విధానాలను కూడా సూచిస్తుందట! (3) రక రకాల రచనలనూ, అనువాదాలనూ, అతి తక్కువ సమయంలో, వేగంగా, అతి తక్కువ దిద్దుబాట్లు మాత్రమే అవసరమయ్యే విధంగా, చేస్తుందట! (4) వాతావరణంలో మామూలు ఊహకు అందని ఏ మార్పులు రావచ్చునో, వాటిని ఏ విధంగా ఎదుర్కోవచ్చునో, ఖచ్చితమైన అంచనా వేసి చెపుతుందట. (5) స్కూలు పిల్లలకి హోమ్‌వర్కులు చేసి పెడుతుందట! లెక్కలు కూడా చేసి పెడుతుందట! అనేక భాషల్లో ఏ విషయం మీదైనా సరే వ్యాసాలు రాసి పెడుతుందట. (6) సాఫ్ట్‌వేర్ విద్యార్థులకు కొత్త ప్రోగ్రాములు రాసి పెడుతుందట. (7) ఒక కొత్త ప్రోగ్రాముని, ఎవరన్నా తయారు చేస్తే, దాన్ని పరిశీలించి, దాన్ని 'కృత్రిమ మేధ' రాసిందో, మనుషులు రాశారో, తేల్చి చెబుతుందట. (8) కావలిసిన విధంగా, అన్నిరకాల సినిమాలకీ– సాంఘికాలకీ, జానపదాలకీ, పౌరాణికాలకీ–కథల్నీ, సన్నివేశాల్నీ, సంభాషణల్నీ, పాటల్నీ, సంగీతాన్నీ, దృశ్యాల్నీ... ఇలా ఏ రకం సినిమా తీయదలుచుకున్నారో, ఆ రకంగా చేసిపెడుతుందట! (9) మర మనుషులతోనూ (రోబోట్స్‌తో), మానవరహిత వాహనాలతోనూ (డ్రోన్స్‌తో) రకరకాల వ్యాపారాల శాఖలలో, అతి తక్కువమంది ఉద్యోగులతో పనిచేయిస్తుందట. (10) నేలమీదే కాదు, అంతరిక్షంలో కూడా పరిశోధనల్ని తేలిగ్గా చేసిపెడుతుందట! – ఇలా, ఒకటేమిటి, ఇందు గలదందు లేదని, సందేహము వలదు! ఎందెందు వెతికి చూసిన అందందే, "కృత్రిమ మేధ"ని ఉపయోగించి, కంపెనీలు, ఎన్నో లాభాలు గడించవచ్చునట!

> 'కృత్రిమ మేధ' వల్ల, కొద్దికాలంలోనే, ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయనీ, కేవలం 9 కోట్ల, 70 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వస్తాయనీ తేలింది. అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వంకర వాదనలు చేస్తూనే వున్నారు. ఈ టెక్నాలజీ వల్ల తోటి మనుషులకు పనులు పోయే, తిండిపోయే పరిస్థితులు వస్తున్నాయి. ఇదంతా, కేవలం లాభాపేక్షతో నడిచే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వల్లనే.

కొంతమంది పెట్టుబడిదారులు, ఒక 'కృత్రిమ మేధ' కంపెనీ మొదలుపెట్టి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లని జీతాలకి పెట్టుకుని, కొత్త కొత్త సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాములు రాయిస్తారు. ఆ ప్రోగ్రాములు అనేక రకాలుగా వుంటాయి. ఆస్పత్రులకూ, సైన్సు పరిశోధనలకూ కావలిసినవి ఒక రకం! బ్యాంకులకు కావలిసినవి ఇంకో రకం! పెద్ద పెద్ద యంత్రాలతో నడిచే పరిశ్రమలకి మరో రకం! అంతరిక్ష పరిశోధనలకు ఇంకో రకం ప్రోగ్రాములు! సినిమాలకు అన్నిటినీ మించిన రకం! – ఇలా, 'కృత్రిమ మేధ' అనే సైన్సుతో, రకరకాల ప్రోగ్రాముల్ని తయారు చేయించే కంపెనీలు ప్రపంచంలో దాదాపు 70 వేల దాకా వున్నాయని ఒక లెక్క! ఈ కంపెనీల్లో తయారయ్యే ప్రోగ్రాములన్నీ అమ్మకం కోసం తయారైన సరుకులే! కాకపోతే, అవి సబ్బుల్లాగో, చెప్పులూ, చొక్కాలూ లాగో, వస్తువులుగా వుండవు.

తేలిగ్గా అర్థం చేసుకోవడానికి, 'కృత్రిమ మేధ' అనే దాన్ని, పోలిక కోసం, ఒక పనిముట్టుగా, ఒక యంత్రంగా చెప్పుకోవచ్చు. కాకపోతే, అది ఒక కదిలే యంత్రంలా వుండదు. దాన్ని చేత్తో ముట్టుకోలేము. అది యంత్రాలకి నేర్పడానికి కొన్ని సూత్రాల, సూచనల రూపంలో ('సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం'గా) వుంటుంది. దానిని ఉపయోగిస్తూ, కొత్తగా శ్రమలు జరుగుతాయి. దాన్ని సరిగా వాడుకుంటే, దాని ఉపయోగాలు దానికుంటాయి. తక్కువ సమయంలో, తక్కువమంది మేధా శ్రామికులతో, ఎక్కువ పని జరగడానికి ఉపయోగపడుతుంది. ఈ కొత్త టెక్నాలజీ, పెట్టుబడిదారీ యజమానుల చేతుల్లో ఆస్తిగా ఉంటుంది కాబట్టి, దీన్ని 'పెట్టుబడిదారీ మేధ' అని అంటే ఎక్కువ సరిగా వుంటుంది! ఎక్కువ లాభాల్ని తెచ్చిపెట్టేదిగా వుంటుంది కాబట్టే, ఈ రంగంలో పెట్టుబడులు క్రమంగా పెరిగిపోతున్నట్టు వార్తలొస్తున్నాయి. 2025లో, ఈ రంగంలో పెట్టుబడులు దాదాపు 16 లక్షల కోట్ల రూపాయలు అవుతాయట!

ఏ కంపెనీలో పెట్టుబడి అయినా, రెండు భాగాలుగా వుంటుంది గదా? (1) సాధనాల కోసం పెట్టే డబ్బు. 'కృత్రిమ మేధ' కంపెనీలలో, ఉత్పత్తి సాధనాలుగా వుండేవి కంప్యూటర్లూ, లాప్‌టాప్‌లూ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులూ, వగైరా. ఇవి ఎంత సామర్థ్యంగలవిగా వుండాలీ అనేది, తయారు చేయవలిసిన ప్రోగ్రాముల్ని బట్టి వుంటుంది. మామూలు కంప్యూటర్లూ, లాప్‌టాపులూ సరిపోతాయా; లేకపోతే, సూపర్ స్పీడ్ కంప్యూటర్లు కావాలా అనేది వ్యాపార స్థాయిని బట్టీ, ఆ ప్రోగ్రాముల్ని బట్టీ వుంటుంది. (2) ఆ సాధనాలను ఉపయోగించి, రకరకాల, కొత్త కొత్త ప్రోగ్రాములు తయారు చేసే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకి ఇచ్చే జీతాలు. ఈ జీతాలు, సాధారణంగా, ఇతర రంగాల్లో పనిచేసే ఉద్యోగుల జీతాలకంటే, బాగా ఎక్కువగా వుంటాయి. ఎందుకంటే, వీళ్ళు తయారు చేసే ప్రోగ్రాముల్ని వాడే పరిశ్రమల్లోగానీ, ఇతర పని స్థలాల్లో గానీ, ఎక్కువమంది ఉద్యోగులు అవసరం లేకుండానే పని జరిగేలా, 'కృత్రిమ మేధ'తో తయారైన ప్రోగ్రాములు తయారు చేస్తారు కాబట్టి! – అంటే, 'కృత్రిమ మేధ' అనే కొత్త టెక్నాలజీ ఏయే పని స్థలాల్లోకి వస్తుందో, ఆ పని స్థలాల్లో పనులు చేస్తూ వున్న అనేక మందికి ఉద్యోగాలు పోతాయి. దీనికి పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే పరిష్కారం ఏమిటంటే: అక్కడ పనులు పోయినా, 'కృత్రిమ మేధ' కంపెనీల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయి అని! కానీ, నిజమైన లెక్కలూ, అంచనాలూ వేరేగా వుంటున్నాయి. 'కృత్రిమ మేధ'కి సంబంధించిన వెబ్‌సైట్ల సర్వేల ప్రకారం, 'కృత్రిమ మేధ'కి సంబంధించిన టెక్నాలజీ వాడడం వల్ల, కొద్ది కాలంలోనే, ప్రపంచవ్యాప్తంగా, 30కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయనీ, కేవలం 9 కోట్ల, 70 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వస్తాయనీ తేలింది! అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వంకర వాదనలు చేస్తూనే వున్నారు.

కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా, ఈ రకం మాటలు, ఈ నాడే కాదు, 150 ఏళ్ళ కిందట కూడా వుండేవని, మార్క్సు 'కాపిటల్' ద్వారా ఇలా తెలుస్తుంది: "కార్మికులను పనినించీ తొలగించే యంత్రాలన్నీ, అదే తరహా కార్మికులను పనిలో నియమించడానికి తగినంత పెట్టుబడిని, అదే సమయంలో, తప్పనిసరిగా విడుదల చేస్తాయని జేమ్స్ మిల్, మాక్ కులోచ్, టోరెన్స్ సీనియర్, జాన్ స్టువర్ట్ మిల్, ఇంకా మొత్తం వరసగా బూర్జువా రాజకీయ అర్థశాస్త్రగ్నులు నొక్కి చెపుతున్నారు...(కానీ) యంత్రాల్లో వచ్చే ప్రతీ మెరుగుదలతోటీ, అది (ఆ పెట్టుబడి) పనిలో నియమించే వారి సంఖ్య తగ్గుతూనే వుంటుంది." ('యంత్రాలూ, ఆధునిక పరిశ్రమలూ' అనే చాప్టర్‌లో.) తేడా అల్లా, మార్క్సు కాలమేమో, ప్రధానంగా భారీ యంత్రాల కాలం. ఇప్పుడేమో, భారీగా వున్న యంత్రాల సామర్థ్యాన్ని మరింత భారీగా మెరుగుపరిచే 'పెట్టుబడిదారీ మేధ' కాలం!

చివరిగా, ఎవరైనా అనవచ్చును: "ఎన్నో గొప్ప ఉపయోగాల్ని ఇచ్చే 'కృత్రిమ మేధ' వంటి టెక్నాలజీని వ్యతిరేకించాలా? గత 200 ఏళ్ళల్లో ఎన్నో రకాల టెక్నాలజీలు రాలేదా? వాటిని ఉపయోగిస్తూనే వున్నాం గదా? కొత్త టెక్నాలజీని వదిలేస్తూ, వెనక్కి, వెనక్కి, గుహల్లో జీవించే కాలానికే తిరిగి పోదామా?" దానికి జవాబు: మంచి టెక్నాలజీని వద్దనడం లేదు. అది సమాజంలో, మానవులందరికీ మంచిదై వుండాలి! దానిని పెట్టుబడిదారీ పద్ధతుల్లో వాడడం వల్ల, శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి. తక్కువ సమయంలో, ఎక్కువ పని జరిగి, ఈ టెక్నాలజీతో నడిచే కంపెనీలకు లాభాలు పెరగవచ్చును గానీ, మెరుగైన టెక్నాలజీతో పనిచేసే శ్రామికులకు పని గంటలు తగ్గుతాయా? ఈ టెక్నాలజీ వల్ల, తోటి మనుషులకు పనులు పోయే, తిండి పోయే పరిస్థితులు వస్తున్నాయి. ఇదంతా, కేవలం లాభాపేక్షతో నడిచే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వల్లనే! దీన్ని వ్యతిరేకించే ఆలోచనా ధోరణినీ, పోరాటాల అవసరాన్నీ గుర్తించాలి! మార్క్సు హెచ్చరించినట్టు, టెక్నాలజీలో "ప్రగతి మరింత తక్కువ కాలంలో, ఒక పద్ధతిలో, మరింత ఎక్కువ పని చేయించుకునేందుకు, అంటే, శ్రమ శక్తిని మరింత తీవ్రంగా దోచుకునేందుకు ఒక సాధనంగా ఎలా ఉపకరిస్తోందో" గమనించాలే గానీ, ఆ టెక్నాలజీ సృష్టించే భ్రమల్లో పడిపోకూడదు!



▪ రంగనాయకమ్మ

కెన్నెడీల వారసత్వంలో మరో అధ్యాయం

తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, ఆకాశాన్నంటుతున్న వైద్య ఖర్చులు, బీమా సంస్థల ఆధిపత్యం, వైద్య సేవల అందుబాటు సమస్యలు, వైద్య లోపాలు వంటి సవాళ్లను అమెరికా ప్రస్తుతం ఎదుర్కొంటున్న తరుణంలో, ట్రంప్ ప్రభుత్వం ఆరోగ్య కార్యదర్శిగా రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ జూనియర్‌ను నియమించడం సార్వజనీన ఆరోగ్య విధానంలో ఒక విప్లవాత్మక మార్పు. ఆయన నియామకాన్ని సెనేట్ 52–48 ఓట్ల తేడాతో అంగీకరించడాన్ని బట్టి అమెరికా రాజకీయాల్లో కెన్నెడీ కుటుంబం ప్రభావాన్ని అవగాహన చేసుకోవచ్చు.

ఆరోగ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాబర్ట్ ఎఫ్. కెన్నెడీ జూనియర్ తండ్రి మాజీ అటార్నీ జనరల్, సెనేటర్ రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ సీనియర్, అతని పెద్దనాన్న అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ, చిన్నాన్న టెడ్ కెన్నెడీ, అతని తల్లి మానవ హక్కుల కోసం పోరాడిన సామాజిక న్యాయ ఉద్యమకారిణి ఎథెల్ కెన్నెడీ. 1968 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో తన తండ్రి హత్యకు గురైనప్పటికీ అది రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ రాజకీయ ప్రస్థానాన్ని ఆపలేకపోయింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసిన జూనియర్ రాబర్ట్, పోటీ నుండి విరమించుకుని, ఎన్నికలలో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ప్రకటించడం కీలక రాజకీయ మలుపుగా మారింది. అమెరికా ఆరోగ్య కార్యదర్శిగా ఆయన నియామకం కెన్నెడీ కుటుంబ చరిత్రలో మరో నూతన అధ్యాయం.

నేడు నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత పర్ల్ ఎస్ బక్ జీవించి ఉన్నట్లయితే తాను ఐదున్నర దశాబ్దాల క్రితం రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ది కెన్నెడీ ఉమెన్'లో రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ రాజకీయ ఆరోహణ గురించి మరో ఆసక్తికరమైన అధ్యాయంగా చేర్చేవారేమో! ఈ పుస్తకంలో కెన్నెడీల రాజకీయ అస్తిత్వం, వారు ఎదుర్కొన్న దురదృష్టకర సంఘటనలు, చైనా కుంగ్ కుటుంబంతో కెన్నెడీ కుటుంబం పోలికలు, 'కర్స్ ఆఫ్ గ్రేట్‌నెస్' (గొప్పతనపు శాపం) గురించి వివిధ కోణాలలో చర్చించారు.



వంశపారంపర్యమే కీలకం కాదు, ప్రజల విశ్వాసమే అసలు ఆధారం అని–ట్రంప్ ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శిగా రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ నియామకం మనకు చెబుతుంది. కెన్నెడీ వారసత్వం ఒక కథ మాత్రమే కాదు, అది ఒక విలువైన సందేశం.

మరో ఆసక్తికరమైన అంశం, కెన్నెడీ కుటుంబానికి, నెహ్రూ–గాంధీ కుటుంబానికి గల కొన్ని సారూప్యతలు. ఇరు కుటుంబాలూ తమ దేశ రాజకీయ ప్రస్థానాన్ని నిర్వచిస్తూ ముందుకు సాగాయి. అలాగే, వారసత్వ పాలనకు తలొంచిన రాజకీయ కుటుంబాల మాదిరిగానే, తీవ్రమైన విషాదాలను సహితం ఎదుర్కొన్నాయి. జాన్ ఎఫ్ కెన్నెడీ, రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ సీనియర్ హత్యకు గురైనట్లే, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు హత్య చేయబడ్డారు. జెఎఫ్‌కె జూనియర్ విమాన ప్రమాదంలో మరణించినట్టే, సంజయ్‌గాంధీ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కెన్నెడీ కుటుంబ సభ్యులు ఎన్నో ముఖ్యమైన హోదాల్లో పని చేసినట్లుగానే, నెహ్రూ–గాంధీ కుటుంబ సభ్యులు కూడా అత్యున్నత పదవులను అలంకరించారు.

కెన్నెడీ కుటుంబ రాజకీయ ప్రయాణం జోసెఫ్ పి కెన్నెడీ సీనియర్ ఇంగ్లాండ్ దేశానికి అమెరికా రాయబారిగా నియామకంతో ప్రారంభమైందనవచ్చు. 1914లో ఆయన వివాహం చేసుకున్న రోస్ ఫిట్జ్‌గెరాల్డ్ కెన్నెడీ, మరో అమెరికన్ రాజకీయ నాయకుడు జాన్ ఎఫ్ ఫిట్జ్‌గెరాల్డ్ కుమార్తె. పర్ల్ ఎస్ బక్ తన పుస్తకంలో ఆమెను కాథలిక్ ఆచార వ్యవహారాలకు ప్రతిరూపంగా, క్రమశిక్షణకు, సహనానికి చిహ్నంగా చిత్రీకరించారు. జోసెఫ్, రోస్ దంపతులు తమ తొమ్మిదిమంది పిల్లలను క్రమశిక్షణ, పట్టుదల, ప్రజా సేవపై అపారమైన నిబద్ధత కలిగి ఉండేలా తీర్చిదిద్దారు. వారి నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు అమెరికా రాజకీయాలపై చెరగని ముద్రవేశారు.

జోసెఫ్ ప్యాట్రిక్ కెన్నెడీ అమెరికా అధ్యక్షుడు కావాలనుకున్న తన అభిలాషను కుమారుల ద్వారా నెరవేర్చాలనే సంకల్పంతో, ఆ ధైర్యాన్ని వారికిచ్చారు. 1932 అధ్యక్ష ఎన్నికల సమయానికి ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్‌కు ఆర్థిక వనరులను సమకూర్చే కీలకవ్యక్తిగా మారాడు. 1937లో గ్రేట్ బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా ఆయన నియామకం కెన్నెడీ ప్రజాస్వామ్య రాజవంశం బలపడటానికి పునాది వేసింది. అమెరికా అధ్యక్షుడిగా అయ్యే అవకాశం ఉన్నా రాజకీయంగా కొంతకాలం పక్కన పడిపోయిన జోసెఫ్, తన కుమారుల భవిష్యత్తును దేశ రాజకీయాల్లో స్థిరపరిచే దిశగా పట్టుదలతో ప్రయత్నించారు. పెద్ద కుమారుడు జో జూనియర్ అమెరికా అధ్యక్షుడవుతాడనే గాఢమైన నమ్మకం ఏర్పడింది. కానీ రెండో ప్రపంచ యుద్ధంలో కూలి, పేలిపోయిన సైనిక విమానంలో జో జూనియర్ మరణించాడు. దాంతో కుటుంబ ఆశలన్నీ జాన్ ఎఫ్ కెన్నెడీ వైపు మరలాయి. యుద్ధంలో తీవ్రంగా గాయపడి, జీవితాంతం శారీరిక బాధను భరించాల్సి వచ్చినా, జాన్ ఎఫ్ కెన్నెడీ కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాడు. అమెరికా రాజకీయాల్లో మెట్టు మెట్టుగా ఎదిగి, ప్రతినిధుల సభకు, సెనెట్‌కు ఎన్నికై, చివరికి అత్యంత పిన్న వయస్సులో 35వ అమెరికా అధ్యక్షుడయ్యాడు.

ఇక అప్పటి నుండి కెన్నెడీ వారసత్వం సాంస్కృతిక ఆర్భాటం, మనోధైర్యం రెండూ కలిసి ఉన్న విలక్షణ సంప్రదాయంగా నిలిచింది. కెన్నెడీ అనే పేరు అధికార–అవకాశాల ప్రపంచాన్ని ప్రతిబింబించడమే కాదు, బాధ్యతతో కూడిన గొప్ప వంశపారంపర్యాన్ని సూచించసాగింది. అధికారం చేపట్టి వెయ్యి రోజులు గడవకముందే జాన్ ఎఫ్ కెన్నెడీ హత్యకు గురై అమెరికా చరిత్రలో అత్యంత పిన్న వయసులో మరణించిన అధ్యక్షుడయ్యాడు. దశాబ్దాల తరువాత, అతని 38 ఏళ్ల కుమారుడు జాన్ కెన్నెడీ జూనియర్ విమాన ప్రమాదంలో మరణించాడు. కుమార్తె క్యారోలైన్ కెన్నెడీ ఆస్ట్రేలియా, జపాన్‌లకు అమెరికా రాయబారిగా పనిచేసింది. కెన్నెడీ కథ ఇక్కడితో ముగియలేదు. జాన్ ఎఫ్ కెన్నెడీ తమ్ముడు రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ సీనియర్, అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రచారం చేస్తూ హత్యకు గురయ్యాడు. మరొక తమ్ముడు ఎడ్వర్డ్ 'టెడ్' కెన్నెడీ, సెనెట్‌లో దాదాపు 50ఏళ్ల పాటు కుటుంబ రాజకీయ వారసత్వాన్ని స్థిరపర్చాడు. ఇప్పుడు రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ అమెరికా ఆరోగ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడం కెన్నెడీ వారసత్వం కొత్త దశలోకి ప్రవేశించిందనడానికి నిదర్శనం.

వంశపారంపర్యమే కీలకం కాదు, ప్రజల విశ్వాసమే అసలు ఆధారం అని రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ నియామకం మనకు చెబుతుంది. కెన్నెడీ కుటుంబం చేసిన త్యాగాలు, వారి ఆత్మసంఘర్షణలు, నమ్మకాలు, ఇవన్నీ సేవాగుణానికి, నిబద్ధతకు, ప్రజాస్వామ్య న్యాయానికి నిదర్శనం. కెన్నెడీ వారసత్వం ఒక కథ మాత్రమే కాదు, అది ఒక విలువైన సందేశం. అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి దేశాలలో, ఒకే కుటుంబం నుంచి రాజకీయంగా ఎదుగుతున్నవారి ప్రత్యేకతలు అవగాహన చేసుకోకుండా, వారసత్వ రాజకీయాలను అసంబద్ధంగా విమర్శించడం తగదు. మంచిని మంచే అనాలి. తప్పుంటేనే నిష్పక్షపాతంగా ఎత్తిచూపాలి.

• వనం జ్వాలానరసింహారావు



మహాకుంభస్నానం

త్రివేణీసంగమస్థలిలో
సరస్వతీనది అంతర్ వాహినిగా
మునకలేస్తున్న భక్తజనసందోహం
సాధుమహారాజుల షాహీ స్నానం
అఘోరాల, నాగా సన్యాసుల ఆటవిడుపు
రాజఠీవితో మఠాధీశుల దర్శనం!
గుహల నుంచి వెలుగులోకి వచ్చిన
తాంత్రికయోగసాధకుల విన్యాసం
గంగానది తీరమంతా
అఖాడాల గుడారాల పొడవునా
జనప్రవాహమంతా
విభూతి వైభోగాల జాతరలో
క్లిక్‌మంటున్న–
విదేశీ టూరిస్టు కెమరాలు
దృశ్యాల భూమండలీకరణ!
పుష్కరకాల మహాకుంభ స్నానంతో
సజీవ గంగా ప్రవాహం సాక్షిగా
చెరగని జనుల అనాది విశ్వాసాలు!

– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి,
800 పదాలకు మించకూడదు.

మళ్లీ ప్రగతి పట్టాలపై భాగ్యాంధ్ర

> ఈ 10 నెలల కాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 4.3 శాతం మేర పెరిగి 13 శాతానికి చేరుకుంది. ఇది సామాన్యమైన విజయం కాదు. హామీలను దశల వారీగా అమలు చేసేందుకు చంద్రబాబు పటిష్ట ప్రణాళిక రూపొందించారు.



జగన్ ప్రభుత్వ జమానాలో చతికిలపడిన కీలక రంగాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కాయకల్ప చికిత్స సత్ఫలితాలు అందిస్తోంది. ఇందుకు ఉదాహరణ ప్రభుత్వంలో తగ్గిన దుబారా, క్రమంగా పెరుగుతున్న రాష్ట్ర ఆదాయం. రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే రంగాల్లో ఒకటైన వాణిజ్య శాఖ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.41,420 కోట్ల రాబడిని ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరం 10 నెలల్లోనే వాణిజ్య శాఖ వసూళ్లు రూ.41,382 కోట్లు చేరాయి. మరో రెండు నెలల కాలంలో ఇంకో రూ.8,000 కోట్లు పైబడి రాబడి వస్తుందని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలపై అదనపు భారం మోపకుండానే సంప్రదాయ విధానాలలో మార్పులు తెచ్చి, సాంకేతిక పరిజ్ఞానం జోడించడంతో మెరుగైన ఫలితాలు వచ్చినట్లు చంద్రబాబు నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంబంధిత అధికారులు తెలియజేశారు. పరిపాలనలో మార్పు చోటుచేసుకోగానే అధికారుల పని తీరు సైతం మెరుగైంది. చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేస్తున్నారనడానికి ఇదొక ఉదాహరణ.

వాణిజ్యశాఖతో పాటు జీఎస్టీ, వ్యాట్ వసూళ్లల్లో కూడా అధికారులు సమర్థంగా పనిచేస్తూ, లోపాలను సరిచేస్తుండటంతో ఈ రంగాల్లో కూడా ఆదాయం పెరుగుతోంది. ఇక, మద్యం అమ్మకాల ద్వారా జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాకు జమ అయిన మొత్తం కంటే కొందరి వ్యక్తుల జేబుల్లోకి వెళ్లిందే ఎక్కువ కావడంతో, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ శాఖపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పారదర్శక విధానాలు అనుసరించిన కారణంగాను, మద్యం అమ్మకాలను విధిగా డిజిటల్ చెల్లింపుల ద్వారా చేయడం వల్ల రాష్ట్రానికి సమకూరే ఆదాయం గణనీయంగా పెరగనుంది. అదేవిధంగా మైనింగ్ రంగం ద్వారా గతంలో కంటే అధిక మొత్తం ఆదాయం లభించే అవకాశం ఏర్పడింది.

జగన్ పాలనలో విధ్వంసం ప్రజావేదిక కూల్చివేతతో మొదలైనప్పటికీ, ఆర్థిక విధ్వంసం కొంత కనపడే విధంగా, కొంత కనబడని విధంగా జరిగింది. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం ప్రాజెక్టును ముందుకు సాగకుండా నిలిపివేయడం; మూడు రాజధానుల పేరుతో అమరావతి నగరాన్ని పాడు పెట్టడం; రాష్ట్రంలో రోడ్లకు పడిన గుంతలు సైతం పూడ్చకపోవడం, అమరరాజా బ్యాటరీస్ వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమల్ని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టడం; పెట్టుబడులను ఆకర్షించలేకపోవడం జరిగాయి. మ్యాచింగ్ గ్రాంట్ సమకూర్చలేకపోవడంతో 26 కేంద్ర ప్రాయోజిత పథకాలను వదులుకోవడం; కేంద్రంతో సన్నిహితంగా మెలిగినప్పటికీ.. రాష్ట్రానికి న్యాయంగా దక్కవలసిన నిధులను కూడా సాధించలేకపోవడం; విభజన చట్టం హామీల సాధనలో విఫలం కావడం; ల్యాండ్, శాండ్, బీచ్ శాండ్, మైనింగ్ వంటి రాష్ట్రానికి పుష్కలంగా ఆదాయాన్ని అందించే సహజ వనరులను కొల్లగొట్టి రాష్ట్ర ఖజానాకు చిల్లు పెట్టడం; అడ్డదారుల్లో విచ్చలవిడిగా దోచుకోవడం మొదలైన కార్యకలాపాలన్నీ ఆర్థిక దోపిడీ, ఆర్థిక విధ్వంసం కిందకే వస్తాయి.

జగన్ నిర్వాకం, అసమర్థత, అవినీతి... రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు అధోగతి పాల్జేశాయి. నీతి ఆయోగ్ తన 'ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ 2025' నివేదికలో వెల్లడించిన ర్యాంకింగ్‌లను చూస్తే, దేశంలోని అన్ని రాష్ట్రాల ఆరోగ్య స్థితిగతుల పట్టికలో ఆంధ్రప్రదేశ్‌కు 17వ స్థానం దక్కింది. నీతిఆయోగ్ వెల్లడించిన కీలక అంశాల్లో జగన్ జమానాలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితి దిగజారడం ప్రధానమైనది. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ (ఆస్తుల కల్పనకు వినియోగించే ఖర్చు) 60.1 శాతం; సాంఘిక సంక్షేమ సేవల ఖర్చులు 84.3 శాతం మేర తగ్గిపోయినట్లు స్పష్టం చేసింది. అంతేకాదు.. రాష్ట్ర సొంత ఆదాయంలో పెరుగుదల 2018–19లో 17.1 శాతంగా ఉంటే, 2023–24లో 9.8 శాతంకు పడిపోయిందని నీతిఆయోగ్ పేర్కొంది. నిజానికి, ఉమ్మడి రాష్ట్రంలోనూ రాష్ట్రానికి ఇంత తక్కువ ర్యాంకు ఎన్నడూ రాలేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు 1996 నాటి ఆర్థిక పరిస్థితి మరోసారి ఎదురైంది. ఆనాడు ఏ విధంగానైతే ప్రభుత్వోద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని గడ్డు పరిస్థితి ఎదుర్కొన్నారో ఇప్పుడు కూడా అదే స్థితి ఎదురైంది. అయితే, ఆనాడు ఆ ఇబ్బందులను ఆయన చాలా వేగంగా అధిగమించగలిగారు. ఇప్పుడు కూడా ఒట్టిపోయిన రాష్ట్ర ఖజానాను కళకళలాడేలా చేయడం, ధ్వంసమైన వ్యవస్థలను గాడిన పెట్టడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని తన ఆలోచనలకు అనుగుణంగా పని చేయించుకోగలగడం సామాన్యమైన విషయమేమీ కాదు. అయితే, సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న తీరు ఆశావహంగా ఉంది. ఇప్పటికే సామాజిక పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేయడం, సకాలంలో ప్రభుత్వోద్యోగులకు జీతాలు అందించడం, రోడ్ల గుంతలు పూడ్చడం, గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలను విడతల వారీగా కాంట్రాక్టర్లకు చెల్లించడం, పోలవరం ప్రాజెక్టుకు, రాష్ట్ర రాజధాని అమరావతికి కేంద్రం ద్వారా నిధులు సాధించడం, దాదాపు నాలుగు లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఎంఓయూలు కుదుర్చుకోవడం తదితర చర్యలన్నీ పట్టాలు తప్పిన రాష్ట్రాన్ని తిరిగి పట్టాలెక్కించేవే!

ఇప్పటికే ఈ 10 నెలల కాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 4.3 శాతం మేర పెరిగి 13 శాతానికి చేరుకుంది. ఇది సామాన్యమైన విజయం కాదు. అయితే, హామీలను నెరవేర్చే విషయంలో ప్రభుత్వంపై చాలా ఒత్తిడి ఎదురవుతున్నది. వీటిని కూడా దశల వారీగా అమలు చేసేందుకు చంద్రబాబు పటిష్ట ప్రణాళిక రూపొందించారు. 6 కీలక విధానాలు– పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్, క్లీన్ ఎనర్జీ, పర్యాటకం మొదలైన రంగాలలో స్పష్టమైన విధానాలను అనుసరించనున్నారు. అదే విధంగా 'పి4' (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టిసిపేషన్) విధానం ద్వారా ప్రతియేటా రాష్ట్ర స్థూల ఉత్పత్తిని ప్రస్తుతం ఉన్న 13 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని నిర్దేశించుకొన్న లక్ష్యం నెరవేరినట్లయితే, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం కష్టమేమీ కాదు. '2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్' అనేది కేవలం నినాదంగా కాక.. ఒక బలమైన సంకల్పంగా ముందుకు తీసుకెళుతున్నారు.

చంద్రబాబు మొదట్నుంచీ తను ఉన్న కాలాని కంటే ఎంతో ముందుగా ఆలోచన చేస్తారు. 1996 ప్రాంతంలో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన కొన్ని ప్రతిపాదనలు, ఆచరణలోకి తెచ్చిన కొన్ని పథకాల్ని చాలా మంది అర్థం చేసుకోలేక అప్పట్లో ఎద్దేవా చేసేవారు. ఆయన 'ఐటీ' జపం చేస్తున్నాడని, కంప్యూటర్లు కూడు పెట్టవని అవహేళన చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి, పరిపాలనను పరుగుపెట్టిస్తోంటే.. హైటెక్ ముఖ్యమంత్రి అంటూ అపహాస్యం చేయాలని చూశారు. 'విజన్–2020' అంటే అదో పనికిరాని పత్రం అని కొట్టిపారేశారు. కానీ, చివరకు జరిగిందేమిటి? రాష్ట్రానికి ఒక దిశ, దశను చంద్రబాబు ఏర్పరిస్తే.. దానిని అంధకారంలోకి నెట్టేశారు. ఇప్పుడు చంద్రబాబునాయుడు చొరవ, ప్రజల సహకారంతో రాష్ట్రంలో మళ్లీ వెలుగురేఖలు విచ్చుకోవాలి. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్ సగర్వంగా నిలబడాలి. దాదాపు పాతికేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువత శాస్త్ర సాంకేతిక నైపుణ్యం సంతరించుకొని చైతన్యవంతమై మెరుగైన అవకాశాలు పొందడం కోసం రాష్ట్రాన్ని వీడి ప్రపంచంలోని వివిధ దేశాలకు వెళ్లి నిలదొక్కుకొన్నారు. అమెరికాలోనైతే యూదుల మాదిరిగా తెలుగువారు ఎంటర్‌ప్రెన్యూర్స్ అవుతున్నారు. అందరూ గుర్తించే స్థాయిలో ఓ ప్రబల ఆర్థికశక్తిగా తెలుగు కమ్యూనిటీ అవతరించిందనడం అతిశయోక్తి కాదు.

ప్రపంచ దేశాల్లోనే కాదు.. స్వరాష్ట్రంలోని ధనికులు సైతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ప్రతి ఒక్క ధనికుడు కనీసం ఓ పేద కుటుంబాన్ని పైకి తేవడానికి నడుం బిగించాలి. నిజానికి, పాతికేళ్ల క్రితం 'జన్మభూమి' స్ఫూర్తిని చాటి పుట్టిన నేల తల్లి రుణం తీర్చుకోవడానికి తమ కష్టార్జితాన్ని ప్రతి ఒక్కరూ వెచ్చించిన తీరు ఓ ఉజ్జ్వల చరిత్ర. అటువంటి చరిత్రను తిరగ రాయాలని చంద్రబాబు కోరుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి నడుం బిగించిన చంద్రబాబునాయుడు లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతేనే ఆంధ్రప్రదేశ్‌కు పునర్వైభవం కలుగుతుంది. ఆర్థికాభివృద్ధి దిశలో వడివడిగా అడుగులు వేయగలుగుతుంది.

◆ సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు





గన్నవరం రాజకీయ చరిత్రలో

వైసీపీ గూండాలు నిప్పు పెట్టడంతో టీడీపీ కార్యాలయం ఆవరణలో కాలిపోతున్న కారు(ఫైల్)

బ్లాక్ డే

టీడీపీ ఆఫీసుపై దాడికి నేటితో రెండేళ్లు పూర్తి

ఎందరో మహానుభావులు గెలిచిన గడ్డపై ప్రజాస్వామ్యం అపహాస్యం

- కార్ల దహనం, బైకుల విధ్వంసం.. కార్యాలయాన్ని తగులబెట్టేందుకు యత్నం
- ఎన్‌హెచ్- 16పై కర్రలు, రాళ్లతో చెలరేగిపోయిన వైసీపీ అల్లరి మూకలు
- భయంతో పరుగులు తీసిన షాపుల యజమానులు, పట్టణ ప్రజలు
- రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరంలో విధ్వంసకాండపై సర్వత్రా విమర్శలు

గన్నవరం రాజకీయ చరిత్రలో నేడు (గురువారం) బ్లాక్‌డే. ఎందరో మహానుభావులను చట్టసభలకు పంపిన గడ్డపై సరిగ్గా రెండేళ్ల కిందట (2023, ఫిబ్రవరి 20న) వైసీపీ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. ప్రజాస్వామ్యవాదులు అసహ్యించుకునేలా గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేశాయి. ఫర్నీచర్ ధ్వంసం చేసి కార్యాలయాన్ని తగుల బెట్టేందుకు యత్నించాయి. ఆవరణలోని బైక్‌లు, కార్లకు నిప్పుపెట్టాయి. కర్రలు, రాళ్లు పట్టుకుని స్వైర విహారం చేశాయి. దొరికిన వారిని దొరికినట్టు చితకబాదుతూ రహదారులపై విధ్వంసకాండ సృష్టించాయి. రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరంలో ఉన్నామన్న కనీస స్పృహ కోల్పోయిన అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పథక రచనలో ఇదంతా జరగడం చూసి ప్రజలు నివ్వెరపోయారు. రాజకీయ విలువల పతనానికి టీడీపీ కార్యాలయంపై దాడి పరాకాష్టగా నిలిచిపోయింది.



జాతీయ రహదారిపై కర్రలు, రాళ్లతో స్వైర విహారం చేస్తున్న వైసీపీ శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) టీడీపీ ఆఫీసులో ధ్వంసమైన ఫర్నీచర్(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై జగన్ ప్రభుత్వంలో వైసీపీ రౌడీ మూకలు దాడి చేసి నేటి(గురువారం)తో రెండేళ్లు పూర్తయింది. దాడులకు బాధ్యులైన వారిపై గత వైసీపీ ప్రభుత్వంలో 14 నెలల పాటు చర్యలు తీసుకోకపోగా, ప్రతిగా టీడీపీ నాయకులపై కేసులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి విచారణ ప్రారంభించగా.. ప్రస్తుత పరిణామాలు అందరికీ తెలిసిందే. ప్రజాస్వామ్య వ్యవస్థలో కక్షలకు తావిస్తే ప్రజలు హర్షించరు. కక్షపూరిత రాజకీయాలు చేసేవారు ఎవరైనా సరే వారిని ఇంటికి సాగనంపటం అనేక సందర్భాలలో చూశాం. రౌడీయిజం చేసే ఏ నాయకుడిని కూడా ప్రజలు అంగీకరించటం లేదు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై వైసీపీ మూకలు దాడికి పాల్పడిన ఘటన అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు రాష్ట్రంలో మూడో అత్యధిక ఓట్లు వచ్చిన మిగతా 6లో..

ప్రశాంతంగా ఉండే గడ్డపై అరాచకం

ఎంతో ప్రశాంతంగా ఉండే గన్నవరం గడ్డపై భయానక విధ్వంసం జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదు. అంతకు ముందే వంశీ అనుయాయులు మూడున్నరేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా భూ కబ్జాలు, భూ రికార్డుల ట్యాంపరింగ్, అక్రమ మైనింగ్ వంటి కార్యకలాపాలతో గన్నవరం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఘటనలను ప్రశ్నించే వారిని టార్గెట్ చేసుకుని పోలీసు కేసులు పెట్టి వేధించటంతో.. ప్రజలకు అండగా టీడీపీ నేతలు నిలిచారు. వారిపైనా పోలీసులు కేసులు పెట్టి వేధింపులకు దిగారు. ఈ పరిణామాలన్నింటినీ చివరి రెండున్నరేళ్లు నియోజకవర్గ ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. వంశీ అనుయాయుల చేతుల్లో ఎంతో మంది మోసపోయారు.

అక్కడ ఫైలు కదలాలంటే.. ముడుపులు ఇవ్వాల్సిందే!
- ఈవో ఆదేశాలు బేఖాతరు, ఏళ్లతరబడి తిష్టవేసిన ఉద్యోగులు
- దుర్గగుడిలో గ'లీజు' వ్యవహారం

6లో

బిల్లులు లేని 107 కిలోల వెండి స్వాధీనం 6లో

రిజిస్ట్రేషన్ సర్వర్స్ బంద్!
- ఈ - సైన్ సమస్యలతో నిలిచిన కార్యకలాపాలు
- విజయవాడలో పది రిజిస్ట్రేషన్లు కూడా జరగలేదు

6లో



వేదాద్రి ఎత్తిపోతల పథకంలో పూర్తిగా నిర్వీర్యమైన మోటారు

వీడని గ్రహణం

మూలనపడ్డ ఎత్తిపోతల పథకాలు

వైసీపీ ప్రభుత్వంలో నిధులు ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం

- వేలాది ఎకరాల్లో నిలిచిపోయిన పంటల సాగు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- కూటమి ప్రభుత్వం రాకతో మరమ్మతులపై దృష్టి
- పరిశీలన, అంచనాల తయారీలో అధికారులు నిమగ్నం

గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో ఎత్తిపోతల పథకాలకు గ్రహణం పట్టింది. మరమ్మతులకు రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడంతో పథకాలన్నీ మూలన పడ్డాయి. ఫలితంగా వేలాది ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. వ్యవసాయమే ఆధారంగా బతికే అన్నదాతలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను పరిశీలించి అంచనాలను రూపొందించాలని ఆదేశాలు ఇచ్చింది. వేసవిలో నిధులు కేటాయించి మరమ్మతులు చేయిస్తే ఈ ఏడైనా పంటల సాగుకు అవకాశం వస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

(నందిగామ, ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో 127 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి ఆయకట్టులో లక్షకు పైగా ఎకరాల భూమి ఉంది. గత టీడీపీ ప్రభుత్వం వరకు సమర్థవంతంగా సాగునీరందించిన ఈ పథకాలకు వైసీపీ ప్రభుత్వం రాకతో గ్రహణం పట్టింది. మరమ్మతులకు గుర్రైనా ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వైసీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. ఫలితంగా పెద్ద ఎత్తున పథకాలు మూలన పడ్డాయి. కొన్ని పథకాలలో మోటార్లు మరమ్మతులకు గురి కాగా, మరి కొన్ని పథకాల పైపులైన్లు, విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. సుమారు ముప్పై పథకాల వరకూ పూర్తిగా నిలిచిపోయాయి. సారవంతమైన భూములు, సాగు చేసే సత్తా ఉన్నా సాగునీరు లేక అన్నదాతలు నిస్సహాయంగా నిలిచారు.

వేసవిలో మరమ్మతులు చేయాల్సి ఉన్నా..

ఏటా వేసవిలో పథకాల నిర్వహణకు నిధులు కేటాయించి మరమ్మతులు చేయించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం వల్ల నేడు పథకాలు నిరుపయోగంగా మారాయి. ముఖ్యంగా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల మిగతా 6లో..

దుర్భరం నుంచి.. అబ్బుర పరిచేలా..




కూచిపూడి - భట్లపెనుమర్రు రహదారి


కూచిపూడి - పెదపూడి రహదారి దుస్థితి (ఫైల్)



కూచిపూడి - భట్లపెనుమర్రు రహదారి దుస్థితి (ఫైల్)



కూచిపూడి - పెదపూడి రహదారి

» రూపు రేఖలు మారుతున్న రహదారులు

కూచిపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల రూపు రేఖలు మారుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంతలమయంగా.. ప్రమాదాలకు నిలయంగా ఉన్న రహదారులు నేడు కొత్తరూపు సంతరించుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూచిపూడి నుంచి భట్లపెనుమర్రు వెళ్లే రహదారి దుస్థితిపై అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులను ఈ ప్రాంత ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారిని పూర్తిస్థాయిలో ఆధునీకరించటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు ఉన్న రహదారి మరమ్మత్తులకు కూటమి ప్రభుత్వం కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. రహదారి పనులు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇంకా అస్తవ్యస్తంగా ఉన్న కూచిపూడి నుంచి బార్లపూడి వెళ్లే రహదారి, పెదముత్తేవి నుంచి మొవ్వ, కారకంపాడు నుండి కొండవరం వెళ్లే రహదారులను సైతం అభివృద్ధిపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వీడని గ్రహణం

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 74 పథకాలు ఉండగా, వీటిలో చాలా వరకూ రైతులకు సేవలందించలేని స్థితికి చేరుకున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి జలవనరుల శాఖా మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు చొరవతో రెండు విడతలుగా రూ.80 కోట్ల నిధులతో పథకాలకు పూర్తి స్థాయి మరమ్మతులు చేయించి రైతులను ఆదుకున్నారు.

కునారిల్లుతున్న 'వేదాద్రి-కంచల'

డాక్టర్ కేఎల్ రావ్ నందిగామ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టగా, దివంగత మంత్రి దేవినేని రమణ చొరవతో వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం ఏర్పడింది. అప్పటి వరకూ ఈ ప్రాంతంలో కేవలం చిన్న చిన్న ఎత్తిపోతల పథకాలు మాత్రమే ఉన్నాయి. ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందు కృష్ణానదిపై వేదాద్రి వద్ద ప్రతిష్టాత్మకమైన పథకాన్ని నిర్మించారు. అనంతరం మరో ఎనిమిది వేల ఎకరాలకు గాను వేదాద్రి-2 పథకాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పథకానికి 2200 అశ్వసామర్థ్యం కలిగిన రెండు మోటార్లు పెట్టారు. రెండు పథకాలను వేర్వేరుగా నిర్మించాల్సి ఉండగా, రెండు పథకాలకు చెందిన నాలుగు మోటార్లను ఒక చోటే అమర్చారు. అత్యంత సామర్థ్యం గల మోటార్లు కావడం వల్ల పెద్దయెత్తున వైబ్రేషన్ వచ్చి మోటార్లు మరమ్మతులకు గురతున్నట్లు ఇంజనీర్లు నిర్ధారించారు. కానీ వాటిని మార్చడం కష్టతరం కావడంతో అలానే నెట్టుకొస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చే వరకూ ఆ పథకాలను టీడీపీ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చింది. వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురి కావడంతో ఈ ఏడాది పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా ఆయకట్టులోని 16 వేల ఎకరాల భూమికి నీరందక కోట్లాది రూపాయల పంట నష్టపోవాల్సి దుస్థితి ఏర్పడింది.

మరమ్మతులకు రూ.12.50 కోట్లతో అంచనాలు

ఈ పథకానికి మరమ్మతులు చేయించాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పలు మార్లు జలవనరులశాఖా మంత్రిని, అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి ఆమె నిధులు కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అంచనాలు తయారు చేయాలని సూచించారు. ఈ పథకం మరమ్మతులకు రూ.12.50 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఈ మొత్తం నిధులు సాధ్యమైనంత త్వరలో మంజూరు చేయాల్సి ఉంది. ఈ పథకానికి ఉన్న 2200 అశ్వసామర్థ్యం గల మోటార్ల కోసం ఆయా కంపెనీలకు సొమ్ము చెల్లిస్తేనే తయారు చేస్తారు. వీటిని సిద్ధం చేసేందుకు నాలుగు నెలల సమయం పడుతుంది. కనుక ప్రభుత్వం తక్షణం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. ఈక్రమంలోనే ప్రభుత్వం మిగిలిన అన్ని పథకాల పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది. మొత్తం ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు ఐడీసీ ఈఈ రత్నరాజు ఆధ్వర్యంలో పథకాల స్థితిగతులపై సిబ్బంది అధ్యయనం చేస్తున్నారు. పథకాలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఏడీసీ అధికారులు చెప్పుకొస్తున్నారు. పథకాలను మరమ్మతులు చేసి పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందించాలంటే సుమారు రూ.200 కోట్లు అవసరం. ఆ మేర నిధులు అందించి మరమ్మతులు చేయిస్తే అన్నదాతలకు పెద్దయెత్తున మేలు జరగనుంది.

నాబార్డు నిధులు వచ్చేనా?

రాష్ట్రంలో సాగునీటి రంగానికి రూ.వెయ్యి కోట్ల సాయం అందించేందుకు నాబార్డ్ ముందుకు వచ్చిందని, అందులో రూ.వంద కోట్లు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు కేటాయించినట్లు ఎస్ఎస్పీ, ఏపీఐడీసీ అధికారులు చెబుతున్నారు. వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకానికి నాబార్డ్ నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్లు కూడా వారు తెలిపారు. మిగిలిన పథకాలకు కూడా ఆ నిధులు అందించి ఆదుకోవాల్సి ఉంది. ఒక పర్యాయం పూర్తి స్థాయి మరమ్మతులకు ప్రభుత్వం చేయూతనందించాల్సి ఉంది.

అక్కడ ఫైలు కదలాలంటే.. ముడుపులు ఇవ్వాల్సిందే!

» దుర్గగుడిలో 'లీజు' వ్యవహారం

» ఈవో ఆదేశాలు బేఖాతరు, ఏళ్లతరబడి తిష్టవేసిన ఉద్యోగులు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో లీజుల విభాగంలో కరెన్సీ నోట్లు చూపందే ఫైలు కదలదన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ విభాగంలో కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి తిష్ట వేసి ఈవో ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నట్టు సమాచారం. షాపులకు, గంపలు, ఇతరత్రా లీజులకు సంబంధించి ఏ ఫైలు కదలాలన్నా సిబ్బందికి కానుకలు చెల్లించుకోవాల్సిందేనని షాపుల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. షాపుల అద్దె బకాయిలు లక్షల్లో పెరిగినా వసూలు చేయకుండా ఉద్యోగులు అద్దెదారులతో కుమ్మక్కవుతున్నారు. ఆ విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికారికి బకాయిలు చెల్లించిన నలుగురు వ్యాపారస్తులకు షాపులు కేటాయించాలని రెండు నెలల క్రితం ఈవో ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ అధికారి రేపు మాపు అంటూ వ్యాపారస్తులను తిప్పుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, బయట వడ్డీకి తెచ్చి బకాయిలు చెల్లించామని, షాపులు కేటాయించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వ్యాపారస్తులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈవో ఆదేశించినా సంబంధిత అధికారి, కింది సిబ్బంది ఫైలు కదలపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. లీజుల విభాగంలో ఏ ఫైలు కదలాలన్నా కానుకలు చెల్లించుకోవాలంటే భారంగా పరిణవిస్తోందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

కష్టానికి ప్రతిఫలం..

» యోగి వేమన వర్సిటీ వీసీగా ఫణితి ప్రకాష్‌బాబు

» జగ్గయ్యపేటలో హర్షాతిరేకాలు



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటి వైస్‌చాన్సలర్‌గా జగ్గయ్యపేటకు చెందిన ఫణితి ప్రకాష్‌బాబు నియమితులవడంతో పేటలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల కుటుంబం నుంచి వచ్చి ప్రొఫెసర్, వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టడం జగ్గయ్యపేట ప్రతిష్ట ఇనుమడించిందని ప్రకాష్‌బాబు మిత్రులు, పరిచయస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకాష్‌బాబు తండ్రి డానియేల్ (92), తల్లి సత్యవతమ్మ (87)లు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుతం కోదాడ రోడ్డులో ఉంటున్నారు. ప్రకాష్‌బాబు విద్యాభ్యాసం అంతా జగ్గయ్యపేటలో జరిగింది. అనంతరం యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్‌లో లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పలు అంతర్జాతీయ యూనివర్సిటీలకు కో-ఆప్షన్ సభ్యుడిగా ఉన్నారు. ఆయన సతీమణి అన్విత యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

నెట్టెం, తాతయ్య, ఉదయభానుల అభినందన

యోగి వేమన వర్సిటీ వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ఫణితి ప్రకాష్ బాబుకు విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎస్జీఎస్ కళాశాల చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభానులు అభినందనలు తెలిపారు. ప్రకాష్‌బాబు చిన్నప్పటి నుంచి ఏదైనా కష్టపడి సాధిస్తాడని తండ్రి డానియేల్ అన్నారు. ప్రకాష్‌బాబు జీవిత లక్ష్యం నేరవేరిందని, వీసీ పదవి వరించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ ఆనందం, మాటల్లో చెప్పలేనిదని తల్లి సత్యవతమ్మ అన్నారు.

రిజిస్ట్రేషన్ సర్వర్స్ బంద్!

» ఈ - సైన్ సమస్యలతో నిలిచిన కార్యకలాపాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సర్వర్ సమస్యలతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. బుధవారం పని వేళల్లో కేవలం అర్ధగంట మాత్రమే సర్వర్ పనిచేసింది. ఉదయం నుంచే సర్వర్ సమస్యలు తలెత్తాయి. మధ్యాహ్నం వరకు ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. మధ్యాహ్నం 2.30 గంటలకు సర్వర్ వచ్చినా ఆ తర్వాత 3 గంటలకు మళ్లీ మొరాయించింది. దీంతో సిబ్బంది కూడా బయటకు వెళ్లిపోయారు. సర్వర్ సమస్యకు ప్రధానంగా ఇ-సైన్ కారణమని తెలుస్తోంది. దీంతో విజయవాడలో పట్టుమని పది రిజిస్ట్రేషన్లు కూడా జరగలేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

డాక్యుమెంట్ రైటర్ ఇంట్లో చోరీ

» రూ.13 లక్షల బంగారం అపహరణ


చోరీ పరిశీలిస్తున్న ఏసీపీలు తిలక్, క్రైమ్ డీసీపీ వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహా కుంభమేళాకు వెళ్లిన డాక్యుమెంట్ రైటర్ ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రూ.13లక్షలు విలువ చేసే ఆభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం విష్ణుప్రియనగర్‌లో నివాసం ఉంటున్న డాక్యుమెంట్ రైటర్ సీహెచ్ ప్రసాద్ కుంభమేళాకు కుటుంబంతో కలిసి కారులో విజయవాడ వెళ్లాడు. రాత్రి గం.2ల సమయంలో ఇంట్లో సీసీ కెమెరాల నుంచి దృశ్య సమాచారం రాకపోవటంతో బుధవారం ఉదయాన్నే సమీపంలో ఇళ్ల వారికి ఫోన్‌చేసి సీసీ కేబుల్స్‌ను చూడాలని కోరాడు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్టు తెలుసుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగంతకులు మూడు తలుపులు తాళాలు తీసి బీరువాలో ఉంచిన నగలు చోరీచేశారు. సీసీ టీవీ దృశ్యాలు నమోదుచేసే హార్డ్ డిస్క్‌ను ఎత్తుకు వెళ్లారు. నందిగామ ఏసీపీ తిలక్, క్రైమ్ వింగ్ డీసీపీ వెంకటేశ్వర్లులు సంఘటన స్థలికి వచ్చి పరిశీలించారు. సీఐ వీ.వెంకటేశ్వర్లు ఎస్సై జీ.రాజులు వారి వెంట ఉన్నారు.

గన్నవరం రాజకీయ చరిత్రలో బ్లాక్ డే

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థిగా నిలిచారు. ఇదిచూస్తే అరాచక శక్తుల పట్ల నియోజకవర్గ ప్రజలు ఎలాంటి భావనతో ఉంటారన్నది అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ కార్యాలయంపై దాడితో అట్టుడికిన పట్టణం

నియోజకవర్గంలో పైనచెప్పుకున్న అరాచకాలన్నీ కొనసాగుతున్న దశలో.. ఫిబ్రవరి 20, 2023న వైసీపీ రౌడీ మూకలు టీడీపీ కార్యాలయంపై ఒక్కసారిగా దాడి చేశాయి. ఆ రోజున గన్నవరం అట్టుడికిపోయింది. వైసీపీ రౌడీ మూకలు 150 మంది వరకు టీడీపీ కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి అక్కడ ఉన్న కార్లను ధ్వంసం చేశారు. ఒక కారుకు నిప్పటించారు. మరో మూడు కార్లను ధ్వంసం చేశారు. మూడు బైక్‌లను నాశనం చేశారు. ఆ తర్వాత టీడీపీ కార్యాలయం అద్దాలు, కంప్యూటర్లను పగులగొట్టారు. కుర్చీలను విరగ్గొట్టారు. చివరగా కార్యాలయానికి నిప్పు పెట్టే ప్రయత్నం కూడా చేయటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవటంతో దహనం ఆగింది.

ఎన్‌హెచ్-16పై స్వైర విహారం

టీడీపీ ఆఫీసుపై దాడి చేస్తున్న విషయం తెలుసుకుని ఆ పార్టీ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున తమ కార్యాలయానికి తరలివచ్చాయి. అప్పటికే కార్యాలయాన్ని ధ్వంసం చేసి ఎన్‌హెచ్-16 మీదకు వచ్చిన వైసీపీ అల్లరి మూకలు.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కనపడగానే దాడి చేశాయి. టీడీపీ నేత పట్టాభిపై దాడి చేయబోగా టీడీపీ నాయకులు తప్పించారు. ఈ క్రమంలో ఎంతో మంది కార్యకర్తలు వైసీపీ రాళ్ల దాడిలో గాయాలపాలయ్యారు. కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా వైసీపీ మూకలు దాడి చేశాయి. ఎన్‌హెచ్-16 మీద వైసీపీ మూకల దాడులను ప్రత్యక్షంగా చూసిన ప్రజలు భీతిల్లారు. పట్టణంలో తీవ్ర భయాందోళన పరిస్థితులు ఏర్పడ్డాయి. దుకాణాలు కట్టివేయటంతో పాటు ఆ రోజున బయటకు రావటానికి ప్రజలు భయపడ్డారు.

నాటి పాలకులకు సలాంగిరీ చేసిన పోలీసులు

టీడీపీ కార్యాలయంపై దాడి జరుగుతుందన్న సమాచారం అప్పటి పోలీసులకు అందింది. కానీ వారు టీడీపీ కార్యాలయానికి ఎటువంటి ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేయలేదు. టీడీపీ నేత దొంతు చిన్నా ఇంటిపై వైసీపీ మూకలు దాడి చేయటం, మిగిలిన నేతలపై కూడా దాడులకు పాల్పడబోతున్నారన్న సమాచారంతో గన్నవరం పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులంతా కలిసి ఫిర్యాదు చేయటానికి వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ కార్యాలయంపై దాడి జరిగింది. పోలీస్ స్టేషన్‌లో ఉండగా.. దాడి జరిగిందన్న ఉద్దేశ్యంతో అక్కడి నుంచి వెళ్లిన టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. ఈ ఘటనలో తప్పు చేసిన వారిని వదిలేసి .. టీడీపీ నేతలపై ఎదురు కేసులు పెట్టడం గమనార్హం.

కూటమి ప్రభుత్వం రాకతో విచారణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబరులో కేసును సీఐడీకి బదిలీ చేయడంతో విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో మొత్తం 93 మంది నిందితుల్లో 49 మందినే అరెస్టు చేశారు. మరో 31 మంది మాత్రం అరెస్టు కాకుండా తప్పించుకున్నారు. ఇంకా 13 మందిని అరెస్టు చేయాల్సి ఉండగా, వారు అజ్ఞాతంలో ఉన్నారు. ఈ కేసులో అత్యంత కీలకమైన వంశీ మాత్రం హైకోర్టు నుంచి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నారు. చివరికి సత్యవర్ధన్ ఎపిసోడ్‌తో అరెస్టు కావాల్సి వచ్చింది. ఆ రోజున టీడీపీ ఆఫీసు దాడిలో పాల్గొన్న వైసీపీ రౌడీ మూకలు భయపడి ఇప్పుడు లొంగిపోతున్నాయి.

నాటి దాడి ఘటన భయానకం

(గన్నవరం, హనుమాన్‌జంక్షన్ రూరల్)

గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై నాటి దాడి ఘటన అత్యంత భయానకమని బాధితులు పేర్కొంటున్నారు. అరాచకానికి పరాకాష్టగా నిలిచిపోతుందంటున్నారు. నాటి బ్లాక్ డేను గుర్తు చేసుకుని కన్నీరు పెడుతున్నారు. అప్పటి బాధితులు, టీడీపీ నాయకులు 'ఆంధ్రజ్యోతి'తో తమ అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

64 రోజులు అజ్ఞాతంలో గడిపా

- జాస్తి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు



2019 తర్వాత వైసీపీ పంచన చేరిన వంశీ చేయని అరాచకాలు లేవు. టీడీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు, ఆస్తులు ధ్వంసం చేయటం, కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి కార్యకర్తలను కొట్టి వారిపైనే కేసులు పెట్టారు. 64 రోజులు అజ్ఞాతంలో గడిపా. వంశీ పాపం పండి జైలులో ఉన్నాడు. చదువుకునే వారిని కూడా కేసుల్లో ఇరికించాడు. నా పొలంలోకి అక్రమంగా చొరబడి రేకుల షెడ్డును ధ్వంసం చేయించాడు.

రాయితో ముఖం మీద కొట్టారు

-మండవ లక్ష్మి, తెలుగు మహిళ కార్యదర్శి



నన్ను భీమవరపు రాము పట్టుకుంటే ఓలుపల్లి రంగా రాయితో ముఖంపై కొట్టాడు. మూల్పూరి ప్రభుకాంత్ డబ్బా విసిరాడు. నన్ను చంపాలని చూశారు. స్పృహ తప్పి పడిపోయిన నన్ను రాము కాళ్లతో తంతూ భూతులు తిట్టాడు. గాయాలతో ఆస్పత్రికి వెళ్లగా అక్కడికి పోలీసులు వచ్చారు. వైద్యం తీసుకోకుండానే పారిపోవాల్సి వచ్చింది. కొట్టి పైగా కేసులు పెట్టారు. వైసీపీలోకి వెళ్లలేదని వంశీ ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడు. ఇల్లు వదిలి పారిపోవాల్సిన దుస్థితి. పోలీసులు కూడా వంశీ చెప్పిందే వేదంగా చేశారు.

దొంతు చిన్నా ఇంటిపై ముందుగా దాడి

- మూల్పూరి సాయికళ్యాణి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



దొంతు చిన్నా లేని సమయంలో ఆయన ఇంటిపై ముందుగా దాడిచేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లాం. అదే సమయంలో టీడీపీ కార్యాలయంపై దాడి జరుగుతోందని, కార్లు తగలబెడుతున్నారని ఫోన్ వచ్చింది. కార్యాలయాన్ని రక్షించుకునేందుకు పట్టాభి తదితరులతో కలిసి నడుచుకుంటూ వెళ్తుంటే సుమారు 150 మందికి పైగా వైసీపీ గుండాలు మహిళలని కూడా చూడకుండా కర్రలు, ఇనుపరాడ్లు, రాళ్లతో మాపై దాడికి దిగారు. కొంతమందికి గాయాలయ్యాయి.

ఇల్లు వదిలి పారిపోవాల్సి వచ్చింది

- చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



దొంతు చిన్నాను పరామర్శించేందుకు ఫోన్ చేశా. టీడీపీ కార్యాలయంలో ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లా. నాయకులందరం కలిసి స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాం. ఆ సమయంలో కార్యాలయంపై దాడి జరుగుతున్నట్లు తెలిసింది. కార్యాలయాన్ని రక్షించుకునేందుకు వెళితే కార్లు తగలబడుతూ కనిపించాయి. ఇంతలో వైసీపీ వారు మాపై రాళ్ల దాడికి దిగారు. పోలీసులు టీడీపీ నాయకులపైనే తిరిగి కేసులు నమోదు చేశారు. దీంతో సుమారు 40రోజుల పాటు ఇల్లు, కుటుంబాలను వదిలి దాక్కోవలసిన పరిస్థితి. మానసికంగా, శారీరకంగా పడిన ఇబ్బంది జీవితంలో ఇంతవరకూ ఎప్పుడూ అనుభవించలేదు.


వెండిని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

బిల్లులు లేని 107 కిలోల వెండి స్వాధీనం

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే పోలీసులు మంగళవారం తనిఖీలు చేస్తున్న క్రమంలో బిల్లులు లేకుండా రవాణా అవుతున్న 107 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో ఆగ్రా నుంచి వెండిని విజయవాడకు తరలిస్తుండగా పోలీసుల తనిఖీలో పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వెండి విలువ సుమారు కోటి రూపాయలుంటుందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ జేవీ రమణ మాట్లాడుతూ, రవాణా అవుతున్న వెండికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేవని, దీంతో వెండిని జీఎస్టీ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

కేజీబీవీ పాఠశాల ఎస్‌వో, ఏఎన్ఎంల సస్పెన్షన్

ఎ.కొండూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలోని ప్రత్యేక అధికారి, ఏఎన్ఎంలను సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. పాఠశాలలో గత కొంత కాలంగా ఎస్‌వో, ఉపాధ్యాయులు, సిబ్బంది మధ్య అంతర్గత విభేదాలతో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలమేరకు ఈనెల 11న తిరువూరు ఆర్డీవో కె.మాధురి కేజీబీవీలో సమగ్ర విచారణ చేసి నివేదికను అందజేశారు. నివేదిక ప్రకారం ఎస్‌వో మీరున్నిసా బేగం, ఏఎన్ఎం మమతలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఎ.కొండూరు ఎస్టీ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, కవితకు, రెడ్డిగూడెం, రంగాపురం కేజీబీవీ పాఠశాల ఏఎన్ఎం సౌందర్యకు అప్పగించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం గుంటూరు సీపీఐ జిల్లా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రథమ నిర్మాణ మహాసభ ఘనంగా జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే వ్యవస్థలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులే కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ఎనుకున్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వెలుగురి రాధాకృష్ణమూర్తి, నూతన అధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రమేష్ బాబు, కోశాధికారిగా నాగేశ్వర రెడ్డితో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉత్తర్వులు వెనుక్కు తీసుకోవాలి

» ఆర్టీసీ ఎండీకి లేఖ

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా సంస్థ (ఆర్టీసీ)లో వినియోగిస్తున్న ఇ- పోస్‌లు పోయినా, డ్యామేజీ అయినా డ్రైవర్లు, కండక్టర్ల నుంచి ప్రోరేటా ప్రకారం రికవరీ చేయాలన్న ఉత్తర్వులను వెనుక్కు తీసుకోవాలని ప్రజా రవాణా సంస్థ వర్కర్ల ఫెడరేషన్ బుధవారం ఎండీకి లేఖ రాసింది. ఈ మేరకు ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు షేక్ జిలానీ భాష, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డిలు మాట్లాడుతూ ఏ ప్రభుత్వ సంస్థలోనూ ఇలా రికవరీలకు ఆదేశాలు ఉండవన్నారు. ఏపీ సీసీఏ నిబంధనల మేరకు జరిమానాల రూపంలో రికవరీలు చేసే విధానం అమలులో లేదన్నారు. ఈ ఉత్తర్వులు ప్రమాణికాలకు విరుద్ధమని, డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు దీనిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. మాన్యువల్ ఆపరేషన్ విధానం మేరకు టికెట్ ముఖ విలువ కాకుండా, డ్రైవర్లు, కండక్టర్లు కారణ మని తేలితే టికెట్ ప్రింటింగ్ ఛార్జీలు మాత్రమే వసూలు చేసేవారన్నారు. ఇ- పోస్‌లు రావడంతో అవి పోయినా, డ్యామేజీ అయినా రూ 19,605 దగ్గర్నుంచి రూ 7,162 వసూలు చేయడానికి నిర్ణయించడం ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. మానసిక అశాంతి నెలకొంటుందని తెలిపారు. ఈ విధమైన రికవరీలు సరికావన్నారు. డ్యామేజీలు అయితే డ్రైవర్లు, కండక్టర్లు బాధ్యులు అని చెప్పడం సరికాదన్నారు. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95,104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

విద్యుత్ అదాలత్ రేపు

భారతీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడానికి శుక్రవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్ కార్యక్రమం కంకిపాడు బ్యాంక్ కాలనీలోని రాయల్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందన్నారు. గుణదల సబ్‌స్టేషన్ పరిధిలోని గుణదల, పటమట, ఆటోనగర్, పెనమలూరు, రామవరప్పాడు, ఎనికేపాడు, నున్న, గన్నవరం, కంకిపాడు ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు అదాలత్‌కు వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలనిఆయన తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

● వేసవిలో నగరంలో సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయండి ● సమీక్షా సమావేశంలో కమిషనర్ ధ్యానచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నగర ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమిషనర్ ధ్యానచంద్ర తన చాంబర్‌లో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదని, తాగునీటి సరఫరాలో కొండప్రాంతాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. వాహనాలను, వాటర్ ట్యాంకర్లను, సమకూర్చుకోవాలన్నారు. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాలను మరింత పెంచాలన్నారు. కొండ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు లేకుండా సరఫరాకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని అధికారులకు సూచించారు. గత ఏడాది మంచి నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే వారికి నీటి సరఫరా అందించేలా ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టులు, పార్కుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. నగరంలోని బోరులన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విజయవాడలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎటువంటి నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఈలు, డీఈఈలు, ఈఈల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి పాల్గొన్నారు.


జైరుద్రను అభినందిస్తున్న గద్దె రామ్మోహన్

చిన్నారికి గద్దె అభినందనలు

పటమట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోరంకికి చెందిన జైరుద్ర అనే ఐదేళ్ల చిన్నారి కాలభైరవ అష్టకంలోని దివ్య శ్లోకాలను అత్యంత వేగంగా పఠించి 2025లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకోవడం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం తల్లిదండ్రులతో కలిసి తన కార్యాలయానికి వచ్చిన జైరుద్రను ఆయన అభినందించారు. బాలిక భవిష్యత్‌లో మరిన్ని రికార్డులు నమోదు చేయాలని ఆయన ఆకాంక్షించారు.


అగ్ని బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న గద్దె క్రాంతి కుమార్

అగ్నిబాధితులకు క్రాంతికుమార్ ఆర్థికసాయం

కృష్ణలంక, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంకలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను గద్దె క్రాంతి కుమార్ బుధవారం పరామర్శించారు. 20వ డివిజన్‌లో నిర్మలా శిశుభవన్ వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి వారికి సొంత నిధుల నుంచి రూ. లక్షా80 వేల ఆర్థిక సాయాన్ని గద్దె క్రాంతికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని, వారికి అవసరమైన పూర్తి సహాయ కార్యక్రమాలను అందిస్తామన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి అగ్ని బాధితులను ఆదుకోవాలని క్రాంతికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటేపల్లి చిన్నా, గొరిపర్తి నామేశ్వరరావు, గళ్లా శ్రీను, అడపా శివ, వన్నెంరెడ్డి రాధాకృష్ణ, జనసేన నాయకులు జి.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సురేష్

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

కమిషనర్‌కు ఫిర్యాదు

గాంధీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు కృష్ణానదిని కమర్షియల్ కార్యకలాపాలకు వేదికగా మార్చారని జై భీమ్‌రావు భారత్ పార్టీ అధికార ప్రతినిధి పరసా సురేష్ అన్నారు. కృష్ణానదిలో పవిత్రస్నానాలను ఆచరించే పద్మావతి ఘాట్‌ను వ్యాపార కేంద్రంగా మార్చారని, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను నదిలో వదులుతూ అపవిత్రం చేస్తున్నారన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్, సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఘాట్‌లో అక్రమ కట్టడాలు చేశారన్నారు. ఘాట్‌లోని వ్యాపార కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని లేదంటే తమ పార్టీ ఉద్యమిస్తుందన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదు చేశారు.

ప్రతి కుటుంబంలో
ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నదే లక్ష్యం

● ఎంఎస్‌ఎంఈ రుణ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సంకే విశ్వనాథం


మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ రుణ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సంకే విశ్వనాథం

మొగల్రాజపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని ఎంఎస్‌ఎంఈ రుణ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సంకే విశ్వనాథం తెలిపారు. 7వ డివిజన్‌లో మధ్య తరగతి ప్రజలు పారిశ్రామికవేత్తలుగా ఎలా ఎదగాలనే విషయమై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద ఎంఎస్‌ఎంఈ ద్వారా రుణాలు తీసుకోవడంపై కో ఆర్డినేటర్ డాక్టర్ సంకే విశ్వనాథం వివరించారు. ఎలాంటి యూనిట్స్ ఏర్పాటు చేసుకోవాలో, రుణాలు ఎలా ఎంత ఇస్తారు, బ్యాంకులో దరఖాస్తు చేసే విధానం నుంచి యూనిట్ పెట్టే వరకు ఎంపీ కేశినేని శివనాథ్ అందించే సహకారాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పటమట సతీష్ చంద్ర, డివిజన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి లక్ష్మణరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సంజయ్‌వర్మ, కార్యదర్శి దోమకొండ రవి, టీడీపీ రాష్ట్రనాయకులు మాదిగాని గురునాథం, మాజీ కార్పొరేటర్ మల్లికార్జునయాదవ్, ఉపాధ్యక్షులు పెనుగొండ శ్రీనివాస్, బూత్ కన్వీనర్‌లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని 11కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ 1,2 రోడ్డులు, జడ్జి క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.


ఒకరోజు నిరాహార దీక్షలో నాయకులు,కార్మికులు

ఎనిమిదవ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహారదీక్ష

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో పే కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం వద్ద దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఒకరోజు నిరాహారదీక్ష నిర్వహించారు. యూనియన్ డివిజనల్ సెక్రటరీ లీల మాట్లాడుతూ సేఫ్టీ కేటగిరీలో పనిచేసే కార్మికులందరికీ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ప్రతిపాదిత యూపీఎస్ పథకంలో మార్పులు చేసి పాత పెన్షన్ విధానం తరహాలో అమలు చేయాలన్నారు. నాన్ గెజిటెడ్ సిబ్బంది అందరికీ నైట్ డ్యూటీ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు.

50శాతం దాటిన కరువు భత్యాన్ని బేసిక్ పేలో కలపాలన్నారు. రన్నింగ్ సిబ్బందికి మెరుగైన పే స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హింద్ మజ్దూర్ సభ ఏపీ జనరల్ సెక్రటరీ జి.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ట్రాక్ మెయింటెనర్, రన్నింగ్, ఇతర సేఫ్టీ క్యాటగిరీలో ఉన్న మహిళా సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు రాముగుప్తా మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. గూడూరు నుంచి అనకాపల్లి వరకు అన్ని స్టేషన్ల నుంచి కార్మికులు పాల్గొన్నారు. సాములు, శేఖర్‌బాబు, విజయకుమార్, తివారీ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లీల ఆధ్వర్యంలో డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు.


కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఏఐవైఎఫ్ వినతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా వున్న పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీనివాసరెడ్డికి ఏఐవైఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా వున్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేశారని, కానీ నేటికీ నోటిఫికేషన్ వెలువడలేదన్నారు. నోటిఫికేషన్ లేక లక్షలాది మంది నిరుద్యోగులు లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు, ప్రకాశం, అల్లూరు సీతారామరాజు జిల్లాలకు పోస్టుల ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని, తక్కువ పోస్టుల మంజూరు చేశారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. 25 వేలతో మెగా డీఎస్సీ నిర్వహించేలా చూడాలని నిరుద్యోగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శింగంశెట్టి మోహన్ ప్రసాద్, శీరం రవికుమార్, హరీష్ పాల్గొన్నారు.

ప్రయాణికుడిపై దాడి .. జువైనల్ హోమ్‌కు నిందితుడు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడిపై దాడి ఘటనలో రైల్వే పోలీసులు ఒకరిని అరెస్టు చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. ఈనెల 2న తెనాలి రైలులో ప్రయాణం చేస్తున్న సాయిశ్రీనివాస్‌ను విజయవాడ బస్టాండ్ సమీపంలో కొందరు వ్యక్తులు డోర్ వద్ద నుంచి కిందకులాగి బ్లేడ్‌తో దాడి చేశారు. అతని వద్ద మొబైల్ ఫోన్, పర్సు తీసుకుని పరారయ్యారు. మరుసటి రోజు కూడా మరో ప్రయాణికుడు పవన్‌కుమార్‌పై దాడిచేసి మొబైల్ ఫోన్‌ను లాక్కున్నారు. ఈ రెండు సంఘటనలపై రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్, డీఎస్ఆర్పీ రతన్ రాజు, ఐఆర్పీ జేవీ రమణ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా అత్తిలికి చెందిన బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా మరికొంత మందితో కలిసి నేరాలను చేసినట్లుగా అంగీకరించాడు. చోరీ చేసిన ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

కేబీఎన్‌లో ఉత్సాహంగా మస్త్

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేబీఎన్‌లో మస్త్ 2కె 25 బుధవారం జరిగింది. రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ ఈవెంట్ అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐమీస్ మేనేజింగ్ డైరెక్టర్ డి.నాగలక్ష్మి విద్యార్థులకు సందేశమిస్తూ ఎప్పటికప్పుడు మారుతున్న పోకడలను అవగాహన చేసుకుని నైపుణ్యాలను పెంచుకుంటూ పట్టుదల, స్వయంకృషి ఉంటే తప్పకుండా విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, హిందూ హైస్కూల్ పరిపాలనాధికారి డాక్టర్ వి. నారాయణరావు, కళాశాల కమిటీ అధ్యక్షులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంబీఏ విభాగాధిపతి రవికిరణ్ ప్రసంగించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 45 కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో పలు అంశాల్లో పోటీలు నేడు

లబ్బీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. కళాశాల తెలుగు విభాగం, తరుణీ తరంగాల సంయుక్త ఆధ్వర్యంలో మీకు నచ్చిన నవల-సమీక్ష, మీకు నచ్చిన కథ-సమీక్ష, ముచ్చటగా మూడు నిముషాలు(ఆంగ్లపదం వాడకుండా తెలుగులోనే మాట్లాడాలి), మీకు నచ్చిన మహిళా మణి-ఇతివృత్త పరిచయం, స్త్రీలకు సంబంధించిన సినిమా పై-సమీక్ష తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం అని, దానిని పురస్కరించుకుని గురువారం కళాశాల ప్రాంగణంలో ఉదయం 10గంటల నుంచి పలు పోటీలు ప్రారంభమవుతాయని, ప్రతి అంశానికి 5నిమిషాలు సమయం కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చని, పాల్గొనడానికి ఎటువంటి రుసుము లేదని, విజేతలకు బహుమతి ప్రధానం, పాల్గొన్న అందరికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు కె.సరళ 9848316383, ఐ.మంజుల 9440328638, రావి శారద 9393477313, డి.రమాదేవి 9490098620 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

శతకాల మోత

●సెంచరీలు చేసిన నలుగురు
●5 వికెట్లు తీసిన బౌలర్ ఎండీ నాగుర్


వంశీకృష్ణ(141) ఎవరెస్ట్ జట్టు


బ్రహ్మతేజ (118) వీవీకేఆర్‌ఎం


ఎస్‌డీఎండీ తోఫిక్(151) కొండపల్లి జట్టు


ఎండీ నాగుర్, 5 వికెట్లు కొండపల్లి జట్టు

విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగు తున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో క్రీడాకారులు శతకాల మోత మోగించారు. నలుగురు క్రీడాకారులు సెంచరీలతో కదం తొక్కారు. బుధవారం జరిగిన రెండు మ్యాచ్ లు క్రీడాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. మొదటి మ్యాచ్ ఎవరెస్ట్ సీసీ, పటేల్ సీసీ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పటేల్ సీసీ జట్టు 49.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 302పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో కె.ఆనంద్ జోషియా 103 పరుగులతో సెంచరీ సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎవరెస్ట్ సీసీ జట్టు 46.1ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో వంశీ కృష్ణ 141పరుగులు, కె.లక్ష్మీ శ్రీనివాస్ 79 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించారు. రెండో మ్యాచ్‌లో కొండపల్లి సీసీ, వీవీకేఆర్‌ఎం జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన కొండపల్లి జట్టు 50 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 404 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జట్టులో ఎస్‌డీఎండీ తోఫిక్ 151 పరుగులు, నవనీత్‌సింగ్ 73 పరుగులు, అబ్దుల్ రజాక్ 46 పరుగులు చేశారు. అనంతరం భారీ లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన వీవీకేఆర్‌ఎం జట్టు 46.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 238పరుగులు చేసి ఓటమి పాలైంది. జట్టు క్రీడాకారుడు బ్రహ్మతేజ 118 పరుగులు చేశాడు. కొండపల్లి జట్టు బౌలర్ ఎండీ నాగుర్ 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గొప్పలు కాదు తిప్పలు!

తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా నాడు-నేడు పనులు



ఫేజ్-1లో ఇలా అసంపూర్తిగా గదుల నిర్మాణం

నాడు-నేడులో భాగంగా పాఠశాలలన్నింటినీ సుందరంగా అభివృద్ధి చేశామని నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే రంగులు వేయటంలో చూపిన వేగం భవన నిర్మాణాలు పూర్తి చేయటంలో చూపలేదని తెలుస్తోంది. భవనాలు నిర్మిస్తామంటూ నిధులు కేటాయించటం సగం పనులు పూర్తయ్యాక నిధులు ఆపేయటం, ఇంకోసారి నిధులు కేటాయించటం మళ్లీ సగం పనులు పూర్తయ్యాక నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయి మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - ఆంధ్రజ్యోతి, తోట్లవల్లూరు

- **వెక్కిరిస్తున్న మొండి గోడలు.. శ్లాబు నుంచి ఊడి పడుతున్న పెచ్చులు**
- **395 మంది విద్యార్థులున్న హైస్కూల్లో అన్నీ అసౌకర్యాలే**
- **సుందరంగా చేశామని నాటి వైసీపీ ప్రభుత్వం ప్రగల్భాలు**



పెచ్చులు ఊడి చువ్వలు కనిపిస్తున్న పైకప్పు

తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో ఫేజ్-1, ఫేజ్-2లో చేపట్టిన రెండు భవనాలు నేటికీ మొండిగోడలతోనే దర్శనమిస్తున్నాయి. హైస్కూల్లో 395 మంది విద్యార్థులున్నారు. గతంలో నిర్మించిన రేకులషెడ్డులు శిథిలావస్థకు చేరటంతో వాటిని తొలగించేశారు. దీంతో విద్యార్థులకు తరగతి గదుల సమస్య ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతి విద్యార్థులను కూడా హైస్కూల్లో కలిపారు. అసలే గదులు లేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు ప్రాథమిక విద్యార్థులను తీసుకురావడంతో వారంతా ఇరుకు గదుల్లో మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో నాడు - నేడు ఫేజ్-1లో భాగంగా రూ.87.75 లక్షలను అదనపు తరగతి గదుల నిర్మాణానికి, ఇతర భవనాల రిపేర్లకు కేటాయించారు. పడమర వైపున పాత భవనం శ్లాబుపై అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి పిల్లర్లు పోసి అలాగే వదిలేశారు. ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు వినియోగించే కార్యాలయం భవనం శ్లాబు పూర్తిగా బలహీనపడి పెచ్చులూడి పడుతున్నాయి. హైస్కూల్లోకి వచ్చే విద్యార్థులు ఈ భవనం నుంచే రావాల్సి ఉంది. అయినా శ్లాబుకి మరమ్మతులు చేపట్టలేదు. ఫేజ్-1లో కేటాయించిన రూ.87.75 లక్షల్లో కేవలం రూ.38.19 లక్షలు మాత్రమే వినియోగించారు. మళ్లీ ఫేజ్-2లో భాగంగా మళ్లీ నూతన తరగతుల భవనం నిర్మిస్తామంటూ రూ.1.19 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో నూతన భవనం పిల్లర్లపై శ్లాబు వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. ఇందులోనూ కేవలం రూ.28.87 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్లే నిర్మాణాలను పూర్తి చేయించలేకపోయినట్టు గత ప్రభుత్వంపై విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి నిధులు కేటాయించి పనులను పూర్తిచేస్తే వచ్చే విద్యా సంవత్సరానికైనా అందుబాటులోకి వస్తాయి.



ఫేజ్-2లో చేపట్టిన నిర్మాణం కూడా అసంపూర్తిగానే

నాడు - నేడు పనులపై వివరాల సేకరణ

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్స్ 17 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో మండలంలో నాడు - నేడులో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులపై 17 పాఠశాలల హెచ్ఎంల నుంచి లిఖితపూర్వక వివరాలను సేకరించారు. ఎన్ని నిధులు మంజూరయ్యాయి, ఏయే పనులు చేపట్టారు, అసంపూర్తిగా ఉన్న పనులు, మంజూరు చేసిన నిధులు ఎంత చెల్లించారు, ఆ పనుల బిల్లులు ఆన్‌లైన్ అయ్యాయా అన్న అంశాలపై ఏఎంవోలు వివరాలు తెలుసుకున్నారు. మండలంలో 17 పాఠశాలల్లో మాత్రమే నాడు-నేడు అమలయిందని, ఇందులో తోట్లవల్లూరు హైస్కూల్, దేవరపల్లి, గరికపర్రు పాఠశాలల్లో కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నట్టు ఎంఈవో-1 జి వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 బి సురేష్ సదరు అధికారులకు వివరించారు. ఈ వివరాలను జిల్లాస్థాయిలో క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, తరువాత అసంపూర్తి పనులపై చర్యలు తీసుకుంటారని ఏఎంవోలు తెలిపారు.



నాడు నేడు పనుల లెక్కల వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకుంటున్న ఏఎంవోలు

ఉపాధి హామీ విధుల్లో నిర్లక్ష్యం

- ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వీరులపాడు మండలం, గూడెం మాధవరం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) మన్నే సుధీర్ సస్పెన్షన్‌కు కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఆదేశాలిచ్చారు. గ్రామంలో వేతనదారులకు పనులు కల్పించడంలోనూ సగటు వేతనం విషయంలో జిల్లాలోనే అట్టడుగు స్థానంలో నిలిచినందున, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు, సమావేశాలకు హాజరుకానందున క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఆదేశాలిచ్చారు. ఈ విషయమై సుధీర్‌కు నోటీసులు కూడా జారీ అయ్యాయి.



వైవీ ఈశ్వరరావును అభినందిస్తున్న డాక్టర్ జీఆర్ షణ్ముగప్ప

దేశానికే తలమానికం రవాణారంగం

- డాక్టర్ జీఆర్ షణ్ముగప్ప

లబ్బీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశానికే రవాణారంగం తలమానికమని, అసంఘటిత రంగంలోని లారీ యజమానుల ఆశాజ్యోతిగా వైవీ ఈశ్వరరావు చేస్తున్న సేవలు నిరుపమానమని ఆలిండియా మోటారు ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ చైర్మన్, సీమ్బా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీఆర్ షణ్ముగప్ప అన్నారు. ఆలిండియా మోటారు ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు అభినందన సభ బుధవారం సాయంత్రం లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, లారీ ఓనర్స్ స్టీరింగ్ కమిటీ కార్యదర్శి పీఎస్‌వీ ప్రసాదరావు, ఏపీ లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు పి.గోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, స్పోర్ట్స్ అధ్యక్షుడు కోనేరు వెంకట రమేష్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి బాబూరావు పాల్గొని అభినందనలు తెలిపారు.

నగర మహిళ అవయవదానం

- 14న రోడ్డు ప్రమాదంలో గాయపడిన సరస్వతి
- ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- కుటుంబ సభ్యుల అనుమతితో అవయవదానం



మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్టెమ్ డెడ్‌కు గురైన నగరానికి చెందిన మహిళ తన అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు ఈ వివరాలను వెల్లడించారు. విజయవాడ భవానీపురానికి చెందిన ముత్యాల సరస్వతి (54) ఈ నెల 14న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులపాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించిన వైద్యులు, మంగళవారం సరస్వతి బ్రెయిన్ స్టెమ్ డెడ్‌కు గురైనట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియపర్చి, అవయవదానంపై అవగాహన కల్పించారు. సరస్వతి కుటుంబ సభ్యులు, బంధువులు అవయవ దానం చేసేందుకు అంగీకరించడంతో బుధవారం సాయంత్రం ఆ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సందర్భంగా తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ అవయవదానం చేసేందుకు సరస్వతి కుటుంబ సభ్యులు ముందుకు రావడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. దాత శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్, రెండు నేత్రాలను సేకరించి మణిపాల్, ఎయిమ్స్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రులకు పంపుతున్నట్టు తెలిపారు. అవయవదాతల త్యాగాన్ని గౌరవిస్తూ దాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో చేపడతామని వెల్లడించారు. ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అహంతెమ్ శాంతా సింగ్, గుంటూరు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎయిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

కోళ్లు, గుడ్ల రవాణాపై ఆంక్షలు లేవు: వెటర్నరీ డైరెక్టర్

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోళ్లు, కోడిగుడ్ల రవాణాపై ఆంక్షలు లేవని పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలోని పౌల్ట్రీ ఫారాల్లో కొత్తగా బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదన్నారు. చికెన్, ఎగ్స్ తీసుకోవడంపై ప్రజల్లో అపోహలు తొలగించడానికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో మేళాలు నిర్వహిస్తామన్నారు. ఉడికించిన గుడ్లు, చికెన్ తినొచ్చన్నారు.

రంజాన్ మాసంలో పనివేళలు మార్చండి: రూటా

రంజాన్ మాసంలో ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్చాలని, ఉపాధ్యాయులకు అనుకూలంగా పాఠశాలలు నడపాలని రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం(రూటా) కోరింది. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముస్తాక్, అదనపు కార్యదర్శి హుస్సేన్ బుధవారం మంగళగిరిలోని కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. 9, 10 తరగతుల ఉర్దూ పాఠ్యపుస్తకాలు అర్థం కాని స్థాయిలో ఉన్నాయని, దీనిపై వర్క్‌షాప్ నిర్వహించి పాఠ్యపుస్తకాలను సులభతరం చేయాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



రోగులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీజీహెచ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులను కలిసి వైద్యసేవలను గురించి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ వద్ద క్యూలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయని ఆరా తీశారు. భోజనాన్ని పరిశీలించారు. గ్యాస్ మాత్రలు లేవని కొందరు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆయన ముందు ఆప్రాన్ లేకుండా హాజరైన వైద్యురాలు కాకర్లకు నోటీసులు జారీ చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ రోగులకు ఏయే విభాగాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సులువుగా తెలిసేందుకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది కొరత లేకుండా చూస్తామన్నారు. జీబీఎస్ అంటువ్యాధి కాదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రోగులకు స్ట్రెచర్లు, వీల్‌చైర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. 4 రోజుల క్రితం జి.కొండూరు మండలం కందులపాడు శివారు చేగిరెడ్డిపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

జీజీహెచ్‌లో జీబీఎస్ వైరస్ కలకలం

విజయవాడ జీజీహెచ్‌లో జీబీఎస్ వైరస్ కలకలం రేపింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలానికి చెందిన ఒక మహిళ (30)కి ఈనెల 18న విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల్లో ఆమెకు జీబీఎస్ వైరస్ ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఆమెను ఐసీయూలో ఉంచి వైద్య సేవలందిస్తున్నారు.

63 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు

- కృష్ణాజిల్లాలో మార్చి 1 నుంచి జరిగే పరీక్షలకు సర్వం సిద్ధం
- హాజరుకానున్న 45,430 మంది విద్యార్థులు
- బాలుర కంటే బాలికలే అధికం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. 63 పరీక్షా కేంద్రాల్లో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 45,430 మంది హాజరవుతున్నారు. ఫస్టియర్ విద్యార్థులు 24,557, సెకండియర్ 20,873 మంది హాజరవుతున్నారు. బాలుర కంటే బాలికలే అధిక శాతం ఉన్నారు. 22,187 మంది బాలురు కాగా 23,243 మంది బాలికలు హాజరవుతున్నారు. ఫస్టియర్‌కు 12,114 మంది బాలురు, 12443 బాలికలు, సెకండియర్‌కు 10,073 మంది బాలురు, 10,800 బాలికలు హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 163 మందిని నియమించారు. 18 పోలీసు స్టేషన్లలో ప్రశ్నాపత్రాలకు స్ట్రాంగ్ రూమ్‌లుగా నిర్ణయించారు.

అన్ని శాఖల సహకారంతో పకడ్బందీగా పరీక్షల నిర్వహణ: సాల్మన్‌రాజు



పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల సహాయ సహకారాలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 23న ఉయ్యూరు విశ్వశాంతి స్కూల్‌లో పరీక్షలు నిర్వహించే అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తరగతులకు కలెక్టర్ హాజరవుతారన్నారు.

దళిత మహిళలపై పెరుగుతున్న హింస

- రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత



దళిత స్త్రీ శక్తి సంస్థ వార్షిక మహాసభల్లో ప్రసంగిస్తున్న ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం దళిత మహిళలపై హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత అన్నారు. దళిత స్త్రీ శక్తి సంస్థ 19వ వార్షిక మహాసభలు బుధవారం లెనిన్ సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యవేదిక సమావేశ మందిరంలో జరిగింది. మహాసభలకు సంస్థ జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసీ మహిళలపై జరుగుతున్న హింస, మానసిక ఆరోగ్యం వివిధ కోణాలు అనే అంశంపై పలువురు వక్తలు మాట్లాడారు. దళిత మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల్లో 2 శాతం మాత్రమే నిందితులకు శిక్ష పడుతోందన్నారు. ఇలాంటి హింసాత్మక ఘటనలపై దళిత స్త్రీ శక్తి పోరాటం అభినందనీయమన్నారు. సంస్థ జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ దళిత ఆదివాసీ స్త్రీలపై జరుగుతున్న అనేక హింసాత్మక ఘటనలను ప్రతిఘటిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే దిశగా సంస్థ పోరాడుతోందన్నారు. 19ఏళ్లుగా దళిత ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలపై చేస్తున్న ఉద్యమాలు, పోరాటాలను వివరించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ సరస్వతీ అయ్యర్ మాట్లాడుతూ స్త్రీలపై హింస అనేక ప్రభావాలకు గురిచేస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలతో స్త్రీలు మానసిక రుగ్మతలకు గురౌతూ, తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతున్నారన్నారు. సీనియర్ పాత్రికేయుడు విశ్వనాథ్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ, సైకాలజిస్ట్ కృష్ణకుమారి, నాగార్జున వర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రాధిక, సంస్థ ప్రతినిధులు సత్యకామా జాబాలి, బండారు రాజు, సత్యనారాయణమ్మ, వివిధ జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు హాజరయ్యారు.



విద్యార్థులను ప్రశ్నిస్తున్న జిల్లా న్యాయాధికారి అరుణ సారిక

గురుకుల పాఠశాల తనిఖీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలను జిల్లా న్యాయాధికారి ఎస్ అరుణసారిక బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో పెడుతున్న ఆహార పదార్థాలు, విద్యాబోధన ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిల్వ పదార్థాలు పెడుతున్నారని, పాలు, మజ్జిగ, చారు నీళ్లలా ఉంటున్నాయని, కూరలు బాగుండటంలేదని విద్యార్థులు జిల్లా న్యాయాధికారికి తెలిపారు. రుచి, శుచి, శుభ్రత కలిగిన ఆహారం అందించాలని, స్కూల్ ఆవరణలో పరిశుభ్రత పాటించాలని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌ను న్యాయాధికారి ఆదేశించారు. జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణ, ఉయ్యూరు న్యాయాధికారి కే శ్రీహరి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాగిత గోపీచంద్, జీ శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.



వీరమ్మ తల్లి సన్నిధిలో..

తిరునాళ్ల సందర్భంగా వీరమ్మతల్లిని జిల్లా న్యాయాధికారి కే అరుణ సారిక బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఉయ్యూరులో ఎస్టీ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ అనంతరం ఆమె అమ్మవారిని దర్శించారు. ఆలయ కమిటీ ఆమెకు స్వాగతం పలికి ఆలయంలోకి తోడ్కొని వెళ్లి అమ్మవారి దర్శనం చేయించి పసుపు కుంకుమ, వస్త్రాలు అందజేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణ, ఉయ్యూరు న్యాయాధికారి కే శ్రీహరి జిల్లా న్యాయాధికారి వెంట ఉన్నారు.

వైసీపీ హయాంలోనే విద్యావ్యవస్థ నాశనం

- డీఎస్సీ అభ్యర్థులను కలిసి ఓట్లు అభ్యర్థించిన మండలి, పట్టాభి



డీఎస్సీ ఆశావాహులతో మాట్లాడుతున్న పట్టాభిరామ్, చిత్రంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ పూర్తిగా సర్వనాశనమైందని, ఉపాధ్యాయులను వైన్‌షాపుల ముందు నిలబెట్టిన హీనచరిత్ర జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డ విద్యానికేతన్ విద్యాసంస్థలో శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులు, ఉపాధ్యాయులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పనిచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ప్రజావ్యతిరేక విధానాలను డీఎస్సీ ఆశావహులకు ఆయన వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, జూన్ నాటికి 16వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తవుతుందన్నారు. మండలి వెంకట్రామ్, ఆప్స్ డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, విద్యానికేతన్ కన్వీనర్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, కొండవీటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

బీచ్‌లో దక్షిణ కొరియా విద్యార్థుల క్లీనింగ్



మంగినపూడి బీచ్‌లో చెత్తను ఏరుతున్న విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగినపూడి బీచ్‌లో బుధవారం దక్షిణ కొరియా కేంద్రంగా పనిచేస్తున్న ఏఐఎస్‌ఈజడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. సముద్ర తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి శుభ్రం చేశారు. పర్యాటక శాఖ జిల్లా అధికారి జి. రామలక్ష్మణరావు, సంస్థ ప్రతినిధి విలియం, ప్రేమ్‌కుమార్, దక్షిణ కొరియా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ వార్డెన్ మాకొద్దు.. అధికారులతో విద్యార్థులు



విద్యార్థి నుంచి వివరాలు సేకరిస్తున్న డీబీసీడబ్ల్యువో మహేష్

మైలవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సరైన తిండి పెట్టని, భద్రత కల్పించలేని వార్డెన్ మాకొద్దంటూ విద్యార్థునులు డీబీసీడబ్ల్యువో మహేష్ ముందు వాపోయారు. 'వామ్మో వసతి గృహం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీబీసీడబ్ల్యువో మహేష్ బుధవారం మైలవరంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు ఆయనకు తమ గోడును వెళ్లబోసుకుంటూ రెండేళ్లుగా వార్డెన్ ముఖం చూడలేదన్నారు. సరైన ఆహారం పెట్టరని, ఎవరిని అడగాలో తెలియదని వాపోయారు. ఆహారం ఒక పూట ఉంటే మరో పూట ఉండదని కొన్నిసార్లు కూరల్లో నీళ్లు పోస్తున్నారని దీంతో ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆవేదన చెందారు. చిక్కీలు, కోడిగుడ్లు చూసిందే లేదన్నారు. అర్ధాకలితో, అపరిశుభ్రతతో అలమటిస్తూ చదువులు సాగిస్తున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. సమస్యలు చెప్పుకునేందుకు వార్డెన్‌కు కాల్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేసే వారు కాదని పై అధికారులకు చెబితే అక్కడ మీకు హాస్టల్ ఉండదని బెదిరించేవారని తెలిపారు. ఎప్పుడైనా ఏబీసీడబ్ల్యువో రవి ప్రసాద్ సరుకులు తెచ్చి వెళుతుండేవారని చెప్పారు. అన్ని విషయాలు రికార్డు చేశామని నివేదిక కలెక్టర్‌కు పంపి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. వార్డెన్ రమాదేవి అందుబాటులోకి రాలేదని ఇన్‌చార్జి వార్డెన్‌గా నరసింహారావుకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఎంఈవో బాలు, తదితరులు పాల్గొన్నారు.

2,603 గ్రాముల బంగారం రికవరీ

- కర్ణాటక బ్యాంకులో ఇంటిదొంగ ఆటకట్టు
- మీడియాతో కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న గన్నె సోమశేఖర్ ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారు వస్తువులను చోరీచేసి వాటి స్థానంలో రోల్డుగోల్డు నగలు పెట్టిన కేసులో 2603 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిందితుడు సోమశేఖర్ యాజమాన్యాన్ని మోసగించి 3002 గ్రాముల బంగారాన్ని దొంగిలించాడన్నారు. దర్యాప్తు చేసిన తరువాత సోమశేఖర్ వివిధ బ్యాంకుల్లో తాను దొంగిలించిన బంగారాన్ని కుదువపెట్టాడన్నారు. ఆ బంగారాన్ని చాలా వరకు రికవరీ చేశామని, మిగిలిన బంగారాన్ని కూడా రికవరీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు బంగారు రుణం ఇచ్చేటప్పుడు కస్టమర్ పూర్వాపరాలు తెలుసుకుని ఇవ్వాలన్నారు. ఇలా దొంగలు కుదువపెట్టిన బంగారానికి రుణాలిస్తే బ్యాంకులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌పేట సీఐ ఏసుబాబు, చిలకలపూడి సీఐ నబి, సీసీఎస్ సీఐ కె.వి.ఎస్. వరప్రసాద్‌కు రివార్డులు ఇస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 20 ఫిబ్రవరి 2025

మొక్కలను ఇలా సంరక్షించుకోండి...

బాల్కనీలో లేదా పెరట్లో పెంచుకునే మొక్కలకు ఒక్కోసారి పురుగులు, తెగుళ్లు పడుతుంటాయి. వీటిని నివారించడానికి నిపుణులు సూచిస్తున్న ఇంటి చిట్కాలు ఇవే...

- ఒక గిన్నెలో గ్లాసు నీళ్లు, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లను



ఒక స్ప్రే బాటిల్‌లో పోసి వారంపాటు మొక్కలపై పిచికారీ చేస్తే తెగుళ్లు, పురుగులు తొలగిపోతాయి.
- అరగ్లాసు నీళ్లలో ఒక చెంచా సబ్బు పొడి లేదా సర్ఫ్, రెండు చెంచాల వంట నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మొక్కల కొమ్మలకు కాండానికి పూయాలి. ఇలా మూడు రోజులు చేస్తే పురుగులన్నీ నశించిపోతాయి.
- ఒక గ్లాసు నీళ్లలో రెండు చెంచాల కారం వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోయాలి. రెండు రోజులకు ఓసారి ఈ నీళ్లను మొక్కలపై పిచికారీ చేస్తే పురుగులు రావు. బజార్లో దొరికే పెప్పర్ స్ప్రే కూడా మంచి ఫలితాన్నిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా వెనిగర్, అర చెంచా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోయాలి. దీనిని రోజుకు రెండుసార్లు మొక్కలపై పిచికారీ చేస్తే తెగుళ్లు మాయమవుతాయి. పురుగులు చేరవు.
- ఏడు వెల్లుల్లి రెబ్బలను మెత్తగా నూరి ఒక గ్లాసు నీళ్లలో కలపాలి. తరవాత వడబోసి ఒక చెంచా పసుపు కలిపి స్ప్రే బాటిల్‌లో నింపాలి. ప్రతి రోజూ ఉదయాన్నే ఈ నీటిని మొక్కలపై పిచికారీ చేస్తూ ఉంటే ఎటువంటి పురుగులైనా నశించిపోతాయి.

కౌన్సెలింగ్

మద్యం ప్రభావం ఏ మేరకు?

Q A

డాక్టర్! మా వారికి మద్యం అలవాటు ఉంది. మద్యాన్ని నాక్కూడా అలవాటు చేశారు. ఈ అలవాటు ప్రమాదకరం అని మా ఇద్దరికీ తెలుసు. కానీ వారానికి ఒకసారే కాబట్టి ప్రమాదం ఉండదని నాతో వాదిస్తున్నారు. పరిమితంగా తాగేవారికి మద్యంతో ఎలాంటి ప్రమాదం ఉండదా?

- ఓ సోదరి, హైదరాబాద్.

మద్యం ప్రభావానికి గురయ్యే తత్వం, మద్యం ప్రభావం తీవ్రతలు మనిషి మనిషికీ వేర్వేరుగా ఉంటాయి. అందరి శరీరాలూ ఒకే విధంగా మద్యాన్ని శక్తిగా మార్చుకోలేవు. జన్యుపరమైన అంశాలు, వయసు, లింగం, ఆరోగ్య పరిస్థితులు, ఎటువంటి దుష్ప్రభావాలకు లోను కాకుండా ఒక వ్యక్తి తీసుకోదగిన సురక్షిత మద్యం మోతాదును నిర్ణయిస్తాయి. ఉదాహరణకు...

- పురుషుల కంటే మహిళలకు మద్యాన్ని భరించే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. స్త్రీపురుషుల శరీర పరిమాణం, ఎంజైమ్‌ల పనితీరుల్లోని వ్యత్యాసాలే ఇందుకు ప్రధాన కారణం.
- కుటుంబచరిత్రలో మద్యపాన వ్యసనపరులున్న వారిలో మద్యం సంబంధిత అవయవ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మద్యంతో కాలేయ నష్టం


మద్యం ఏ మోతాదులో తీసుకున్నా, ఎంత పరిమితంగా తీసుకున్నా కాలేయానికి కచ్చితంగా నష్టం జరుగుతుంది. దీర్ఘకాలంలో కాలేయం పలు రకాల రుగ్మతలకు గురవుతుంది.

- **కాలేయానికి కొవ్వు:** పరిమితంగా మద్యం తీసుకునేవారిలో కూడా కాలేయంలో కొవ్వు పేరుకుంటుంది. ఈ దశలో మద్యపానానికి స్వస్తి చెప్పగలిగితే తిరిగి కాలేయం పూర్తిగా కోలుకుంటుంది
- **మద్యం సంబంధిత కామెర్లు:** ఆల్కహాలిక్ హెపటైటిస్ అనే ఈ రుగ్మతలో తీవ్రమైన మద్యపాన సేవనం వల్ల, కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్ తలెత్తి, నొప్పి, కామెర్లు మొదలై, కాలేయ పనితీరు అస్తవ్యస్థమై, చివరకు మరణం కూడా సంభవించవచ్చు



- **సిర్రోసిస్:** దీర్ఘకాలం పాటు యథేచ్ఛగా మద్యం తాగడం వల్ల, కాలేయం మీద శాశ్వత మచ్చలు ఏర్పడి, కాలేయం విఫలమవుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలని కోరుకునే వారు మద్యపానానికి స్వస్తి చెప్పడం ఒక్కటే మార్గం. కాబట్టి ఈ అలవాటును వెంటనే మానుకోండి. మానేయలేని పక్షంలో వైద్య సహాయం తీసుకోవచ్చు.

డాక్టర్ కె.ఎస్. సోమశేఖర రావు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్.



మద్యంపై మహిళల పోరు

సంకల్పం

ఊరుకు పట్టిన 'మత్తు' వదిలించడానికి మహిళా లోకం కదిలింది. యువకుడి మరణానికి కారణమైన మద్యాన్ని... తమ గ్రామం నుంచి తరిమేయాలని సంకల్పించింది. బెల్టు షాపులను మూయించి... మద్యం అమ్మినా... తాగినా జరిమానా వేయాలని నిర్ణయించింది. ఒత్తిడులు ఎదురైనా... బెదిరింపులు వచ్చినా... మద్య నిషేధాన్ని కొనసాగించి తీరతామని... మరే కుటుంబాన్నీ అనాథ కానివ్వమని ప్రతిజ్ఞ పూనింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామ మహిళల మహాపోరాటం 'నవ్య'కు ప్రత్యేకం.

ఇది మహాసంగ్రామం. ఊరు కోసం... ఊళ్లోని ప్రతిఒక్కరి బాగు కోసం ఏపూరు మహిళలు భుజానికెత్తుకున్న ఉద్యమం... మద్య నిషేధం. ఏపూరుకు చెందిన మినీ లారీ డ్రైవర్ కూరాకుల ధనుంజయ ఇటీవల గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ధనుంజయకు భార్య శిల్ప, మూడేళ్ల కుమారుడు హర్షిత్, ఏడాదిన్నర కూతురు తేజస్వీ ఉన్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత కూడా అతడిదే. డ్రైవర్‌గా రోజంతా



కష్టపడి సంపాదిస్తేనే ధనుంజయ కుటుంబానికి పూట గడిచేది. అలాంటి కుటుంబం ధనుంజయ మరణంతో దిక్కులేనిదయింది. వారి పరిస్థితి గ్రామస్తులను కలచివేసింది. ఆ కుటుంబానికి వచ్చిన కష్టం... తమకొచ్చినట్లేనని గ్రామంలోని మహిళలంతా భావించారు. ఆ బాధను పంచుకోవాలని, ఈ మరణానికి కారణమైన మద్యం దెయ్యాన్ని గ్రామం నుంచి తరిమేయాలని కంకణబద్ధులయ్యారు.

అమ్మితే లక్ష జరిమానా...

గ్రామంలో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడానికి, నైతికంగా పతనం కావడానికి కారణమైన మద్యాన్ని గ్రామం నుంచి పారదోలాలని సంకల్పించారు. ధనుంజయ అంత్యక్రియలు ముగిసేలోగానే మహిళలంతా సమావేశమై గ్రామంలో మద్య నిషేధం విధించారు. బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని తీర్మానించారు. మద్యం అమ్మితే రూ.లక్ష, మద్యం సేవిస్తే రూ.20 వేల జరిమానా వేయాలని నిర్ణయించారు. అంతేకాదు... మద్యం అమ్మినవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా కూడా ఇస్తామని ప్రకటించారు. తామంతా కలిసి తీసుకున్న నిర్ణయానికి గ్రామంలోని మగవారంతా సహకరించాలని కోరారు. గత వారం రోజులుగా మద్య నిషేధం అమలు చేస్తుండడంతో గ్రామంలో కొత్త వాతావరణం నెలకొంది.

వెనక్కి తగ్గేది లేదు...

'మా ఊళ్లో మద్య నిషేధం కొనసాగించడానికి ఎంతవరకైనా పోరాడతాం. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదు. ఊళ్లో మళ్లీ బెల్టు షాపులు ఏర్పాటు చేసినా, అక్రమ మద్యం సిట్టింగులు కొనసాగించినా జరిమానాలు విధించడమే కాదు... వారిని పోలీసులకు పట్టిస్తాం. ఈ ఉద్యమానికి మా కుటుంబాల నుంచి కూడా సంపూర్ణ మద్దతు లభించింది. మా నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇవన్నీ చూశాక గ్రామంలో మద్య నిషేధాన్ని అమలు చేయగలుగుతామన్న నమ్మకం కలిగింది" అంటారు ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన అనురాధ తదితర మహిళలు.

'కొనసాగించి తీరతాం..'

రాజకీయ, ఇతర కారణాలతో ఎవరూ బెల్టుషాపు నిర్వాహకులను వెనకేసుకురావద్దని మహిళలు గ్రామస్తులందరినీ హెచ్చరించారు. ప్రతి మహిళ తన ఇంట్లో ఎవరూ తాగకుండా చూడాలని సంకల్పించుకున్నారు. తమ భర్తలు, పిల్లలు మద్యం తాగవద్దని తాము చెప్పడమే కాకుండా, పిల్లలతోనూ చెప్పిస్తున్నారు. మహిళలే గ్రామంలో మద్య నిషేధం కోసం అందరినీ చైతన్య పరుస్తున్నారు. దాన్ని పక్కాగా అమలు చేసే బాధ్యత కూడా వారే తీసుకున్నారు. ప్రతి మహిళా తన ఇంటి నుంచే మార్పు రావాలని బలంగా సంకల్పించుకున్నారు. తమ ఇళ్లల్లోని మగవారిని మద్యం జోలికి వెళ్లకుండా నచ్చజెబుతున్నారు. ఆటంకాలు ఎన్ని ఎదురైనా... బెదిరింపులు వచ్చినా గ్రామంలో మద్య నిషేధం కొనసాగించి తీరతామని ప్రతిజ్ఞ చేశారు.

మంచి నిర్ణయం

"మద్య నిషేధం తర్వాత ఊళ్లో సాయంత్రమయ్యాక ఎవరింటికి వారు వెళుతున్నారు. అన్ని కుటుంబాలూ ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా నిద్రిస్తున్నాయి. ధనుంజయ మరణంతో ఊళ్లో కదలిక వచ్చింది. మహిళలందరూ కలిసి తీసుకున్న మద్య నిషేధ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి. ఊళ్లో మద్యం విక్రయించకుండా అందరూ సహకరించాలి. వినకపోతే పోలీసులు జోక్యం చేసుకోవాలి" అంటారు గ్రామస్తుడైన వృద్ధుడు వీరయ్య యాదవ్.

ఒక్క సీసా కూడా రానిచ్చేదిలేదు...

గ్రామంలో ఉన్న 650 కుటుంబాలలో దాదాపు 2500 జనాభా ఉంది. ఈ గ్రామంలో 300 పైచిలుకు మంది డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మరోవైపున గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఒక ప్రైవేట్ పరిశ్రమలో మరో 150 మంది వరకు పని చేస్తున్నారు. కేవలం వ్యవసాయం, కులవృత్తులే కాకుండా ప్రతి కుటుంబానికి అదనంగా పని చేసే వనరుల ద్వారా అదనపు సంపాదన వస్తుండడంతో తేలిగ్గా మద్యం సేవించేందుకు అలవాటు పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయనేది గ్రామస్తుల మాట. స్థానికంగా ఉన్న 13 బెల్టు షాపులను గుర్తించిన మహిళలు... వారందరినీ మద్యం అమ్మకుండా కట్టడి చేశారు. మరోవైపు గ్రామ సమీపంలో దాబాల ముసుగులో ఉన్న అక్రమ సిట్టింగులను కూడా నిషేధించారు. ప్రస్తుతం గ్రామంలో ఒక్క మద్యం సీసా కూడా కనిపించడంలేదు. బెల్టు షాపుల నిర్వాహకులు మహిళలపై రకరకాలుగా ఒత్తిళ్లు తెస్తున్నారు. కానీ వాటికి తాము లొంగేది లేదని, ఊళ్లోకి మద్యం సీసా రానిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. వారి దృఢ సంకల్పానికి మహిళా లోకం జేజేలు పలుకుతోంది.

• **చల్లా సాంబశివారెడ్డి,** నల్లగొండ

స్ఫూర్తి

మైఖెల్ షూమాకర్, మ్యాక్స్ వెర్‌స్టాపెన్... ఈ పేర్లు వినగానే ఎఫ్1 రేసుల్లో విమాన వేగంతో దూసుకుపోయే కార్లు మన కళ్ల ముందు మెదులుతాయి. వారి స్ఫూర్తితో రేసుల్లో దూసుకుపోతోంది పదేళ్ల కశ్మీరు బాలిక ఆతికా మిర్. తాజాగా 'రోటాక్స్ ఛాలెంజ్ ఇంటర్నేషనల్ ట్రోఫీ' గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆడపిల్లగా చరిత్ర సృష్టించింది. 'వరల్డ్ సిరీస్ కార్టింగ్' ఛాంపియన్‌షిప్ కోసం సన్నద్ధమవుతున్న ఆతికా కథ ఇది.

రేస్‌లో సరికొత్త సంచలనం



గో కార్టింగ్... కారు రేసు ప్రేమికులను ఆకట్టుకునే క్రీడ. ప్రత్యేకించి వరల్డ్ కార్టింగ్ సిరీస్, ఉత్తమమైన డ్రైవర్లనూ, టాప్ కార్ట్, ఇంజన్ ఉత్పత్తిదారులనూ ఆకట్టుకుంటూ ఉంటుంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన 'వరల్డ్ సిరీస్ కార్టింగ్' (డబ్ల్యుఎస్‌కె) ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనబోతున్న పదేళ్ల భారతీయ బాలికగా ఆతికా మిర్ చరిత్ర సృష్టించబోతోంది. తాజాగా దక్షిణ ఇటలీలోని, లా కొకా సర్క్యూట్‌లో చేపట్టిన టెస్ట్ సెషన్‌లో ఆతికా అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జమ్ముకశ్మీరుకు చెందిన ఈ రేసర్, 60 కార్టులతో కూడిన విఎనీ క్లాస్‌లో పాల్గొన్న ఏకైక బాలిక కావడం విశేషం. ఈ



పాప ఈ ఏడాది జరగబోయే డబ్ల్యుఎస్‌కె సూపర్ మాస్టర్ సిరీస్, డబ్ల్యుఎస్‌కె యూరో సిరీస్, డబ్ల్యుఎస్‌కె ఫైనల్ కప్ పోటీల్లో పాల్గొనబోతోంది. ఈ పోటీల గురించి మాట్లాడుతూ... 'ఈ పోటీలో పాల్గొనే అవకాశం దొరకడం నా అదృష్టం. ఇది నేను నడపబోతున్న అత్యున్నతమైన కార్టింగ్ కాబోతోంది. ఈ పోటీ కోసం ఎన్నో సర్క్యూట్లలో నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. పైగా చలి కాలంలో డ్రైవ్ చేయడం చాలా కష్టం. అయినా నేనందుకు అన్ని విధాలా సిద్ధమయ్యాను' అంటూ మీడియాకు వివరించిందీ పాప. డబ్ల్యుఎస్‌కెలో ప్రారంభ రోజుల్లో రేసులో పాల్గొన్న ప్రముఖ డ్రైవర్లలో ఎఫ్1 డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ కూడా ఉన్నాడు. అతనిలాగే ఆతికా కూడా రేసింగ్ కుటుంబ నేపథ్యాన్ని కలిగి ఉంది. ఈ పాప తండ్రి ఆసిఫ్ నజీర్, భారత మొట్టమొదటి జాతీయ కార్టింగ్, ఫార్ములా ఆసియా ఛాంపియన్. ఆతికా పాల్గొనే ప్రతి పోటీలో కూతురి వెన్నంటి ఉంటూ, రేసింగ్ మెలకువలను నేర్పిస్తూ ఉంటారు ఆసిఫ్.

తండ్రి తోడుగా...

తన కూతురి ప్రతిభ గురించి మాట్లాడుతూ, 'ఆతికా తన అంకితభావంతో, ప్రతిభతో కార్టింగ్‌లో అత్యున్నత స్థానాన్ని అందుకోగలిగింది. అయితే తాజా రేసులో ఆమె కొన్ని మెలకువలను అలవరుచుకోక తప్పదు. కొత్త ట్రాక్స్, కొత్త పరిస్థితులు, కొత్త వాతావరణాలకు కూడా అలవాటు పడాలి. ఈ పోటీ ఆమెకొక పెద్ద సవాలుగా మారబోతోంది" అంటూ కూతురి ప్రతిభను ప్రశంసిస్తూనే, పోటీలో గెలుపు సాధ్యాసాధ్యాల గురించి ప్రస్తావించాడు ఆసిఫ్ నజీర్.

ఐదేళ్ల వయసులోనే...

ఐదేళ్ల వయసులోనే ఇండోర్ కార్టింగ్ మొదలుపెట్టిన ఆతికా, ఎంతో వేగంగా యుఎఇ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే స్థాయికి చేరుకుంది. ర్యాంకుల పరంగా కూడా వేగంగా ఎదిగింది. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ... 'ప్రతి విజయం తరువాత మా నాన్న నాకు కొత్త లక్ష్యాలను ఇస్తూ ఉంటారు. ఆయన ప్రేరణతో నేను వాటిని అందుకుంటూ ఉంటాను. అలా క్రమేపీ నా వయసు విభాగంలో జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదగగలిగాను' అంటోంది ఆతికా. తన విజయాల గురించి వివరిస్తూ... 'నాకెంతో గర్వంగా ఉంది. మోటార్ స్పోర్ట్స్‌లో మహిళలకు అవకాశాలు తక్కువ. లె మ్యాన్స్ కార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో విజయం సాధించినందుకు, ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ సిరీస్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అర్హత పొందినందుకూ నాకెంతో గర్వంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఈ చిన్నారి.

ఆతికా మిర్ విజయ పరంపర

మెగా ఛాంపియన్‌షిప్ మీద గురి పెట్టిన ఆతికా ఇప్పటివరకూ పలు పోటీల్లో అత్యద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ఆ వివరాలు...

- ప్రపంచవ్యాప్త జాతీయా కార్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో అత్యధిక ర్యాంకు సాధించిన తొలి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు పొందింది
- డిఎఎమ్‌సి, మిడిల్‌ఈస్ట్ కప్ 2024లో మూడో స్థానం పొందింది
- ఎఫ్ఎమ్ఎస్‌ఐ జాతీయ నేషనల్ కార్టింగ్ ఛాంపియన్‌షిప్ రౌండ్ వన్‌లో మూడో స్థానం సాధించింది
- దుబాయిలోని ల్యాప్ రికార్డును బద్దలు కొట్టిన మొట్టమొదటి భారతీయురాలు
- లె మ్యాన్స్ కార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ గెలిచిన తొలి మహిళా డ్రైవర్
- ఐరన్ డేమ్స్ యంగ్ టాలెంట్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన తొలి ఆసియా వనిత
- రోటాక్స్ ఛాలెంజ్ అంతర్జాతీయ ట్రోఫీ రేసులో గెలిచిన తొలి భారతీయురాలు

ఈగలను తరిమికొట్టండి ఇలా...

వాతావరణం వేడెక్కే కొద్దీ ఈగల బెడద ఎక్కువవుతూ ఉంటుంది. ఈగలను తరిమికొట్టేందుకు కొన్ని చిట్కాలు...

- ఇంటి తలుపులు, కిటికీలు తెరచి ఉంచాలి. ఒక వెడల్పాటి గిన్నె లేదా మట్టి ప్రమిదను తీసుకుని అందులో అయిదు బిర్యానీ ఆకులు, రెండు చెంచాల వేప లేదా ఆవ నూనె, అయిదు కర్పూరం బిళ్లలు వేసి వెలిగించాలి. ఈ ప్రమిదని ప్రతి గదిలో కొంచెంసేపు ఉంచాలి. ఇందులో నుంచి వచ్చే పొగ వాసనకు ఈగలన్నీ బయటికిపోతాయి.
- వంటగది సింక్ లోపల, చెత్తబుట్ట చుట్టూ బేకింగ్ సోడా చల్లి దానిపై నిమ్మ రసాన్ని చుక్కలుగా పిండాలి. నిమ్మకాయ వాసనవల్ల ఈగలు దూరంగా వెళ్లిపోతాయి.
- ఒక పళ్లెంలో అయిదు మిరియాలు, నాలుగు వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా నూరాలి. ఈ పేస్టుని ఒక స్ప్రే బాటిల్‌లో వేసి నిండుగా నీళ్లు పోయాలి. వంటగది కిటికీల దగ్గర, తలుపుల మీద, సింక్‌లో ఈ నీళ్లు పిచికారీ చేస్తే ఈగలు రావు.



- ఒక స్ప్రే బాటిల్‌లో ఉప్పు లేదా కర్పూరం పొడి కలిపిన నీళ్లు పోసి ఈగలు వాలే చోట పిచికారీ చేయాలి. ఈ నీళ్లతో ఇల్లంతా తుడిచినా మంచి ఫలితం కనిపిస్తుంది.

పావురాలు రాకుండా ఉండాలంటే...

బాల్కనీ, కిటికీలు, వెంటిలేటర్ల వద్ద పావురాలు వచ్చి గూళ్లు కడుతూ ఉంటాయి. వీటి రెట్టల వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. నెట్, మెష్ లాంటివి పెట్టకుండా ఇంట్లో దొరికేవాటితోనే కొన్ని చిట్కాలు పాటించి పావురాలు రాకుండా చేయవచ్చు.

- గుప్పెడు మిరియాలను తీసుకుని కొద్దిగా వేడి చేసి మెత్తగా నూరి పొడి చేయాలి. బాల్కనీ, కిటికీలతోపాటు పావురాలు వాలే ప్రదేశాల్లో ఈ పొడిని చల్లాలి. మిరియాల ఘాటుకి పావురాలు రావు.
- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా వెనిగర్ లేదా పుదీనా నూనె కలిపి పావురాలు తిరిగే చోట చల్లితే అవి వెళ్లిపోతాయి. ఏదైనా ఎస్సెన్షియల్ ఆయిల్ లేదా దాల్చిన చెక్క పొడి కలిపిన నీళ్లు చల్లినా ప్రయోజనం ఉంటుంది.
- పావురాలు వాలే ప్రదేశాల్లో విండ్ చైమ్స్ వేలాడదీయాలి. గాలి వీచినప్పుడు ఇవి చేసే శబ్దం వల్ల పావురాలు దూరంగా వెళ్లిపోతాయి. అద్దాలతోపాటు మెరిసే గొట్టాలు ఉన్నవి అయితే మంచి ఫలితం కనిపిస్తుంది.



- బాల్కనీలో గద్ద, గుడ్లగూబ లాంటి పెద్ద పక్షుల బొమ్మలను వేలాడదీస్తే పావురాలు భయపడి రావు.
- సన్నని దారంతో పాత సీడీలను కట్టి వేలాడదీస్తే అవి ప్రతిబింబించే రంగుల కాంతికి పావురాలు రాకుండా ఉంటాయి. అల్యూమినియం ఫాయిల్ లేదా ఏదైనా మెరిసే వస్తువును వేలాడదీసినా ఫలితం ఉంటుంది.
- పాత బ్యాగ్‌లు లేదా దుస్తులకు ఉండే జిప్‌లను తీసి బాల్కనీ, కిటికీల అరుగులపై అంటిస్తే వాటి గరుకుదనానికి పావురాలు వాలవు.
- ఇప్పటికే గూడు పెట్టివుంటే దాన్ని జాగ్రత్తగా మరో ప్రాంతానికి తరలిస్తే పావురాలు వెళ్లిపోతాయి.

వీటిని కలుపుకొని తాగితే...

ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు తాగడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. వంటింట్లో ఉండే కొన్ని దినుసులను కలుపుకుని తాగితే మరిన్ని ప్రయోజనాలు సమకూరుతాయని సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలుపుకొని తాగితే జీర్ణ సమస్యలు రావు. కీళ్ల నొప్పులు, వాపులు కూడా తొందరగా తగ్గుతాయి.
- గ్లాసు పాలలో ఒక చెంచా తేనె కలిపి తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు జీవక్రియలను వేగవంతం చేస్తాయి.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు యాలకుల పొడి కలుపుకుని తాగితే పేగుల్లో అనారోగ్య సమస్యలు రావు. మలబద్ధకం తీరుతుంది.
- చిన్న అల్లం ముక్కను తీసుకుని కచ్చాపచ్చాగా దంచి గ్లాసు పాలలో వేసి మరిగించాలి. ఈ పాలను రాత్రి పడుకునే ముందు తాగితే జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ సమస్యలు, కీళ్లవాతం లాంటి సమస్యలు దరిచేరవు.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి. పాలు బంగారు వర్ణంలోకి మారినతరవాత తాగితే మానసిక ప్రశాంతత లభిస్తుంది. చర్మం మెరుపును సంతరించుకుంటుంది.



- గ్లాసు పాలలో పావు చెంచా మిరియాల పొడి వేసుకుని తాగితే గొంతు మంట, దగ్గు తగ్గుతాయి.
- ఒక అంగుళం పొడవున్న దాల్చిన చెక్క ముక్కను కచ్చాపచ్చాగా దంచి ఒక గ్లాసు పాలలో వేసి రెండు నిమిషాలు మరిగించి తాగితే అధిక బరువు తగ్గుతుంది. శరీరంలో పేరుకున్న కొవ్వు కరిగిపోతుంది.

ఆరంభం అదరాలని!

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..



- టీమిండియా కూర్పుపై ఉత్కంఠ
- షమి, రోహిత్, కోహ్లీపై దృష్టి
- బంగ్లాతో భారత్ పోరు నేడు

దుబాయ్: పేస్ గన్ బుమ్రా గైర్హాజరీలో టీమిండియా బౌలింగ్ పరిస్థితేంటి? స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, కోహ్లీ మళ్లీ మునుపటి మెరుపులు మెరిపిస్తారా? గిల్ మెగా టోర్నీ ఒత్తిడిని అధిగవిస్తాడా? ఇలా అభిమానుల మదిలోని ఎన్నో సందేహాలను భారత జట్టు ఒక్క మ్యాచ్‌తో పటాపంచలు చేయాలనుకొంటోంది. చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) గ్రూప్-ఎలో గురువారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో రోహిత్ సేన బలంగా కనిపిస్తున్నా.. బంగ్లాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. భారత జట్టు కూర్పుపై ఇప్పటికీ సందేహాలున్నాయి. అయితే, ఇంగ్లండ్‌పై టీ20, వన్డే సిరీస్‌లు నెగ్గి జోష్‌లో ఉన్న టీమిండియా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. రోహిత్ చాలాకాలం తర్వాత సెంచరీతో కదం తొక్కగా.. కోహ్లీ కూడా ఫిఫ్టీతో టచ్‌లోకి రావడం శుభపరిణామం. కానీ, రాహుల్ బ్యాటింగ్ స్థానం ఇప్పటికీ సస్పెన్సే. సాధారణంగా రాహుల్ ఐదో నెంబర్‌లో బరిలోకి దిగుతాడు. అయితే, మ్యాచ్ పరిస్థితినిబట్టి అతడి బ్యాటింగ్ ఆర్డర్‌పై నిర్ణయం తీసుకోవాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం.

అర్ష్‌దీప్ లేదా హర్షిత్?

గాయంతో బుమ్రా దూరం కావడంతో.. బౌలింగ్ విభాగం కూర్పు పెద్ద సవాల్‌గా మారింది. షమి పేస్ దళాన్ని నడిపించనుండగా.. అర్ష్‌దీప్ సింగ్ లేదా హర్షిత్ రాణాల్లో తుది జట్టులో ఎవరుంటారో ఖరారుకాలేదు. అయితే, డెత్ ఓవర్లలో సత్తాచాటగల అర్ష్‌దీప్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. హార్దిక్ పాండ్యాతో పాటు ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలన్న వ్యూహంపై కూడా మేనేజ్‌మెంట్ కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో జడేజా, అక్షర్ పటేల్‌తో పాటు మూడో స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌ను తీసుకొనే అవకాశం ఉంది. మరోవైపు షకీబల్, తమీమ్ లాంటి మేటి ఆటగాళ్లు లేకుండా బరిలోకి దిగుతున్న బంగ్లా ఒకింత బలహీనంగా కనిపిస్తోంది. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షంటో ఫామ్ కోల్పోవడం ఆందోళన కలిగిస్తున్నా.. మిడిలార్డర్‌లో మహ్మదుల్లా, ముష్ఫికర్ ఆదుకొంటున్నారు. అయితే, స్పిన్‌తో ప్రత్యర్థిని దెబ్బతీయాలని బంగ్లా భావిస్తోంది. పేసర్లు నహీద్ రాణా, టస్కిన్ భారత బ్యాటర్లను కట్టడిచేస్తే.. గెలుపు అవకాశాలు మెరుగుపడతాయి.



బంగ్లా కెప్టెన్ షంటో

ఉన్నది ఇద్దరు స్పిన్నర్లే: రోహిత్

ఇద్దరు స్పెషలిస్ట్ స్పిన్నర్లను మాత్రమే జట్టులోకి తీసుకొన్నాం. మిగతా ముగ్గురూ ఆల్‌రౌండర్లు. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్ చేసే వాళ్లైతే ఎక్కువ ప్రయోజనం అని భావించాం. అన్ని ఐసీసీ టోర్నీల్లాగానే సీటీ కూడా ఎంతో ప్రత్యేకమైనది. ఈ ట్రోఫీ నెగ్గాలంటే ఎక్కడా పొరబాట్లకు తావివ్వకూడదు.

- *ఇరు జట్ల మధ్య జరిగిన చివరి ఐదు వన్డేల్లో భారత్ 2 నెగ్గగా.. బంగ్లా 3 మ్యాచ్‌లు గెలిచింది. ఓవరాల్‌గా భారత్, బంగ్లా 41సార్లు తలపడితే.. టీమిండియా 32.. బంగ్లా 8 మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.*

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, గిల్, కోహ్లీ, శ్రేయాస్, రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్, అక్షర్, జడేజా, అర్ష్‌దీప్/హర్షిత్, షమి, కుల్దీప్.

బంగ్లాదేశ్: తన్జిద్ హసన్, సౌమ్య సర్కార్, నజ్ముల్ హొస్సేన్ షంటో (కెప్టెన్), తౌహిద్ హ్రిదయ్, ముష్ఫికర్ రహీమ్ (వికెట్ కీపర్), మహ్మదుల్లా, మెహిదీహసన్, రిషద్ హొస్సేన్, టస్కిన్, ముస్తాఫిజుర్, నహీద్ రాణా.

పిచ్/వాతావరణం

దుబాయ్‌లో గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వికెట్ బౌలర్లకు సహకరించే అవకాశం ఉంది. మ్యాచ్ కోసం తాజాగా సిద్ధం చేసిన వికెట్‌లను ఉపయోగిస్తారని సమాచారం. ఆకాశం మేఘావృతమై ఉన్నా.. వర్ష ఛాయలు తక్కువని వాతావరణ శాఖ తెలిపింది. మంచు ప్రభావం కారణంగా టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది.

గిల్ @1



దుబాయ్: ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదరగొట్టిన టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బుధవారం ప్రకటించిన వన్డే తాజా ర్యాంకింగ్స్ బ్యాటింగ్ జాబితాలో గిల్.. బాబర్ ఆజమ్‌ను దాటేసి నెంబర్‌వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. రోహిత్ శర్మ (761) మూడో స్థానంలో, క్లాసెన్, డారిల్ మిచెల్ వరుసగా 4, 5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలర్లలో మహేష్ తీక్షణ (శ్రీలంక), రషీద్ ఖాన్ (ఆఫ్ఘనిస్థాన్) తొలి రెండుస్థానాల్లో, కుల్దీప్ యాదవ్ నాలుగో స్థానంలో ఉన్నారు.

లిఫ్టింగ్ రాడ్డే కబళించింది!



బికనేర్ (రాజస్థాన్): ఓ పవర్ లిఫ్టర్‌ను రోజూ ఆమె సాధన చేసే లిఫ్టింగ్ రాడ్డే కబళించింది. ఈ విషాద ఘటన రాజస్థాన్‌లోని బికనేర్‌లో జరిగింది. 17 ఏళ్ల పవర్ లిఫ్టర్ యాష్తికా ఆచార్య జూనియర్ జాతీయ క్రీడల్లో చాంపియన్. రోజులాగే..కోచ్ ఆధ్వర్యంలో ఆమె జిమ్‌లో మంగళవారం సాధన చేస్తోంది. 270 కేజీల బరువెత్తుతుండగా..రాడ్డు ఒక్కసారిగా స్లిప్పవడంతో యాష్తిక పడిపోయింది. ఈక్రమంలో రాడ్డు యాష్తిక మెడపై పడిపోయింది. అంత భారీ బరువుకు ఆమె మెడ విరిగిపోయింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని ధ్రువీకరించారు.

పారా అథ్లెటిక్స్‌లో లలితకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): చెన్నైలో బుధవారం జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రెండోరోజు పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఆరు పతకాలు కైవసం చేసుకున్నారు. ఇందులో 3 స్వర్ణాలు, 2 రజతాలు, ఓ కాంస్యం ఉన్నాయి. మహిళల టి-11 విభాగం 400 మీటర్ల పరుగులో లలిత పసిడితో మెరవగా, రవణి రజతం నెగ్గింది. టి-11 కేటగిరి లాంగ్‌జంప్‌లో స్వరాజ్, ఎఫ్-41 షాట్‌పుట్‌లో రవి స్వర్ణాలు గెలిచారు. ఎఫ్-12 400 మీ. రేసులో నవీన్‌కు రజతం, ఎఫ్-40 షాట్‌పుట్‌లో గౌతమ్‌కు కాంస్యం దక్కాయి.

దిగొచ్చిన పాక్.. స్టేడియంలో భారత జెండా



కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా స్టేడియంలో భారత జెండా ఎగరేయకపోవడంపై విమర్శలు రావడంతో పాకిస్థాన్ దిగొచ్చింది. తాజాగా కరాచీ స్టేడియంలో భారత పతాకాన్ని ప్రదర్శించింది. టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాక్.. రెండ్రోజుల క్రితం స్టేడియంలో భారత జెండా మినహా అన్ని దేశాల జట్ల జెండాలను ఏర్పాటుచేసింది. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవడంతో.. రోహిత్ సేన తమ దేశంలో మ్యాచ్‌లు ఆడడం లేదు కాబట్టే ఆ దేశ జాతీయ పతకాన్ని ప్రదర్శించలేదని పాక్ క్రికెట్ బోర్డు వివరణ ఇచ్చుకున్న సంగతి తెలిసిందే.

పాక్ చిత్తుగా..

శతక్కొట్టిన లాథమ్, యంగ్
న్యూజిలాండ్ బోణీ ఘనం
చాంపియన్స్ ట్రోఫీ



లాథమ్ (118 నాటౌట్) యంగ్ (107)

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీని న్యూజిలాండ్ ఘనంగా ఆరంభించింది. బుధవారం జరిగినప్రారంభ మ్యాచ్‌లో కివీస్ 60 పరుగులతో డిఫెండింగ్ చాంప్ పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. గ్రూప్-ఎ మ్యాచ్‌లో తొలుత న్యూజిలాండ్ 50 ఓవర్లలో 320/5 స్కోరు చేసింది. లాథమ్ (118 నాటౌట్), యంగ్ (107) సెంచరీలతో చెలరేగగా.. ఫిలిప్స్ (61) మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. నసీమ్ షా, హారిస్ రౌఫ్ చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో పాకిస్థాన్ 47.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. ఖుష్‌దిల్ షా (69), బాబర్ ఆజమ్ (64) అర్ధ శతకాలు సాధించారు. సల్మాన్ ఆఘా (42) పర్లేదనిపించాడు. ఒరౌర్కీ, శాంట్నర్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. లాథమ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

రెండు సెంచరీ భాగస్వామ్యాలు: టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ ఓ దశలో 40/2, ఆపై 17 ఓవర్లో 73/3తో నిలిచింది. కానీ యంగ్, లాథమ్ శతకాలతోపాటు, ఫిలిప్స్ దూకుడైన ఇన్నింగ్స్‌తో 300కు పైగా స్కోరు చేసింది. ఎనిమిదో ఓవర్లోనే అబ్రార్ అహ్మద్ క్యారమ్ బాల్‌తో కాన్వే (10)ను బౌల్డ్ చేశాడు. విలియమ్సన్ (1)ను నసీమ్ షా క్యాచవుట్ చేశాడు. మిచెల్ (10)ను రౌఫ్ అవుట్ చేయడంతో మూడో వికెట్ కోల్పోయిన కివీస్ ఇబ్బందుల్లో పడింది. అయితే..యంగ్, లాథమ్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 118 రన్స్ జోడించాడు. శతకం సాధించిన కాసేపటికే యంగ్‌ను నసీమ్ పెవిలియన్ చేర్చాడు. అనంతరం లాథమ్, ఫిలిప్స్ బౌలర్లను ఆడేసుకున్నారు. ఐదో వికెట్‌కు లాథమ్, ఫిలిప్స్ 74 బంతుల్లోనే 125 రన్స్ జోడించడం విశేషం. ఫిలిప్స్ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో నిష్క్రమించాడు. అంతకుముందు చాంపియన్స్ ట్రోఫీ టోర్నీని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ జర్దారీ ప్రారంభించారు.

సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్: 50 ఓవర్లలో 320/5 (లాథమ్ 118 నాటౌట్, యంగ్ 107, ఫిలిప్స్ 61, నసీమ్ షా 2/63, రౌఫ్ 2/83); **పాకిస్థాన్:** 47.2 ఓవర్లలో 260 ఆలౌట్ (ఖుష్‌దిల్ షా 69, బాబర్ 64, సల్మాన్ ఆఘా 42, ఒరౌర్కీ 3/47, శాంట్నర్ 3/66, హెన్రీ 2/25).

చికిత బృందానికి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-1లో తెలంగాణ అమ్మాయి చికిత రావు నేతృత్వంలోని భారత జట్టు కాంస్యం సాధించింది. బుధవారం బ్యాంకాక్‌లో జరిగిన మహిళల కాంపౌండ్ విభాగం కాంస్య పతక పోరులో ఇరాక్‌పై గెలిచి భారత జట్టు పతకం సొంతం చేసుకుంది.

ఢిల్లీ ఉత్కంఠ గెలుపు

యూపీకి నిరాశ ● డబ్ల్యూపీఎల్

వడోదర: తీవ్ర ఒత్తిడిలో అనబెల్ సదర్లాండ్ (41 నాటౌట్), మరిజానె కాప్ (29 నాటౌట్) నాలుగో వికెట్‌కు అజేయంగా 48 పరుగులు జోడించడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్లతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో 166/7 స్కోరు చేసింది. కిరణ్ నవగిరె (51), శ్వేత సెహ్రావత్ (37), హెన్రీ (33 నాటౌట్) పోరాటాలు వృథా అయ్యాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ సదర్లాండ్ 2 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ఢిల్లీ 19.5 ఓవర్లలో 3 వికెట్లకు 167 పరుగులు చేసి నెగ్గింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (69), షఫాలీ (26) మొదటి వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. ఆ తర్వాత షఫాలీ, జెమీమా(0) వెనుదిరిగినా.. లానింగ్‌తో కలసి సదర్లాండ్ మూడో వికెట్‌కు 49 భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపింది. లానింగ్‌ను హ్యారిస్ అవుట్ చేయడంతో.. యూపీ మ్యాచ్‌లోకి వచ్చే ప్రయత్నం చేసింది. 32 బంతుల్లో 48 రన్స్ కావాల్సిన దశలో.. కాప్ సహకారంతో సదర్లాండ్ జట్టును గెలిపించింది. కాగా, డబ్ల్యూపీఎల్‌కు గురువారం విరామం.



లానింగ్ (69)

సంక్షిప్త స్కోర్లు

యూపీ: 20 ఓవర్లలో 166/7 (నవగిరె 51, శ్వేత 37; సదర్లాండ్ 2/26).

ఢిల్లీ: 19.5 ఓవర్లలో 167/3 (మెగ్‌లానింగ్ 69, సదర్లాండ్ 41 నాటౌట్; ఎకెల్‌స్టోన్ 1/31, గ్రేస్ హ్యారిస్ 1/11).

రిజ్వాన్ సేనకు పెనాల్టీ

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ నిబంధనల ప్రకారం 50 ఓవర్లను మూడున్నర గంటల్లోగా పూర్తి చేయాలి. కానీ న్యూజిలాండ్‌తో పోరులో పాకిస్థాన్ 4 గంటలకు పైగా తీసుకుంది. దాంతో చివరి పవర్‌ప్లేలో పెనాల్టీగా.. 30 గజాల సర్కిల్ వెలుపల ఐదుగురికి బదులు నలుగురు ఫీల్డర్లనే పాకిస్థాన్ మోహరించాల్సి వచ్చింది. ఈ పెనాల్టీకి తోడు..స్లో ఓవర్ రేట్ కారణంగా రిజ్వాన్ సేన జట్టులోని ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులో ఐదు శాతం కోత విధించే అవకాశముంది.

భారత ఫార్మాకు ట్రంప్ సుంకాల ముప్పు





అమెరికాలోకి దిగుమతయ్యే ఔషధాలపై కనీసం 25% టారిఫ్

» మన జనరిక్ ఔషధ సంస్థలకు అమెరికానే అతిపెద్ద మార్కెట్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. యూఎస్‌లోకి దిగుమతయ్యే ఔషధాలు, సెమీకండక్టర్లపై 25 శాతం లేదా అంతకంటే అధిక సుంకం విధిస్తానని, ఆపై సుంకాన్ని మరింత పెంచుకుంటూ పోతానని హెచ్చరించారు. అదే గనక జరిగితే, భారత ఫార్మాస్యూటికల్స్ రంగం, ప్రధానంగా హైదరాబాద్‌కు చెందిన ఔషధ కంపెనీలపై అధిక ప్రభావం పడనుంది. దేశీయ ఫార్మా సంస్థల జనరిక్ ఔషధాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్ కావడమే అందుకు కారణం. ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక కౌన్సిల్ (ఫార్మెక్సిల్) లెక్కల ప్రకారం..2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత ఫార్మా కంపెనీలు అమెరికాకు 870 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం విలువ ప్రకారం రూ.75,690 కోట్లు) ఔషధాలను ఎగుమతి చేశాయి. ఫార్మా ఎగుమతుల్లో అమెరికా వాటాయే 31 శాతంగా ఉంది.

అమెరికా వినియోగదారులకే నష్టం: ఫార్మెక్సిల్

అమెరికా చర్య ఆ దేశ వినియోగదారులకే నష్టమని ఫార్మెక్సిల్ అభిప్రాయపడింది. "అమెరికా టారిఫ్‌లతో తక్షణ ప్రభావమేమీ ఉండదు. ఒకవేళ సుంకం విధిస్తే, దిగుమతుల భారం పెరగడం వల్ల అమెరికా వినియోగదారులకే నష్టం. ప్రస్తుతం ఇండస్ట్రీ ఈ విషయంలో వేచి చూసే ధోరణిలో ఉంది. సాధారణంగా మన కంపెనీలు అత్యంత ఖరీదైన పేటెంట్ డ్రగ్స్‌కు జనరిక్ వెర్షన్లను యూఎస్‌కు సరఫరా చేస్తుంటాయి" అని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజ భాను అన్నారు. ప్రముఖ రీసెర్చ్ కంపెనీ ఐక్యూవీఐఏ ప్రకారం.. 2022లో అమెరికాలో డాక్టర్లు పేషెంట్లకు రాసిచ్చిన జనరిక్ ఔషధాల్లో దాదాపు సగం భారత కంపెనీలు సరఫరా చేసినవే. తద్వారా యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఆ ఏడాదిలో 21,900 కోట్ల డాలర్లు (రూ.19.05 లక్షల కోట్లు) ఆదా చేయగలిగిందని భాను అన్నారు. 2013-22 మధ్యకాలంలో ఏకంగా 1.3 లక్షల కోట్ల డాలర్లు (రూ.113 లక్షల కోట్లు) ఆదా జరిగిందన్నారు. వచ్చే ఐదేళ్లలో అమెరికా మరో 1.3 లక్షల కోట్ల డాలర్లు ఆదా చేసుకోగలిగే అవకాశం ఉందన్నారు.

ప్రస్తుత సుంకం సున్నా

అమెరికా ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి చేసుకునే ఔషధాలపై ఎలాంటి సుంకం విధించడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2,900 కోట్ల డాలర్ల విలువైన ఔషధాలను అమెరికా సహా ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజ భాను తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో గడిచిన 10 నెలల్లో (ఏప్రిల్-జనవరి) ఫార్మా ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 7.84 శాతం వృద్ధితో 2,430 కోట్ల డాలర్లకు చేరుకున్నాయన్నారు.

అమెరికా ఎగుమతి చేస్తున్న ఔషధ కంపెనీలు..

సన్ ఫార్మా: దేశంలో అతిపెద్ద ఔషధ కంపెనీ సన్ ఫార్మాస్యూటికల్‌కు 2023-24 ఆర్థిక సంవత్సర ఆదాయంలో 32 శాతం అమెరికా మార్కెట్ నుంచే సమకూరింది. మన ఔషధాలపై ట్రంప్ అదనపు సుంకాలు విధిస్తే, ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేయకతప్పదని కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ అన్నారు. సన్ ఫార్మా 100 దేశాలకు ఔషధాలను ఎగమతి చేస్తోంది. కంపెనీ వార్షికాదాయంలో ఎగుమతుల వాటాయే 72.7 శాతంగా ఉంది.

ఒత్తిడిలో ఫార్మా షేర్లు

ట్రంప్ సుంకాల హెచ్చరికతో భారత ఫార్మా రంగ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. డాక్టర్ రెడ్డీస్ స్టాక్ 2.63 శాతం క్షీణించగా.. జైడస్ లైఫ్ సైన్సెస్ 2.47 శాతం, అరబిందో ఫార్మా 2.41 శాతం, లుపిన్ 1.75 శాతం, సన్ ఫార్మా 1.46 శాతం, సిప్లా 1.21 శాతం, గ్లెన్‌మార్క్ 0.71 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 0.71 శాతం తగ్గింది.

డాక్టర్ రెడ్డీస్: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్‌కు ఉత్తర అమెరికానే అతిపెద్ద మార్కెట్. 2023-24 ఆర్థిక సంవత్సర అమ్మకాల్లో ఈ మార్కెట్ వాటాయే 47 శాతంగా ఉంది. కంపెనీ ఈ మార్కెట్‌కు అధికంగా ఆంకాలజీ, ఇమ్యూనాలజీ థెరపీలకు సంబంధించిన జనరిక్ ఔషధాలను సరఫరా చేస్తుంది. 2022-23తో పోలిస్తే వీటి విక్రయాలు 28 శాతం పెరిగాయి.

అరబిందో ఫార్మా: హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మాకు గత ఆర్థిక సంవత్సరంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 24 శాతం వృద్ధితో రూ.13,867 కోట్లకు పెరిగింది. కంపెనీ మొత్తం రెవెన్యూలో ఈ మార్కెట్ వాటాయే 48 శాతంగా ఉంది. అంతేకాదు, కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్ కూడా.

నాట్కో ఫార్మా: గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయంలో 78 శాతం అంతర్జాతీయ వ్యాపారం ద్వారానే సమకూరింది. సంస్థకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్లలో అమెరికా ఒకటి. ఈ దేశానికి కంపెనీ కేన్సర్ సహా పలు జనరిక్ ఔషధాలను ఎగమతి చేస్తోంది.

దివీస్ లేబరేటరీస్: గత ఆర్థిక సంవత్సరానికి అమెరికా మార్కెట్లో దివీస్ అమ్మకాలు రూ.1,310 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ మొత్తం ఆదాయంలో ఈ వాటా 17.1 శాతంగా ఉంది. సంస్థకు యూరప్ తర్వాత అతిపెద్ద మార్కెట్ అమెరికాయే.

సిప్లా: గత ఆర్థిక సంవత్సరంలో సిప్లా ఆదాయంలో 30 శాతం ఉత్తర అమెరికా మార్కెట్ నుంచే సమకూరింది. కంపెనీకిది రెండో అతిపెద్ద మార్కెట్ కూడా. అమ్మకాలపరంగా అమెరికాలోని టాప్-15 ఔషధ కంపెనీల్లో సిప్లా ఒకటి.

బయోకాన్: 2023-24 ఆర్థిక సంవత్సరానికి బయోకాన్ ఆదాయంలో 44 శాతం అమెరికా మార్కెట్ నుంచే లభించింది. కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్. ఈ కంపెనీ యూఎస్‌కు అధికంగా కీళ్లవాతం, కేన్సర్ చికిత్సలో ఉపయోగించే సంక్లిష్ట బయోలాజిక్స్‌కు కాపీ అయిన బయోసిమిలర్స్‌ను ఎగుమతి చేస్తుంటుంది. ఐక్యూవీఐఏ ప్రకారం.. 2022లో అమెరికాలో అమ్ముడైన బయోసిమిలర్స్‌లో 15 శాతం భారత కంపెనీలు సరఫరా చేసినవే.

లుపిన్: 2022-23 ఆర్థిక సంవత్సరానికి లుపిన్ మొత్తం విక్రయాల్లో ఉత్తర అమెరికా మార్కెట్ వాటా 30 శాతంగా ఉండగా.. 2023-24లో 37 శాతానికి పెరిగింది. కంపెనీకి చెందిన యాంటీ రెట్రోవైరల్ తోపాటు శ్వాసకోస సమస్యలకు సంబంధించిన జనరిక్ ఔషధాలకు పెరిగిన డిమాండ్ పెరగడం ఇందుకు తోడ్పడింది.

గ్లెన్‌మార్క్ ఫార్మా: కంపెనీకి ఉత్తర అమెరికా రెండో అతిపెద్ద మార్కెట్. 2023-24లో సంస్థ ఆదాయంలో 26 శాతం ఈ మార్కెట్ నుంచే లభించింది.

జైడస్: అమెరికాకు జైడస్ 200కు పైగా జనరిక్ ఔషధాలను ఎగుమతి చేస్తోంది. కంపెనీకిదే అతిపెద్ద మార్కెట్ కూడా. గత ఆర్థిక సంవత్సర ఆదాయంలో 46 శాతం ఈ మార్కెట్ నుంచే సమకూరింది.

అదానీలపై దర్యాప్తులో సాయం చేయండి

భారత్‌కు ఎస్ఈసీ అభ్యర్థన

న్యూయార్క్: అదానీ గ్రూప్ ప్రధాన ప్రమోటర్లు గౌతం అదానీ, సాగర్ అదానీలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తులో భారత ప్రభుత్వ అధికారుల సహాయం అభ్యర్థించామని అమెరికన్ స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి నికోలస్ గరౌఫిస్‌కు తెలిపింది. భారత్‌లో ఉంటున్న వీరిద్దరికి ఆరోపణల అభియోగ పత్రాన్ని అందజేసేందుకు చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. దీంతో ఈ కేసులో అదానీలపై దర్యాప్తును తాత్కాలికంగా నిలిపి వేస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం అమలవుతుందా, లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం అదానీ గ్రూప్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలకు 26.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,292 కోట్లు) ముడుపులు ముట్టచెప్పిందని గత ఏడాది బైడెన్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం ఆరోపించి, దర్యాప్తునకు ఆదేశించింది. ఈ విషయాన్ని కప్పిపెట్టి 2021లో అదానీ గ్రూప్ అమెరికా మార్కెట్‌లో రుణ పత్రాలు జారీ చేసి నిధులు సేకరించిందని ఆరోపణ.

షేర్లు ఢమాల్: ఈ వార్తలతో అదానీ గ్రూపు కంపెనీల షేర్లు మళ్లీ బేర్ పట్టులోకి పోయాయి. 11 లిస్టెడ్ కంపెనీల్లో తొమ్మిది కంపెనీల షేర్లు బుధవారం నాలుగు శాతం వరకు నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 3.75 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.78 శాతం, అంబుజా సిమెంట్స్, సంఘీ ఇండస్ట్రీస్ 1.36 శాతం చొప్పున, ఏసీసీ 0.93 శాతం, అదానీ విల్‌మార్ 0.9 శాతం నష్టపోయాయి.



హోండా హార్నెట్ 2.0

న్యూఢిల్లీ: హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) సరికొత్త హార్నెట్ 2.0 బైక్‌ను మార్కెట్లోకి తెచ్చింది. మెరుగైన భద్రతా ఫీచర్లతో మరింత స్టైల్‌గా ఉండే ఈ బైక్ ఎక్స్ షోరూమ్ ధర రూ.1,56,953. దేశవ్యాప్తంగా హెచ్ఎంఎస్ఐ రెడ్ వింగ్, బిగ్ వింగ్ డీలర్‌షిప్‌లన్నింటి వద్ద ఇది అందుబాటులో ఉంటుంది.

రూ.500 చొప్పున నవ షేర్ల బైబ్యాక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక నవ లిమిటెడ్ కంపెనీ షేర్ల బైబ్యాక్ ప్రకటించింది. రూపాయి ముఖ విలువ ఉన్న 72 లక్షల షేర్లను ఒక్కోటి రూ.500 చొప్పున బైబ్యాక్ చేసేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బుధవారం నాటి ముగింపు ధరతో పోలిస్తే ఇది 32 శాతం ఎక్కువ. ఈ నెల 28వ తేదీ నాటికి కంపెనీ రికార్డుల్లో పేర్లున్న వాటాదారులందరికీ ఈ ఆఫర్ వర్తిస్తుంది. కంపెనీ ప్రమోటర్లుగానీ, వారి నిర్వహణలోని కంపెనీలు గానీ ఈ బైబ్యాక్‌లో పాల్గొనవు. ఈ వార్తలతో బీఎస్ఈలో నవ కంపెనీ షేర్లు 11.61 శాతం లాభంతో రూ.422.45 వద్ద ముగిశాయి.

బిజినెస్

డిపాజిట్ ఇన్సూరెన్స్ రూ.8-12 లక్షలకు పెంపు!?

న్యూఢిల్లీ: బ్యాంక్ డిపాజిట్‌దారులకు మరింత రక్షణ లభించనుంది. బ్యాంక్‌ల్లో జమ చేసే సొమ్ముపై ప్రస్తుతం రూ.5 లక్షల వరకు బీమా కవరేజీ లభిస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం ఈ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పెంచే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరులోగా అధికారిక ప్రకటన వెలువడవచ్చని విశ్వసనీయవరాల సమాచారం. బ్యాంక్‌ల్లో, ముఖ్యంగా కో-ఆపరేటివ్ బ్యాంక్‌ల్లో అంతర్గత మోసాలు వెలుగు చూస్తుండటం.. తత్ఫలితంగా ఆ బ్యాంక్‌లు ఆర్థికంగా దివాలా తీస్తున్న కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్‌కు బుధవారం నాడు కూడా ఫ్లాట్‌గానే ముగిసింది. సెన్సెక్స్ 28.21 పాయింట్ల నష్టంతో 75,939.18 వద్ద, నిఫ్టీ 12.40 పాయిట్ల నష్టంతో 22,932.90 వద్ద ముగిశాయి. ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ కంపెనీల షేర్లు రెండు శాతానికిపైగా నష్ట పోవడం సూచీలను దెబ్బతీసింది. హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, ఎం అండ్ ఎం, టెక్ మహీంద్ర వంటి కంపెనీల షేర్లకూ బుధవారం నష్టాలు తప్పలేదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	430
వరంగల్	417	గోదావరి	420
చిత్తూరు	493	విశాఖపట్నం	437
		దజను గుడ్లు రూ. 60	


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	80
కరీంనగర్	80	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	85
కర్నూలు	80	నెల్లూరు	90
విశాఖపట్నం	83	అనంతపురం	90
గోదావరి	91		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,650 ▲	80,350 ▲	1,08,000 ▲
విజయవాడ	89,000 ▲	83,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	86,410 ▲	79,210 ▲	97,570 ▲
రాజమండ్రి	87,650 ▲	80,350 ▲	99,800 ▲
ప్రొద్దుటూరు	88,750 ▲	82,180 ▲	98,500 ▲
ముంబై	86,730 ▲	79,450 ▲	97,570 ▲

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● గురువారం 20 ఫిబ్రవరి 2025



వెండితెర చెప్పిన బంగారు దర్శకుడి కథ

తెలుగు సినిమాకు గౌరవం, గుర్తింపు తెచ్చిన దర్శకుల్లో ముందు వరుసలో ఉంటారు కళాతపస్వి కె.విశ్వనాథ్. సినిమా అంటే కేవలం కమర్షియల్ హంగులు, డ్యాన్సులు, ఫైట్లు కావనీ, సంస్కృతి, కళలు, సంప్రదాయ విలువలు అని తన చిత్రాల ద్వారా చాటి చెప్పిన గొప్ప దర్శకుడాయన. మొత్తం 51 చిత్రాలకు దర్శకత్వం వహించిన ఈ కళాతపస్వి ఇప్పుడు మనమధ్య లేకపోయినా ఆయన చిత్రాలు ఏదో ఒక రూపంలో అలరిస్తూనే ఉన్నాయి. తెలుగు జాతి గర్వించదగ్గ ఇటువంటి దర్శకుడి జీవిత కథను డాక్యుమెంటరీ రూపంలో తీసుకువస్తోంది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ. రచయిత, దర్శకుడు జనార్ధనమహర్షి రూపొందించిన ఈ డాక్యుమెంటరీకి విశ్వదర్శనం అనే పేరు పెట్టారు. విశ్వనాథ్ జయంతి సందర్భంగా దీనికి సంబంధించిన ప్రోమోను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖులు విశ్వనాథ్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ డాక్యుమెంటరీలో వివరించనున్నారు. వెండితెర చెప్పిన బంగారు దర్శకుడి కథ ఇదనీ, త్వరలోనే ఓటీటీలో విడుదల చేస్తున్నామనీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వెల్లడించింది.



జై భవానీ



'కాంతార' చిత్రంతో హీరోగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు రిషబ్ శెట్టి. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్'. మరాఠా యోధుడు శివాజీ జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో రిషబ్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. సందీప్ సింగ్ దర్శకుడు. బుధవారం శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా చిత్రబృందం ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. ఖడ్గం చేతబూనిన శివాజీ భవానీ మాత విగ్రహం ముందు నిలబడి కనిపించారు. ఈ ఏడాది మేలో జరగనున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయనున్నట్లు సందీప్ సింగ్ తెలిపారు. 2027 జనవరి 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మహా కుంభమేళాలో టీజర్...

వశిష్ఠ ఎస్.సింహా, తమన్నా భాటియా, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వే స్టేషన్'కు ఇది కొనసాగింపు. దర్శకుడు సంపత్ నంది కథ అందించగా, అశోక్ తేజ తెరకెక్కిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్‌పై డి.మధు నిర్మిస్తున్నారు. సినిమా టీజర్‌ను ఈ నెల 22న ప్రయాగరాజ్‌లోని మహా కుంభమేళాలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌లో తమన్నా నాగసాధువు పాత్రలో నటిస్తుండడం విశేషం.



ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు

రీతూ వర్మ

'పెళ్లి చూపులు', 'స్వాగ్' చిత్రాల నటి రీతూ వర్మ తాజా చిత్రం 'మజాకా'. సందీప్ కిషన్ కథానాయకుడిగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కేఆర్ బన్సాల్ నిర్మించారు. ఈ నెల 26న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రవిశేషాలను మీడియాతో పంచుకున్నారు రీతూ వర్మ. "ఈ సినిమా కథ వినగానే బాగా నచ్చేసింది. వెంటనే ఓ.కే చేశా. ఇందులో మంచి వినోదంతో పాటు హృదయాన్ని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయి. సినిమాలో కాలేజీ అమ్మాయిగా కనిపిస్తా. నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఇంతవరకూ ఇటువంటి రోల్‌ని నేను చేయలేదు. సినిమాలోని ప్రతి పాత్రా చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు త్రినాథరావు చాలా కూల్‌గా ఉంటారు. తను చేసే ప్రతీ సినిమాతో ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందివ్వాలని తపిస్తుంటారు. 'మజాకా' కథనాన్ని చాలా ఆసక్తికరంగా నడిపించారు. సినిమా ఆద్యంతం నవ్విస్తుంది. సందీప్, అన్షు, రావు రమేశ్‌లతో పనిచేయడం మర్చిపోలేని అనుభవం. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా ఆకట్టుకుంటుందీ చిత్రం. తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

భయపెట్టే 'శబ్దం'



ఆది పినిశెట్టి నటించిన 'వైశాలి' చిత్రం ఓ విభిన్న ప్రయత్నంగా ప్రశంసలు అందుకొంది. దర్శకుడు అరివళగన్ రూపొందించిన ఆ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'శబ్దం' చిత్రం రానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. 'వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు ఉంటోంది డాక్టర్' అనే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఆది పినిశెట్టి అతీంద్రియ శక్తుల అన్వేషకుడిగా కనిపించారు. 'శబ్దం' చిత్రాన్ని ఈ నెల 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, తెలంగాణలో మైత్రి సంస్థలు విడుదల చేస్తున్నాయి. సహ నిర్మాత: భానుప్రియ శివ, నిర్మాత: సెవెన్ జీ శివ.



ప్రేక్షకులే హౌస్‌ఫుల్ చేస్తారు

బ్రహ్మాజీ, అవసరాల శ్రీనివాస్, బలగం సుధాకర్, ఆమని కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాపు'. 'ఏ ఫాదర్స్ స్టోరీ' అనేది ఉప శీర్షిక. దయా దర్శకత్వంలో రాజు, సి.హెచ్.భానుప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ "ఈ సినిమాకు పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. సినిమా బాగుంటే మన తెలుగు ప్రేక్షకులు రెండో రోజు నుంచి హౌస్‌ఫుల్ చేస్తారు" అని అన్నారు. "ఈ సినిమాకు దర్శకుడు దయానే హీరో" అని బుచ్చిబాబు సాన చెప్పారు. "సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అన్నారు. "ఇందులో ఓ గుర్తుండిపోయే పాత్ర చేశాను" అని నటుడు బ్రహ్మాజీ తెలిపారు. "బ్రహ్మాజీ నటించడం వల్లే ఈ సినిమాకు ఇంత బజ్ వచ్చింది. సినిమాను ఆదరించండి" అని చిత్ర దర్శకుడు దయ కోరారు. "ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అని చిత్రనిర్మాత భానుప్రసాద్ రెడ్డి చెప్పారు.



డబ్బింగ్ పనుల్లో...

బాలీవుడ్ కథానాయకుడు సన్నీ డియోల్‌తో దర్శకుడు గోపీచంద్ మలినేని 'జాట్' చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రణ్‌దీప్ హుడా, వినీత్‌కుమార్ సింగ్, రెజీనా కసాండ్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ యాక్షన్ ప్రియులను అలరించింది. తాజాగా, ఈ సినిమా డబ్బింగ్ పనులను మొదలుపెట్టినట్టు మేకర్స్ తెలిపారు. సంగీతం: థమన్.ఎస్.

దుబాయ్‌లో గామా వేడుక



గామా అవార్డ్స్ (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) 2025, ఐదో ఎడిషన్ కర్టెన్‌రైజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులతో పాటు చాలా మంది తెలుగువారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు రఘు కుంచె ఈ వేడుకను నిర్వహించే జ్యూరీ కమిటీని, తేదీని, వేదిక వివరాలను ఆవిష్కరించారు. జూన్ 7న దుబాయ్‌లో ఈ ఐదో ఎడిషన్ వేడుక నిర్వహించనున్నారు. గామా అవార్డు జ్యూరీలో ముఖ్య సభ్యులైన దర్శకులు ఏ.కోదండ రామిరెడ్డి, బి.గోపాల్, సంగీత దర్శకులు కోటి.. వివిధ రంగాలకు చెందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో గామా అవార్డుల చైర్మన్ కేసరి త్రిమూర్తులు మాట్లాడుతూ "ఈ సారి జరిగే గామా వేడుక చాలా అట్టహాసంగా ఉండబోతోంది" అని అన్నారు.



ఎంఓయూ ప్రతులతో మంత్రి టీజీ భరత్, సీఈవో శేఖర్‌బాబు, అల్లానా ప్రతినిధులు

రాష్ట్రంలో పౌల్ట్రీ, ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్లు

- 200 కోట్లతో ఏర్పాటుకు దుబాయ్ కంపెనీ సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వంతో అల్లానా గ్రూప్ ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.200 కోట్ల పెట్టుబడులతో పౌల్ట్రీ, ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు దుబాయ్‌కి చెందిన అల్లానా/ఇఫ్కో గ్రూప్ ముందుకు వచ్చింది. 'గల్ఫ్ ఫుడ్-2025' పేరుతో దుబాయ్‌లో నిర్వహించిన సదస్సులో ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్‌బాబు, ఆ కంపెనీ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అల్లానా/ఇఫ్కో గ్రూప్ ఎండీ ఇర్ఫాన్ అల్లానా, డైరెక్టర్ మొయిజ్ చైనావాలా, సీఈవో మనీష్ మూలే పాల్గొన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుంది.

ఉన్నతవిద్యలో నవశకం ప్రారంభం!

- వీసీల నియామకంపై 'ఎక్స్'లో సీఎం చంద్రబాబు పోస్ట్

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో నవశకం మొదలైందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను ప్రతిభ ఆధారంగా నియమించామని బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా అర్హత ఉన్న వారినే వీసీలుగా నియమించామని, సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని తెలిపారు. చరిత్రలో మొదటిసారి ఎస్టీ మహిళా ప్రొఫెసర్ ప్రసన్నశ్రీని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ వీసీగా నియమించామని చెప్పారు.

అత్యధిక విపత్తు సాయం ఇచ్చినందుకు థ్యాంక్స్

విపత్తులు, వరదల సాయంగా కేంద్రం ఐదు రాష్ట్రాలకు రూ.1554.99 కోట్లు విడుదల చేయగా, అందులో అత్యధికంగా రూ.608.08 కోట్లను ఏపీకి కేటాయించింది. ఏపీ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు ప్రధాని మోదీకి, అమిత్‌షాకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేల అవగాహన తరగతులు వాయిదా

ఎమ్మెల్యేల అవగాహన తరగతులు వాయిదా పడ్డాయి. ఈనెల 22, 23 తేదీల్లో జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈ నెల 24 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. సమావేశాలు జరిగే సమయంలోనే ఎమ్మెల్యేలకుతరగతులు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు టోకరా!

- టీడీపీ ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు

డీజీపీ కార్యాలయ ఉద్యోగి దివ్య ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని పలువురు బాధితులు బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్ వినతులు స్వీకరించారు. రీసర్వేలో జరిగిన అన్యాయాలపైనా పలువురు ఫిర్యాదులు చేశారు.

డాక్యుమెంట్లపై నిర్ణయానికి నిర్దిష్ట గడువు ఉందా?

- పూర్తి వివరాలు ఇవ్వాలని హైకోర్టు నోటీసులు

ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్న లోపాలను సరిదిద్దేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. నిర్దిష్ట గడువులోగా డాక్యుమెంట్లపై నిర్ణయం తీసుకోవాలని రిజిస్ట్రార్లకు ఏమైనా మార్గదర్శకాలు జారీ చేశారా? అని ఆరా తీసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఏప్రిల్ 16కి వాయిదా వేసింది ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

సీపీఎస్ రద్దుపై అసెంబ్లీలో చర్చించాలి: సీపీఎస్ఈఏ

త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో సీపీఎస్ పై చర్చించి సీపీఎస్ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు న్యాయం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్, సీఎం దాస్ కోరారు. బుధవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీపీఎస్ విధానంపై పునఃసమీక్షిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

పెద్ద కాంట్రాక్టర్లకే బిల్లులు చెల్లిస్తారా?

- చిన్నోళ్లను పట్టించుకోరా: ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల నిరసన

ఒకరిద్దరు కాంట్రాక్టర్లకే బిల్లులు చెల్లించి, మిగిలిన వారిని విస్మరించారంటూ ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించే ప్రక్రియ చేపట్టింది. కాంట్రాక్టర్లకు సుమారు రూ.200 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం రూ.100 కోట్ల మేర బిల్లులు చెల్లించింది. ఈ చెల్లింపుల్లో 80 కోట్లు మేఘా లాంటి పెద్ద కాంట్రాక్టర్‌కే చెల్లించారని, మిగిలిన 20 కోట్లు కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేతకు చెల్లించారని కాంట్రాక్టర్లు వాపోయారు.

కోనసీమ డీపీటీవోగా రాఘవకుమార్

ఏపీఎస్‌ఆర్టీసీ కోనసీమ జిల్లా డీపీటీవోగా గత అక్టోబరులో బదిలీ అయిన రాఘవకుమార్ ఎట్టకేలకు రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కిశోర్‌కుమార్‌ను నియమిస్తూ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో సీసీవోఎస్‌గా పనిచేస్తున్న రాఘవకుమార్‌ను గత అక్టోబరులో కోనసీమ జిల్లా డీపీటీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే, ఒక ఉన్నతాధికారి అండదండలతో ఆయన ఇక్కడే ఉంటూ కోనసీమ వైపు కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఏఎస్‌ఆర్టీయూలో ఐదేళ్ల డిప్యుటేషన్‌పై వెళ్లి తిరిగొచ్చిన కిశోర్ కుమార్‌ను సీసీవోఎస్‌గా నియమించి తక్షణమే రిలీవ్ కావాలంటూ రాఘవ కుమార్‌ను ప్రభుత్వం ఆదేశించడంతో ఎట్టకేలకు ఆయన కోనసీమ వెళ్లారు.

గిరిజన సంక్షేమ అధికారులకు పదోన్నతులు

గిరిజన సంక్షేమశాఖ అధికారులకు పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తూ గిరిజన సంక్షేమశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. జాయింట్ డైరెక్టర్ ఎం.సరస్వతికి అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి ఆమె పనిచేస్తున్న మైదాన ప్రాంత ప్రాజెక్టు అధికారిగా నియమించారు. జాయింట్ డైరెక్టర్ కె.రామశేషుకు అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి తిరిగి ఎస్టీ కమిషన్ కార్యదర్శిగా నియమించారు. గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జాయింట్ డైరెక్టర్ బి.మల్లికార్జునరెడ్డికి అదనపు కమిషనర్‌గా పదోన్నతి కల్పించి నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ట్రైకార్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న జాయింట్ డైరెక్టర్ సి.ఆనంద్ మణికుమార్‌కు ట్రైకార్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేద్దాం: నాదెండ్ల

ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లు, సరఫరాల అధికారులదే కీలక పాత్ర అని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గత ప్రభుత్వంలోని అలవాట్లను మానుకుని టీం స్పిరిట్‌తో పనిచేసి ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. ఎండీయూ వాహనాలపై నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉండాలన్నారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన డీఎంలు, డీఎస్‌వోల వర్క్‌షాప్‌లో మంత్రిమాట్లాడగా.. కమిషనర్ సౌరబ్‌గౌర్, ఎండీ మనజీర్ జిలానీ సమూన్ పాల్గొన్నారు.

విజిలెన్స్ గుప్పిట్లో 'టీడీఆర్' గుట్టు

- తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి హస్తం!
- ముగ్గురు మహిళలకు చెందిన బాండ్లను రూ.12 కోట్లకు విక్రయించి... కుచ్చుటోపీ
- బిల్డర్‌కు నాలుగో వంతు ముడుపులు
- స్థలం యజమానులకు తెలియకుండానే బాండ్లు జారీ చేసేసిన అధికారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మంజూరు చేసిన టీడీఆర్ బాండ్లపై జరుగుతున్న విజిలెన్స్ తనిఖీల్లో అవినీతి వ్యవహారం బట్టబయలైంది. స్థల యజమానులకు తెలియకుండానే బాండ్లు జారీ అయినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్‌గా స్థలాలు రాసినంత వరకే వాటి యజమానులు పరిమితమయ్యారు. బాండ్ల జారీ మాత్రం యజమానులకు తెలియకుండానే జరిగిపోయింది. ఇదే విషయాన్ని విజిలెన్స్ శాఖ గుర్తించింది. తాడేపల్లిగూడెంలో 18 మందికి వైసీపీ హయాంలో బాండ్లు జారీ అయ్యాయి. వాటి విలువ సుమారు రూ.200 కోట్లు. మార్కెట్‌లో 40 శాతం లాభానికి వాటిని విక్రయించారు. అంటే రూ.50 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. దీనిలో సింహ భాగం అప్పట్లో మంత్రిగా వ్యవహరించిన వైసీపీ నేతకు అందినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. విజిలెన్స్ తనిఖీల్లో ఇప్పుడు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. స్థలం యజమానులకు తెలియకుండానే బాండ్లు జారీ అయిన విషయాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వీటి జారీలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులపై అధికారులు దృష్టి పెట్టారు. నిజానికి వైసీపీ హయాంలో జారీ అయిన 16 బాండ్లలో కొద్దిపాటి సొమ్మును స్థలం యజమానులకు ఇచ్చి సంతృప్తి పరిచారు. మరో రెండు బాండ్ల విషయంలో మాత్రం యజమానులకు పైసా ప్రయోజనం చేకూరలేదు. విజిలెన్స్ తనిఖీల్లో ఈ విషయం బహిర్గతమైంది. తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలోని తాళ్ల ముదునూరుపాడులో 69/1, 69/2 సర్వే నెంబర్‌లో 1,333 చదరపు గజాల స్థలాన్ని ముగ్గురు మహిళలు మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్‌గా రాసిచ్చారు. సదరు సర్వే నెంబర్లలో దాదాపు 3,450 చదరపు గజాల స్థలం ఉంది. తాడేపల్లిగూడెం-భీమవరం మాస్టర్ ప్లాన్ రహదారిలో 1,333 గజాల స్థలం ఉందంటూ మున్సిపాలిటీకి 2022లో గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చారు. అప్పట్లోనే మిగిలిన స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి బిల్డర్‌తో ఒప్పందం చేసుకున్నారు. మున్సిపాలిటీకి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌లో జారీ అయ్యే బాండ్లను అపార్ట్‌మెంట్‌కు ఉపయోగించేలా బిల్డర్‌తో ఒప్పందం కుదిరింది. అక్కడ గజం స్థలం రిజిస్ట్రేషన్ విలువను రూ.56 వేలుగా నిర్ధారించారు. దీనికి నాలుగు రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లను 2022లోనే మున్సిపాలిటీ జారీచేసింది. వాటి విలువ రూ.29.85 కోట్లు వరకు ఉంటుంది. అయితే, అపార్ట్‌మెంట్ నిర్మాణానికి వాటిని ఉపయోగించలేదు. మార్కెట్‌లో 40 శాతం ధరకు విక్రయించుకున్నారు. సుమారు రూ.12 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఆ మొత్తం బిల్డర్ లబ్ధి పొందారని ఇప్పటి వరకు మహిళలు అనుమానిస్తూ వచ్చారు. కానీ, విజిలెన్స్ తనిఖీల్లో బిల్డర్‌కు తెలియకుండానే బాండ్లు జారీ అయినట్టు స్పష్టమైంది. ఈ వ్యవహారంలో భీమవరం పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ కీలకంగా వ్యవహరించినట్టు గుర్తించారు. బిల్డర్‌కు రూ.3 కోట్లు అప్పగించడంతో బిల్డర్ నోరు మెదపలేదు. మిగిలిన రూ.9 కోట్లలో సింహభాగం మాజీ మంత్రికి ముట్టినట్టు సమాచారం. స్థలం యజమానులకు, బిల్డర్‌కు తెలియకుండా బాండ్లు జారీ అయిన విషయంపైనే ఇప్పుడు విజిలెన్స్ దృష్టి పెట్టింది.

మహిళలకు అన్యాయం

తాళ్లముదునూరుపాడులో సొంత స్థలాన్ని మున్సిపాలిటీకి ఇచ్చిన ముగ్గురు మహిళలకు పూర్తిగా అన్యాయం జరిగినట్టు విజిలెన్స్ గుర్తించింది. వారం రోజులుగా తాడేపల్లిగూడెంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. మహిళల పేరుతో ఉన్న స్థలానికి బాండ్లు జారీ అయిన విషయం తనకు తెలియదంటూ బిల్డర్.. విజిలెన్స్‌కు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో వైసీపీకి చెందిన మాజీ మంత్రి ప్రధాన హస్తం ఉందని అధికార యంత్రాంగం నిర్ధారణకు వచ్చింది. విజిలెన్స్ నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించడానికి సిద్ధమవుతోంది. ఈ నివేదిక ఆధారంగా సీఐడీ దర్యాప్తు జరగనుంది.

టిడ్కో ఇళ్ల వద్దే జీవనోపాధి

- రూ.71 కోట్లతో 10 ప్రాంతాల్లో కేంద్రాలు
- సముదాయాల వద్ద 599 షాపుల నిర్మాణం
- మంత్రి నారాయణ చొరవతో పేదలకు ఊరట

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల వద్ద పేదలకు కూటమి ప్రభుత్వం జీవనోపాధి కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. పట్టణాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్ల వద్దనే పలు షాపులు నిర్మించి యువతకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని సీఎం ఆదేశించడంతో మంత్రి నారాయణ చొరవ తీసుకున్నారు. పీఎం ఆవాస్ యోజనలో వాక్ టు వాక్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో రూ.71.88 కోట్లతో అమలు చేయనున్నారు. మున్సిపల్‌శాఖ ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 599 షాపులు నిర్మించి టిడ్కో ఇళ్ల వద్ద 10 శాతం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. మెప్మా మిషన్ డైరెక్టర్ ప్రతిపాదనల మేరకు 9 పట్టణ స్థానిక సంస్థల్లో 10టిడ్కో నివాసిత ప్రాంతాల్లో ఈ జీవనోపాధి కేంద్రాలను మంజూరు చేసింది. పలు రకాల ఉపాధి కల్పన కేంద్రాలతో పాటు ఉత్పత్తి కేంద్రాలు, గార్మెంట్స్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సౌకర్యాలు, సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలను స్థాపిస్తారు. నెల్లూరు, రాజమండ్రి, చిలకలూరిపేట, మంగళగిరి, శ్రీకాకుళం, పిఠాపురం, నంద్యాల, చిత్తూరు, విశాఖపట్నంలోని టిడ్కో కాలనీల్లో జీవనోపాధి కేంద్రాలను నిర్మించనున్నారు. ఇందుకోసం మూడంతస్తుల భవనాలు నిర్మిస్తారు. మొదట విడతలో 315, రెండో విడతలో 284 షాపులు నిర్మిస్తారు. వాటి నిర్మాణాలను టిడ్కో సంస్థ చేపట్టనుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులకు చదరపు అడుగు సుమారు రూ.2వేలకు విక్రయిస్తారు. ఈ షాపులను కొనుగోలు చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు రుణ సహకారం అందిస్తారు.

ఉపాధి అధికారుల ఆకస్మిక తనిఖీలు

- రూ.300 కూలి కల్పించేందుకు చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉపాధి కూలీలకు కేంద్రం ప్రకటించిన రోజుకు రూ.300 వేతనం అందేలా, పథకం పట్ల మరింత అవగాహన కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు 26 జిల్లాల్లోని విజిలెన్స్, సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు బుధవారం క్షేత్ర పర్యటనలు చేపట్టారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వచ్చేలా క్షేత్రస్థాయి సిబ్బంది మార్కువుట్లు ఇవ్వడం, ఆ ప్రకారం పని చేసి పూర్తి వేతనం పొందేందుకు కూలీలకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ పర్యటనలు చేపట్టారు. 347 గ్రామ పంచాయతీల్లో 985 పనులను పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు 52 పంచాయతీల్లో 208 పనులను, క్వాలిటీ కంట్రోల్ అధికారులు 61 పంచాయతీల్లో 85 పనులను పర్యవేక్షించారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 12,019 గ్రామాల్లో 21,055 పనులకు 8.9 లక్షల మంది కూలీలు హాజరయ్యారు. ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తూ, పథకం మరింత సమర్థవంతంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు పచ్చజెండా

- ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నవారికి ఉపశమనం
- ఇచ్చిన హామీ అమలు చేసిన చంద్రబాబు
- 800 మంది ఉద్యోగుల కుటుంబాలకు లబ్ధి
- గతంలో అందరికీ ఇవ్వబోమన్న జగన్

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ యజమానిని కోల్పోయి తలకిందులైన కుటుంబాలపై కూటమి ప్రభుత్వం కరుణ చూపించింది. ఏపీఎస్‌ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించింది. జగన్ ప్రభుత్వంలో అన్యాయానికి గురైన వారందరికీ ఈ నిర్ణయంతో ఉపశమనం లభించనుంది. ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబంలో అర్హులైన వారికి కండక్టర్, డ్రైవర్, శ్రామిక్ లాంటి ఉద్యోగాలు బ్రెడ్ విన్నర్(కారుణ్య నియామకం) స్కీమ్ కింద కార్పొరేషన్ ఉద్యోగాలు ఇస్తోంది. అయితే, 2020 జనవరి 1న రాష్ట్ర ప్రభుత్వంలో సిబ్బందిని విలీనం చేసిన వైసీపీ సర్కారు, 2016 జూలై నుంచి 2019 డిసెంబరు మధ్య చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మాత్రమే కారుణ్యం కింద ఉద్యోగాలిస్తామని ప్రకటించింది. అంతకు ముందు ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల పిల్లల గోడు వినిపించుకోలేదు. కారుణ్య నియామకాలు అందరికీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు వినతులిచ్చినా పట్టించుకోలేదు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు దృష్టికి బాధితులు ఈ విషయాన్ని తీసుకెళ్లగా తాము అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామంటూ మాటిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలువురు బాధితులు రవాణా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలకు వినతి పత్రాలు సమర్పించారు. ఇటీవల ఆర్టీసీపై సమీక్ష చేసిన చంద్రబాబు 2016కు ముందు చనిపోయిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. దీనికి అనుగుణంగా కారుణ్య నియామకాలను పూర్తి చేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 800మందికి ఈ నిర్ణయం ఉపశమనం కల్పిస్తుందని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 3 చోట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు

- జమ్మలమడుగు, ఘని, కుప్పంలో ఏర్పాటు
- సీఎస్ అధ్యక్షతన బోర్డు తొలి భేటీ

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ), ఏపీ జెన్కో నిర్ణయించాయి. ఇవి కడప జిల్లా జమ్మలమడుగు (400 మెగావాట్లు), కర్నూలు జిల్లా ఘని (400 మెగావాట్లు), చిత్తూరు జిల్లా కుప్పం (200 మెగావాట్లు)లో నెలకొల్పుతారు. సీఎస్ విజయానంద్ అధ్యక్షతన బుధవారం వెలగపూడి సచివాలయంలో ఎన్‌హెచ్‌పీసీ, ఏపీ జెన్కో సంయుక్తంగా తొలి బోర్డు సమావేశం నిర్వహించాయి. ఎన్‌హెచ్‌పీసీ డైరెక్టర్లు రజత్ గుప్తా, సందీప్ బాత్రా, ఏపీజెన్కో ఎండీ కేవీఎన్ చక్రధర బాబు తదితరులు హాజరయ్యారు. పగటి పూట 500 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దానిని బ్యాటరీలో నిక్షిప్తం చేస్తారు. అలా స్టోర్ చేసిన కరెంటును ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో వినియోగిస్తారు. బ్యాటరీ స్టోరేజీ విద్యుదుత్పత్తితో రెట్టింపు కరెంటు అందుబాటులోకొస్తుంది. కాగా.. విశాఖ పూడిమడకలో రూ.1,95,000 కోట్లతో ఎన్‌టీపీసీ-నెడ్ క్యాప్ సంయుక్తంగా చేపట్టే ప్లాంటు పనుల వేగాన్ని పెంచాలని సీఎస్ కోరారు.

పోలవరంపై మోదీ ప్రత్యేక శ్రద్ధ

- నిర్దేశిత గడువులోగా పరిపూర్తికి సంపూర్ణ మద్దతు
- త్వరలోనే ప్రాజెక్టు సందర్శనకు వస్తా
- మంత్రి నిమ్మలతో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్
- డిజైన్లను త్వరితంగా ఆమోదించాలి
- డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వండి: రామానాయుడు విజ్ఞప్తి



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన మంత్రి నిమ్మల

అమరావతి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ జీవనాడి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సంపూర్ణ మద్దతు ఇస్తాం' అని కేంద్ర జలశక్తి మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరుగుతున్న అఖిల భారత జల వనరుల మంత్రుల సదస్సు రెండో రోజు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాజెక్టు సందర్శనకు సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఆహ్వానించమన్నారని కేంద్ర మంత్రికి తెలపగా...ఆయన సందర్శనకు వస్తానని హామీ ఇచ్చారని నిమ్మల చెప్పారు. రాష్ట్ర నీటి వనరులు, జరుగుతున్న ప్రాజెక్టుల పనులు, అవసరమైన సాయం... తదితర అంశాలతో కేంద్ర మంత్రికి నివేదిక అందజేశారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుని మూడుసార్లు సందర్శించి, ప్రాజెక్టు పూర్తికి గడువును నిర్దేశించారు. 2025 డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం, 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తున్నారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయి. మార్చి నుంచి మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతాం. డయాఫ్రం వాల్ నిర్మాణంతో పాటు సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ నిర్మాణ పనులు చేపట్టే విధంగా సహాయ సహకారాలు అందించాలి. సాంకేతిక అంశాలకు సంబంధించి డిజైన్లను త్వరితగతిన ఆమోదించి, పంపించాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వివరాలను ప్రతి నెలా కేంద్రానికి తెలియచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆమేరకు ప్రతి నెలా కేంద్రానికి పనుల వివరాలు పంపిస్తాం' అని మంత్రి నిమ్మల, కేంద్ర మంత్రికి తెలిపారు. నివేదికలోని అంశాలతో పాటు తాను చేసిన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి నిమ్మల రామానాయుడు ఒక ప్రకటనలో వివరించారు.

కృష్ణా జలాలపై సమన్వయంతో ముందు సాగుదాం

'కృష్ణాజలాల విషయంలో సాధ్యమైనంత వరకూ జలవివాదాలకు తావివ్వకుండా పరస్పరం సహకారాన్ని అందించుకుందాం. సమన్వయంతో సమస్యలు రాకుండా చూసుకుందాం' అని ఏపీ, తెలంగాణ, కర్ణాటక జల వనరుల మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ కుమార్‌రెడ్డి, శివకుమార్ నిర్ణయించారు. ఉదయపూర్ వేదికగా జరిగిన సమావేశంలో ఈ ముగ్గురు మంత్రులూ కృష్ణాజలాల వినియోగంపై పరస్పర సహకారాన్ని అందించుకోవాలని తీర్మానించారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక పేరుకుపోవడం వల్ల నీటి నిల్వ తగ్గిపోతోందన్న ఆందోళనను ఆ ముగ్గురూ వ్యక్తం చేశారు. దాదాపు 25 టీఎంసీల నీటి నిల్వను కోల్పోతున్నామని చర్చల్లో మంత్రులు అభిప్రాయపడ్డారు. పూడికతీత విషయంలో సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఇందుకోసం ముందస్తుగా తుంగభద్ర డ్యామ్ అధికారులతో మంత్రుల స్థాయిలోనే సమీక్షను చేపట్టి, నిర్ణయాన్ని సీఎంల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

పెట్టుబడులతో ఏపీకి రండి

- దేశ, విదేశీ పెట్టుబడి దారులకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపు
- ఢిల్లీలో సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్‌కు హాజరు



ఢిల్లీలో జరుగుతున్న సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్‌లో కందుల దుర్గేశ్, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సమగ్ర పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో రూ.25వేల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. పీపీపీ విధానం ద్వారా రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు పెద్దఎత్తున రాయితీలు, మెరుగైన ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఏపీలో పర్యాటకాభివృద్ధి కోసం నూతన పర్యాటక పాలసీ 2024-29 తీసుకొచ్చామని వివరించారు. పెద్దఎత్తున పెట్టుబడులతో ఏపీకి రావాలని పెట్టుబడిదారులు, టూర్ ఆపరేటర్లు, ట్రావెలర్స్, ఔత్సాహికులను ఆహ్వానించారు. బుధవారం ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్‌కు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దేశ, విదేశీ పెట్టుబడిదారులతో మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించింది. తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ వర్తింపజేస్తున్నాం. పర్యాటకులను ఆకర్షించే విధంగా టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పన తదితర విభిన్న కార్యక్రమాలు, పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నాం. రాష్ట్ర పర్యాటక రంగంలో విస్తృతమైన అవకాశాలు, వనరులు ఉన్నాయి. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని పర్యాటకాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం" అని మంత్రి చెప్పారు.

నవోదయం-2.0 ప్రారంభం

- రాష్ట్రాన్ని సారా రహితంగా మారుద్దాం: కొల్లు రవీంద్ర



ఒంగోలు నగరంలో నిర్వహించిన ర్యాలీలో మంత్రులు కొల్లు రవీంద్ర, స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, దర్శి ఇన్‌చార్జి లక్ష్మి, ఎక్సైజ్ అధికారులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చుదామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఒంగోలులో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం నవోదయం-2.0 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ యువత నిర్వీర్యం కాకూడదని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. నాటుసారా, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలుపుతూ ప్రత్యేక గీతాన్ని రాసిన కడప జిల్లా ఏఈఎస్ వినోద్‌ను మంత్రి రవీంద్ర సత్కరించారు. ప్రత్యేక గీతాన్ని, నవోదయం పోస్టర్లను ఆవిష్కరించారు. నగరంలో భారీ ర్యాలీని నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు.


మద్యం అక్రమాల్లో తాడేపల్లి ప్యాలెస్‌కు లక్ష కోట్లు

- విచారణకు సిట్ వేయగానే ఫైల్స్ దహనం
- రెడ్‌బుక్ అంటేనే వైసీపీ నాయకులకు తడిసిపోతుంది
- ఐదేళ్లూ జగన్ చేసిన దుర్మార్గాల వల్లనే 11 సీట్లు: కొల్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మద్యం అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించిన వెంటనే ఆ పార్టీ నేతలకు తడిసిపోతుందని, ప్యాలెస్ బయట ఫైళ్ల దహనమయ్యాయని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. మద్యం అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన దుర్మార్గాల వల్లనే ప్రజలు 11 సీట్లు ఇచ్చారన్నారు. ఇంకా అలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో అవి కూడా రావని హెచ్చరించారు. మద్యం విధానంలో దందాలతో తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.లక్ష కోట్లు నిధులు చేరాయన్నారు. సిట్ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. రెడ్‌బుక్ పేరు వింటేనే వైసీపీ నాయకులకు తడిసిపోతుందని ఎద్దేవా చేశారు. మిర్చి యార్డు పర్యటన పేరుతో జగన్ కొత్త డ్రామాకు తెరతీశారని ధ్వజమెత్తారు. రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. జగన్ ఐదేళ్ల పాలనలో 14 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని మంత్రి తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన జగన్‌ను అరెస్టు చేయాలి: డోలా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా గుంటూరు మిర్చియార్డులో హడావుడి చేసిన జగన్, ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని మంత్రి డీఎస్‌బీవీ స్వామి ఒంగోలులో డిమాండ్ చేశారు. రైతులపై ప్రేమ ఉన్నట్లు జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తన పాలనలో రైతులతో పాటు అన్ని వర్గాలను ముంచిన జగన్.. రైతు భరోసా నిధులు ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సీఎం చంద్రబాబు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి లేఖ రాశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ప్రశ్నించిన వారిని నిర్బంధించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వంశీ అరెస్టుపై ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా జగన్ వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. వైసీపీకి చెందిన దళిత నాయకులు జైలులో ఉంటే జగన్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. సప్త సముద్రాల అవతల ఉన్న అధికారులను పట్టుకొస్తామని చెబుతున్న జగన్.. అవి దాటాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని మంత్రి స్వామి ఎద్దేవా చేశారు.



హస్తిన చేరిన చంద్రబాబు

నేడు ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి హాజరు.. కేంద్ర మంత్రులు అమిత్‌షా, సీఆర్ పాటిల్‌తో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా గురువారం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం పలువురు కేంద్ర మంత్రులను కలువనున్నారు. ఢిల్లీ రాంలీలా మైదానంలో కొత్త సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశమవుతారు. రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, సాయంపై చర్చిస్తారు. అంతకుముందు ఉదయం 9.30 గంటలకు కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలుస్తారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలపై చర్చిస్తారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను.. 17,500 క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థ్యంతో నిర్మించేందుకు ఆర్థిక సాయంపై చర్చిస్తారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోనూ చంద్రబాబు భేటీ అయ్యే అవకాశం ఉంది. మిర్చి రైతుల సమస్యలపై మాట్లాడనున్నారు. మిర్చి రైతులను ఆదుకునేందుకు కేంద్ర మంత్రిని నేరుగా కలిసి సాయం కోరనున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి హాజరుకానున్నారు.

వైసీపీకి అసెంబ్లీకి వెళ్లే దమ్ము లేదు

జగన్‌కు నేరస్థుల పరామర్శకు సమయముంది.. 'సభ'కు వెళ్లేందుకు మాత్రం మొహం చెల్లదు: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించాల్సిన వైసీపీకి అసెంబ్లీకి వెళ్లే దమ్ములేదు. నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్లను జైలుకు వెళ్లి పరామర్శించేందుకే వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు సమయం ఉంటుంది. కానీ, ప్రజల కోసం అసెంబ్లీకి వెళ్లేందుకు మాత్రం మొహం చెల్లదు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'ప్రెస్‌మీట్లు పెట్టి పురాణం అంతా చెప్పే తీరిక దొరుకుతుందని కానీ.. అసెంబ్లీలో పాలక పక్షాన్ని నిలదీసే ధైర్యం జగన్‌కు లేదు. ప్రజలు 11 మందిని గెలిపిస్తే శాసనసభకు వెళ్లకుండా మారం చేసే వైసీపీ అధ్యక్షునికి, ఎమ్మెల్యేలకు ప్రజల మధ్య తిరిగే అర్హత లేదు. ప్రజల సమస్యలపై మాట్లాడే నైతికత అసలే లేదు. వైసీపీ ఎమ్మెల్యేలు ఈసారైనా అసెంబ్లీకి వెళ్లాలని డిమాండ్ చేస్తున్నాం. ఈసారి కూడా అసెంబ్లీకి వెళ్లే దమ్మూ లేకుంటే వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలి. ఈ నెల 28న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కు చంద్రబాబు నిధులు కేటాయించాలి. అన్ని పథకాలనూ ఈ ఏడాది నుంచే అమలుచేయాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.



మిర్చి రైతులకు ధర లోటు చెల్లించండి

» కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఎర్ర మిరప కొనుగోలు ధర తగ్గినందున ఏపీ మిర్చి రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం(ఎంఐఎస్) కింద ధర లోటు చెల్లింపు(పీడీపీ)ని అమలు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తాజాగా కేంద్రమంత్రికి సీఎం మరో లేఖ రాశారు. 'ఏపీలో మిర్చి ఉత్పత్తి నష్టాన్ని 25శాతం నుంచి75శాతానికి వరకు కవరేజీని పెంచడంతో పాటు 50:50 నిష్పత్తికి బదులు 100% నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలి. ఈ విషయంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ కమిటీ ద్వారా ఈ నెల 14న ఢిల్లీలో జరిగిన మంత్రుల కమిటీకి ప్రతిపాదనలు పంపడం జరిగింది. గుంటూరు యార్డుకు ఇప్పటికే మిర్చి అధికంగా రావడం ప్రారంభమైంది. ప్రత్యేక రకం మిర్చి క్వింటా రూ.13,600, సాధారణ రకం రూ.11,500 పలుకుతోంది. 2022-23లో నగటు ధర రూ.20,500 వచ్చింది. 2023-24లో నగటు ధర రూ.20వేలు పలికింది. 2024-25లో క్వింటా రూ.13,600 నగటు ధర వస్తోంది. అంటే గత రెండేళ్ల ధరల కంటే ఈ ఏడాది చాలా తక్కువగా ఉంది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకుని, 100% నష్టాన్ని కేంద్రం భరించడంతో పాటు ఏపీలో రైతుల నష్టాన్ని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా తగ్గించవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

అమ్మా భారతీ... మీ భర్తకు పిచ్చి ముదిరింది

» మందుల డోసు పెంచు తల్లీ: మంత్రి గుమ్మడి



సాలూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'అమ్మా భారతీ.. మీ భర్తకు పిచ్చి మరికాస్త ముదిరినట్లుంది. మందుల డోసు పెంచు తల్లీ' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు లో ఆమె మాట్లాడారు. 'వల్లభనేని వంశీ, కొడాలి నాని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కంటే అందంగా ఉంటారని, అందుకే అరెస్టు చేశారని జగన్ అనడం ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతోంది. పోలీసులపై తప్పుడు ప్రకటనలు చేసినందుకు సుమోటోగా కేసు నమోదు చేసి జగన్‌ని తక్షణం అరెస్టు చేయాలి' అని అన్నారు.

అధికారులు రాజ్యాంగానికి లోబడి పనిచేస్తారు

» యంత్రాంగాన్ని బెదిరించాలని చూస్తే ఊరుకోం: కొండపల్లి

విజయనగరం ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'అధికారులు రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహిస్తారు. వారు రూల్స్ ఫాలో అవుతారు. జగన్ కూడా ఫాలో అవ్వాలి. అలాకాదని యంత్రాంగాన్ని భయపెట్టాలని చూస్తే ప్రభుత్వం ఊరకోదు' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం విజయనగరం జిల్లాలో ఆయన మాట్లాడారు.

పోలీసులపై జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

» ప్రస్తుత పరిస్థితుల్లో పులివెందులలో గెలవడమూ కష్టమే: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి పోలీసులపై, అధికారులపై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం, ఆక్షేపణీయమని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో మాట్లాడారు. "పార్టీ అధ్యక్షునిగా తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైలు వద్దకు పోయి పరామర్శించడం తప్పుకాదు. కానీ అది అక్రమకేసని, వంశీ సచ్ఛీలుడని వెనకేసుకు రావడం సమంజసం కాదు. కేసు అక్రమమా, సక్రమమా అన్నది కోర్టులో తేలుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పులివెందులలో జగన్ గెలవడమే కష్టం' అన్నారు.

పిల్ల సైకోకు పెద్ద సైకో పరామర్శ: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అధికార మదంతో ఆనాడు వాగిన వైసీపీ వారంతా జైలుకెళ్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న చెప్పారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ జైల్లో ఉన్న వల్లభనేని వంశీని పరామర్శించి జగన్ చరిత్ర హీనుడయ్యాడన్నారు. పిల్ల సైకోను పరామర్శించేందుకు పెద్ద సైకో వచ్చాడని ఎద్దేవా చేశారు. నందిగం సురేశ్‌ను జగన్ ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. ఒక పథకం ప్రకారం జగన్ కిరాయి మూకలను వెంట బెట్టుకుని విజయవాడలో బీభత్సం చేయాలనే ఆలోచనతోనే జగన్ వచ్చారని, అయితే, పోలీసులు పసిగట్టి ఎక్కడిక్కడ అదుపు చేశారని చెప్పారు. పోలీసుల బట్టలు ఊడదీస్తాన నడంతోనే జగన్ నైజం స్పష్టమైందన్నారు. ఈసారి పులివెందులలో కూడా జగన్ ఓటమి ఖాయమన్నారు.

వైసీపీ పాలనలో అన్నీ భూ వివాదాలే: నల్లమిల్లి

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రమంతా భూ వివాదాలేనని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 'వారధి' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దృష్టికి ప్రజల నుంచి ఎక్కువగా భూ సమస్యలపై వినతులు వచ్చాయి. పల్లెల్లో రైతుల వ్యవసాయ భూముల నుంచి పట్టణాలు, నగరాల్లో స్థిరాస్తుల వరకూ వైసీపీ నేతలు వేలు పెట్టని భూమి లేదని వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఒక్కరిలోని భయాన్ని కల్పించిందన్నారు.

అసైన్డ్ భూములపై మంత్రివర్గ ఉపసంఘం!

» ఫ్రీ హోల్డ్‌పై మరోసారి సర్కారు అధ్యయనం

రాష్ట్రంలో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌పై నిర్దిష్టమైన విధానం అనుసరించేందుకు మరోసారి అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అసైన్డ్ భూముల చట్టసవరణ, 20 ఏళ్ల కాలపరిమితి దాటాక జీవో 596 ప్రకారం ఇచ్చే ఫ్రీ హోల్డ్, తదితర అంశాలపై తదుపరి ఏం చేయాలన్న దానిపై ఉపసంఘంతో అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఫ్రీ హోల్డ్ అయిన అసైన్డ్ భూములను నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించడం, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలుదఫాలుగా ఈ నిషేధాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల చిన్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే నిషేధం తొలగించాలని కోరుతున్నారు. చట్టప్రకారం 20 ఏళ్ల కాలపరిమితి దాటిన చిన్న కమతాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్‌లకు వెసులుబాటు కల్పించాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోలేక నిషేధాన్ని కొనసాగిస్తోంది.

ప్రైవేటు భూములకు విముక్తి!

గత జగన్ సర్కారు రాజకీయ కక్ష, ఇతర కారణాలతో నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేటు భూములకు స్వేచ్ఛ కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యంతరం లేని ప్రైవేటు భూములను 22(ఏ) జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిసింది. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన విన్నపాల ఆధారంగా ఒక్కో కేసును పరిశీలించి ప్రైవేటు భూములు, నివాస స్థలాలను 22(ఏ) నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

ధరలపై అబద్ధాల దరువు

(మొదటి పేజీ తరువాయి)

వల్లించారు. నాడు సిండికేట్‌రాజ్ నడిపిన విషయం కావాలనే దాచేసి.. కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వడం లేదంటూ రాజకీయ డ్రామాలకు తెర లేపారు. తన హయాంలో క్వింటా మిర్చికి రూ.21 వేల నుంచి రూ.27 వేల వరకు ధర ఉంటే ఇప్పుడు రూ. 11 వేలు కూడా అందడం లేదంటూ.. జగన్ వరుసగా వంచన వ్యాఖ్యలు చేస్తుంటే నివ్వెరపోవడం మిర్చి యార్డులోని రైతులు వంతు అయింది. కూటమిని, చంద్రబాబును ఏదో సాధిద్దామనుకొని చివరకు ఆయనే రైతుల దృష్టిలో అభాసుపాలయ్యారు. ఇక్కడే కాదు..మంగళవారం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ విషయంలోనూ జగన్, వైసీపీ నేతలు బోల్తా కొట్టారు. ఆ రోజు రాత్రి ఏడు గంటలకు గన్నవరంపై 'బిగ్ బ్లాస్ట్' అంటూ.. హడావుడి చేసి.. చివరకు తుస్ మనిపించారు. తిరిగి మిర్చి రైతుల విషయంలోనూ అదే కథ పునరావృతం అయింది.

రైతులను గందరగోళపరిచేందుకే..

గుంటూరు యార్డు సహా రాష్ట్రంలోని వివిధ మార్కెట్లకు రోజుకు లక్షన్నర టిక్కీల మిర్చి వస్తోంది. ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లోని సరుకు అంతా ఖాళీ అయింది. పొలాల నుంచి కొత్త మిర్చి మార్కెట్లకు వస్తోంది. సాధారణంగా ఏపీ మిర్చి శ్రీలంక, చైనా, బంగ్లాదేశ్, మలేసియా వంటి దేశాలకు ఎగుమతి అవుతుంది. అయితే చైనాలోనూ మనం పండించే రకాలనే సాగు చేస్తుండటంతో ఎగుమతులు ఇటీవల కొంత తగ్గాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ కారణాలతో వ్యాపారం మందకొడిగా సాగుతోంది. అయితే ఆయా దేశాల్లోనూ పాత నిల్వలు తరిగిపోవడంతో మళ్లీ మనకు ఎగుమతి ఆర్డర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధరలు కాస్త పుంజుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనిపై గురువారం కేంద్రంతో మాట్లాడేందుకు చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారు. సరిగ్గా.. ఇదే సమయంలో మిర్చి యార్డులో జగన్ వాలిపోయారు. రైతులను గందరగోళపర్చే రాజకీయాలకు తెరతీశారు. మిర్చియార్డులో రైతులతో సంభాషించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు.

ముంచేసిన జగన్ నిర్వాకం..

2020 జనవరి 9న మిర్చికి మద్దతు ధరను జగన్ ప్రభుత్వం రూ. ఏడు వేలుగా నిర్ణయించింది. మూడేళ్లు ఆ విధానం కొనసాగింది. ప్రభుత్వమే మిర్చికి ధరను అంత తక్కువగా నిర్ణయించడం వ్యాపారులకు కలిసి వచ్చింది. ఆ మూడేళ్లూ వారు సిండికేట్ అయ్యి.. ధరలు తగ్గించారు. అప్పట్లో కొవిడ్ కారణంగా ఎగుమతులు లేవు. మరోవైపు జగన్ నిర్వాకంతో ధరలు పడిపోవడంతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడేమో మిర్చి రైతుల్ని ప్రభుత్వం దళారులకు అమ్మేసిందని జగన్ వ్యాఖ్యానిస్తున్నారు.

అబద్ధాల వరద..

చంద్రబాబు నివాసానికి కూతవేటు దూరంలోనే గుంటూరు మిర్చియార్డు ఉన్నప్పటికీ ఇక్కడి రైతులు ధర లేక పడుతున్న కష్టాలు ఆయనకు కనిపించడం లేదని జగన్ విమర్శించారు. ఒకపక్క పండించిన పంటకు ధర లేక రైతులు అమ్ముకోలేని స్థితిలో ఉంటే, తెగుళ్ల వలన పంటలు పోతున్నాయన్నారు. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పంట కనీసం 10 నుంచి 15 క్వింటాళ్లు కూడా రావడం లేదని తెలిపారు. అయితే, నాడు జగన్ హయాంలో రైతులకు కనీసం పంటల బీమా కూడా చెల్లించలేదు. కానీ, తన హయాంలో రైతులను రైతు భరోసా కేంద్రాల ద్వారా చేయి పట్టుకొని నడిపించామని అబద్ధాలు పలికారు. వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగక, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు ఇవ్వక రైతులను ముప్పతిప్పలు పెట్టిన విషయాన్ని మరిచిపోయి, తాను రూ. 65వేల కోట్లను ధాన్యం కొనుగోళ్లకు వెచ్చించినట్లు గొప్పలు పలికారు. కాగా, జగన్ రైతు సమస్యలను ఆలకించడం కంటే తన కార్యకర్తలతో జేజేలు కొట్టించుకొని ఉబ్బితబ్బిబ్బవడం కనిపించింది. జగన్ పర్యటనలో మిర్చి రైతులు స్వల్ప సంఖ్యలో ఉంటే ఆ పార్టీ కార్యకర్తలే ఎక్కువమంది హాజరయ్యారు. జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ బలప్రదర్శనకు దిగారు. పోలీసులు జగన్ పర్యటన సందర్భంగా బందోబస్తు కల్పించినా తన పర్యటనకు ఎలాంటి రక్షణ కల్పించలేదని ఆయన యాగీ చేశారు.

నాడు బోనస్ ఇచ్చిన బాబు

మిర్చి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ధరల సమస్యపై సీఎం చంద్రబాబు ఇప్పటికే 4సార్లు కేంద్రానికి లేఖలు రాశారు. ధరల వ్యత్యాసాన్ని నివారించేందుకు ఆర్థిక సాయం కోరారు. దీనిపై గురువారం ఢిల్లీ వెళ్లాలనుకున్న సీఎం చంద్రబాబు బుధవారం సాయంత్రమే బయలుదేరి వెళ్లారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌ను కలిసి, మిర్చి రైతుల సమస్యపై చర్చించనున్నారు. నవ్యాంధ్రలో, 2015-16లో మిర్చి నగటు ధర రూ.11వేలు, 2016-17లో రూ.12వేలు ఉండగా, 2017లో మిర్చి రైతులు నష్టపోకుండా క్వింటాకు రూ.1,500 చొప్పున నాడు సీఎం చంద్రబాబు బోనస్ అందజేశారు. ఇందుకోసం రూ.138కోట్లు వెచ్చించారు. అయితే ఇప్పుడు పెట్టుబడులు పెరిగిపోవడంతో మిర్చి సాగు గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరానికి రూ.2.50లక్షలపైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని అంటున్నారు. చంద్రబాబు మిర్చి రైతుల్ని ఆదుకునేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



మిర్చి యార్డులో కోడ్ ఉల్లంఘన దృశ్యాలు

కోడ్ ఉల్లంఘించిన జగన్

» కేసు నమోదుచేసిన అధికారులు

జగన్ గుంటూరు మిర్చియార్డు పర్యటన సందర్భంగా అడుగడుగునా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ర్యాలీలకు ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఈ నియమాన్ని తుంగలోకి తొక్కిన జగన్ తన నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరి మిర్చియార్డుకు వచ్చారు. ఆయన వెంట వచ్చిన కార్యకర్తలు.. సీఎం.. సీఎం... జై జగన్ నినాదాలు చేశారు. మిర్చియార్డు అనేది ప్రభుత్వరంగ సంస్థ. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా లోపల రాజకీయ కార్యకలాపాలు నిర్వహించరాదు. ఈ విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు పదేపదే వైసీపీ నేతలకు చెప్పారు. అలానే మిర్చియార్డు ప్రాంగణంలోనూ మైకులతో అనౌన్స్‌మెంట్ చేయించారు. జగన్ వచ్చి రైతులను కలిసినప్పుడు కూడా మైకు ప్రకటనలు కొనసాగాయి. వైసీపీ కార్యకర్తలు....జగన్ ఫొటోలను, జెండాలను ప్రదర్శించారు. కొంతమంది ఆ పార్టీ కండువాలు ధరించారు. వీటన్నింటిని కోడ్ పర్యవేక్షణ అధికారులు చిత్రీకరించారు. వాటిని నల్లపాడు పోలీసుస్టేషన్‌కు నివేదించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దీనిపై ఎన్నికల సంఘం ఆదేశాలతో అర్ధరాత్రి దాటాక కేసు నమోదైంది. కోడ్ నేపథ్యంలో మిర్చి యార్డు పర్యటనకు రావద్దు అని ముందుగానే కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించినా జగన్ వచ్చారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ కమిటీ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

నువ్వు ఇచ్చిన ధర రూ.7 వేలేగా జగన్!

» జనం నవ్వుకుంటున్నారని కూడా లేకుండా అబద్ధాలు

» వైసీపీ అధినేత మానసిక స్థితిపై అనుమానమొస్తోంది: అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జనం నవ్వుకుంటారని కూడా లేకుండా వైసీపీ అధినేత జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 151 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి అధికారం అప్పగిస్తే ఐదేళ్లూ ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ ఇప్పుడు బయటకొచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి సరిగా లేదన్న అనుమానం వస్తుందని అచ్చెన్న వ్యాఖ్యానించారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన పని చేసే వాడే నిజమైన నాయకుడు. కానీ జగన్‌లాంటి నాయకుడు రాజకీయాలకు పనికి రాడని ఐదు కోట్ల ప్రజలు మొన్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. మిర్చి క్వింటాకు రూ.20 వేలు గిట్టుబాటు ధర ఉండాలని డిమాండ్ చేస్తున్న జగన్. తను సీఎంగా ఉన్నప్పుడు రూ.20 వేలు ఎంఎస్‌పీ ఎందుకు ప్రకటించలేదు. 2022-24లో క్వింటా ధర రూ.20,500 ఉంది. అంతకు ముందు 2020-21లో క్వింటా రూ.12 వేలు పలుకుతున్నప్పుడు జగన్ ప్రభుత్వం రూ.7 వేలు మద్దతు ధర ప్రకటించిన విషయం వాస్తవం కాదా? మార్కెట్ ధర కంటే తక్కువ ఎంఎస్‌పీని ప్రకటించిన జగన్ ఇప్పుడు రూ.20 వేలకు కొనాలంటూ గగ్గోలు పెడితే ప్రజలు విశ్వసించరు' అని అచ్చెన్నాయుడు అన్నారు. ప్రస్తుతం రూ.13,600 ధర వస్తుందని ఈ పరిస్థితుల్లో ఎంఎస్‌పీ ప్రకటిస్తే రైతులు నష్టపోతారని అందుకని మిర్చి రైతులకు సాయం చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కోరామని వివరించారు. దీనిపై కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందన్నారు. రైతులకు ఇంకా మేలు చేయాలనే ఉద్దేశంతో చంద్రబాబు నాలుగుసార్లు కేంద్రానికి లేఖలు రాశారు. నష్టపోయిన మిర్చి రైతులకు బోనస్ ఇప్పించేలా ప్రయత్నిస్తున్నాం. రైతుల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే.. సంతోషించాల్సింది పోయి.. పని లేక గుంటూరు యార్డుకెళ్లి.. అబద్ధాలు మాట్లాడటం జగన్‌కే చెల్లిందని వ్యాఖ్యానించారు.

నాడు మిర్చి రైతుకు 138 కోట్ల బోనస్ ఇచ్చాం

ప్రస్తుతం గుంటూరు యార్డుకు రోజూ లక్షన్నర టిక్కీల మిర్చి వస్తోందని మంత్రి తెలిపారు. కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వలన్నీ అయిపోయాయని, ఇప్పుడు వచ్చిన సరుకు వచ్చినట్లు శ్రీలంక, చైనా, మలేషియాకు ఎగుమతి అవుతుందని అన్నారు. దేశ చరిత్రలో తొలిసారి 2017లో మిర్చి రైతులను ఆదుకునేందుకు నాటి టీడీపీ ప్రభుత్వం రూ.138కోట్లు బోనస్ ఇచ్చిందని, ఐదేళ్లలో మిర్చి రైతులకు నయాపైనా సాయం చేయని జగన్.. తన పాలనలో వ్యవసాయ అనుబంధ రంగాలకు తాళం వేశారని మంత్రి విమర్శించారు. 'ఐదేళ్లలో ఒక్కటైనా భూసార పరీక్షలు చేసినట్లు నిరూపిస్తారా? వ్యవసాయ యాంత్రీకరణకు పైసా ఖర్చు చేయలేదు. కనీసం రాయలసీమ రైతులకు ఒక్క డ్రిప్, స్ప్రింక్లరు ఇచ్చారా? ధాన్యం కొని, నెలల తరబడి సొమ్ము చెల్లించలేదు. జగన్ దిగిపోయేనాటికి రూ.1,600 కోట్లు బకాయి పెడితే మా కూటమి ప్రభుత్వం చెల్లించింది. మేం ధాన్యం కొన్న 2గంటల్లో రైతు ఖాతాకు డబ్బు జమ చేశాం. కందుల ధర తగ్గితే నాఫెడ్‌తో కొనిపించాం. టమాటా ధర తగ్గితే మార్కెట్ జోక్యంతో కొని, సబ్సిడీ రేటుకు రైతు బజార్లలో విక్రయించాం. ఎరువుల కొరత లేకుండా బఫర్ స్టాక్స్ పెట్టాం. 8 నెలల్లో 5 తుఫాన్లు వస్తే.. రైతులకు ఇన్‌పుట్స్ సబ్సిడీ ఇచ్చాం' అని వివరించారు. ధరలు తగ్గినప్పుడు రైతుల్ని ఆదుకునేందుకు వచ్చే బడ్జెట్‌లో మార్కెట్ జోక్యం పథకానికి నిధులు కేటాయించనున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉండగా మిర్చి యార్డుకు జగన్ వెళ్లడంపై ఎన్నికల కమిషన్ చూసుకుంటుందని, నాటి వైసీపీ ప్రభుత్వంలా కూటమి ప్రభుత్వం ఎవర్నీ నిర్బంధించబోదని, ప్రతిపక్షాలకు అడ్డు పెట్టాలనే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

నాడు పట్టించుకోకుండా : జంగా

తన ఐదేళ్ల పాలనలో రైతులకు ఉపయోగపడే పని ఒక్కటీ చేయని జగన్, ఇప్పుడు పరామర్శ యాత్రలు చేస్తున్నారని టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ధ్వజమెత్తారు. తన పాలనలో జగన్... ధరల స్థిరీకరణ నిధిని కూడా దుర్వినియోగం చేశారని జంగా బుధవారం అమరావతిలో ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మరీ గుంటూరు మిర్చి యార్డులో పర్యటించాల్సిన అవసరం ఏమొచ్చిందని జగన్‌ను నిలదీశారు.



కారు ఎక్కకుండా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను అడ్డుకుంటున్న జగన్ భద్రతా సిబ్బంది

నందిగం సురేశ్‌కు అవమానం!

» జగన్ కారులోకి రానివ్వని భద్రతాసిబ్బంది

» దళితులపై మాజీ సీఎంకున్న ప్రేమ ఇదే!

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు దళితులంటే ఏమాత్రం గౌరవం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం గుంటూరు మిర్చి యార్డు పర్యటనలో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను జగన్ వెళ్లే కారులో ఎక్కించుకోకుండా భద్రతాసిబ్బంది పక్కకు నెట్టేయడమే ఇందుకు నిదర్శనమని రాజకీయ వర్గాలు అంటున్నాయి. సురేశ్‌తో జగన్ ఒక్క మాట కూడా మాట్లాడకుండా ముందుకు సాగడం గమనార్హం. మిర్చి రైతుల పరామర్శ పేరుతో జగన్ బుధవారం మిర్చియార్డుకు వచ్చారు. ఆయనతో పాటు కాన్వాయ్‌లో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి కొడాలి నాని ఉన్నారు. వస్తూనే యార్డులోకి వెళ్లిన జగన్.. రైతులను మిర్చి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు మీడియాతో మాట్లాడాక కాన్వాయ్‌తో ముందుకు సాగారు. ఈ కాన్వాయ్‌లో సుబ్బారెడ్డి, కొడాలి నానితో పాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని కారులో ఎక్కించుకున్నారు. ఈ క్రమంలో నందిగం సురేశ్ కూడా కారెక్కేందుకు ప్రయత్నం చేయగా భద్రతాసిబ్బంది పక్కకు నెట్టేశారు. దళితులపై మాజీ ముఖ్యమంత్రికి ఎంత ప్రేముందో దీనిని బట్టే తెలుస్తోందని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి.

వంశీని కస్టడీలో విచారించాలి



» ఆయన ఫోన్, కారు స్వాధీనం చేసుకోవాలి

» సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలి

» సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మరింత దర్యాప్తు అవసరం

» ఎస్సీ, ఎస్టీ కోర్టుకు పోలీసుల వినతి

» నన్ను కస్టడీకి ఇచ్చినా సమయం వృథా

» నా వస్తువులు పోలీసులకు అప్పగించాల్సిన పనిలేదు

» వ్యక్తిగత అఫిడవిట్ వేసిన వంశీ

» విచారణ నేటికి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టుకు విన్నవించారు. సీన్‌ను రీకన్‌స్ట్రక్షన్ చేయాల్సి ఉందని కూడా తెలిపారు. 'ఆయన ఫోన్‌ను రికవరీ చేయాల్సి ఉంది. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హైదరాబాద్ తీసుకెళ్లినప్పుడు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకోవాలి. ఈ కారణాల రీత్యా వంశీని కస్టడీకి ఇవ్వండి' అని అభ్యర్థించారు. ప్రస్తుతం జైలులో ఉన్న వంశీని పది రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. వారి తరఫున ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో 11 మంది నిందితులు ఉన్నారని.. వారిలో ఐదుగురు మాత్రమే అరెస్టయ్యారని.. మరో ఆరుగురిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వంశీ తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. ఈ కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్ అవసరం లేదన్నారు. సత్యవర్ధన్ బయటే ఉన్నందున అతడిని విచారిస్తే అసలు కోణాలు బయటకు వస్తాయని చెప్పారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకోవడానికి వంశీని కస్టడీకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇరు పక్షాల వాదనలను విన్న అనంతరం న్యాయాధికారి హిమబిందు విచారణను గురువారానికి వాయిదా వేశారు. కాగా.. వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు రెండ్రోజుల సమయం కావాలని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ కోరగా.. కోర్టు సమ్మతించింది. అలాగే సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ఖైదీలుగా ఉన్న వెంకట శివరామకృష్ణ ప్రసాద్ (ఏ-7), నిమ్మ లక్ష్మీపతి(ఏ-8) బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానం గురువారం విచారణ జరుపనుంది.

నేను కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు: వంశీ

తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో వంశీ బుధవారం కోర్టుకు వ్యక్తిగత అఫిడవిట్ సమర్పించారు. 'నేను పోలీసులకు కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు. ఒకవేళ కస్టడీకి ఇచ్చినా సమయం వృథా. రాజ్యాంగంలోని 20(3) ప్రకారం నాకు సంబంధించిన వస్తువులను పోలీసులకు అప్పగించాల్సిన అవసరం లేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మర్నాడే నేను ఎక్కడున్నానో ట్రాక్ చేసి అరెస్టు చేశారు. ఇంకా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఏముందని కస్టడీకి కోరుతున్నారు? దర్యాప్తు చేయకుండానే నన్ను అరెస్టు చేశారా? సత్యవర్ధన్ బయటే ఉన్నాడు. అతడిని విచారిస్తే అన్ని విషయాలు తెలుస్తాయి. ప్రస్తుతం నేను రిమాండ్ ఖైదీగా ఉన్నాను. నా వద్ద ఎలాంటి వస్తువులు లేవు. దర్యాప్తు చేసిన తర్వాత ఇంకా దర్యాప్తు ఏమిటి' అని పేర్కొన్నారు. సత్యవర్ధన్‌ను ఏ-5గా పేర్కొంటూ పోలీసులు క్రైం నంబరు 84/2025తో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని అఫిడవిట్‌కు జత చేశారు. కాగా, విజయవాడ జిల్లా కారాగారంలో వంశీకి కల్పిస్తున్న సదుపాయాలపై కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాలని జైలు అధికారులను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఆదేశించింది. తనకు ఇంటికి నుంచి భోజనాన్ని అనుమతించాలని, మంచం కేటాయించాలని ఆయన వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపింది.

వ్యవసాయ కూలీలకు విమాన యోగం

గాల్లో విమానం ఎగురుతుంటే పిల్లలే కాదు.. పెద్దలు కూడా ఇంటి బయటకు వచ్చి వింతగా, ఆశ్చర్యంగా చూస్తారు. ఓ రైతు పొలంలో పనిచేసే మహిళా కూలీలు కూడా అదే చేశారు. వ్యవసాయ కూలీలకు విపరీతమైన కొరత ఉన్నా.. అతడి పొలంలో మాత్రం పది మంది మహిళలు క్రమం తప్పకుండా పనిచేస్తున్నారు. అందుకు కృతజ్ఞతగా వారికేదైనా చేయాలని ఆ రైతు భావించాడు. ఆకాశంలో విమానం ఎగురుతున్న ప్రతిసారీ ఆ కూలీలు పని మానేసి ఆకాశం వైపు చూస్తుండటాన్ని గమనించిన విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా శిరగనహళ్లి గ్రామ రైతు విశ్వనాథ్‌కు తన కూలీలను కూడా విమానం ఎక్కించాలనే ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా.. పది మంది కూలీలనూ ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో మంగళవారం గోవా తీసుకెళ్లారు. శివమొగ్గ విమానాశ్రయం నుంచి ఆయన కూడా వారితో కలిసి వెళ్లారు. ఈవిధంగా వ్యవసాయ కూలీలకు జీవితాంతం గుర్తుండిపోయే కానుక ఇచ్చారు. - బళ్లారి గాంధీనగర్, ఆంధ్రజ్యోతి

గోవా ట్రిప్ కానుకగా ఇచ్చిన రైతు



ప్రకృతి విపత్తుల సాయం కింద..ఆంధ్రకు అదనంగా 608 కోట్లు



- తెలంగాణకు 231 కోట్లు : అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వరదలు, ఇతర ప్రకృతి విపత్తుల పాల్పడిన ఐదు రాష్ట్రాలకు అదనంగా రూ.1,554.99 కోట్ల సాయం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు దక్కనున్నాయి. బుధవారం ఢిల్లీలో కేంద్రం హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. గతేడాది వరదలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుపానులు సంభవించిన ఐదు రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సాయంపై చర్చించారు. జాతీయ ప్రకృతి విపత్తి నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్) కింద ఏపీతో పాటు నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, తెలంగాణకు రూ.231.75 కోట్లు, త్రిపురకు రూ.288.93 కోట్లు కేటాయించినట్లు అమిత్‌షా ఆ తర్వాత 'ఎక్స్'లో వెల్లడించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి 27 రాష్ట్రాలకు కేంద్రం కేటాయించిన రూ.18,322.80 కోట్లకు ఇది అదనమన్నారు. విపత్తుల బాధితులకు మోదీ సర్కారు పూర్తిగా మద్దతుగా ఉంటుందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద 18 రాష్ట్రాలకు రూ.4,808.30 కోట్లు, రాష్ట్ర విపత్తు నియంత్రణ నిధి (ఎస్‌డీఎంఎఫ్) కింద 14 రాష్ట్రాలకు రూ.2,208.55 కోట్లు.. ఎన్‌డీఎంఎఫ్ కింద 8 రాష్ట్రాలకు రూ.719.72 కోట్లను కేంద్రం అందించింది.

రిజిస్ట్రేషన్ల శాఖలో బిల్లుల దందా!

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించేందుకు ఆ అధికారి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

చేయాల్సిన పనులివీ...

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 3 రకాల సేవలందించడానికి గత వైసీపీ ప్రభుత్వంలో రైటర్స్ బ్లాక్ కంపెనీని నియమించుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నమోదవుతున్న డాక్యుమెంట్లను ఈ కంపెనీ స్కానింగ్ చేయాలి. సరిగ్గా స్కాన్ కాని డాక్యుమెంట్లను తిరిగి స్కానింగ్ చేయాలి. అలాగే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లోని పేరు, ఊరు, సర్వే నెంబర్ లాంటి కీలక వివరాలను డాక్యుమెంట్ల వారీగా భద్రపరచాలి. వీటిని మెటాడేటా ఫీల్డ్స్ అంటారు. కానీ ఈ మూడు పనుల్లో ఏ ఒక్కటి కూడా ఆ కంపెనీ పూర్తి చేయలేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ల స్కానింగ్ చేసినప్పటికీ అందులో ఏ ఒక్కటి కూడా సరిగ్గా లేదని, అన్నీ అడ్డదిడ్డంగా ఉన్నాయని రిజిస్ట్రేషన్ల శాఖ వాటిని ఆమోదించలేదు. అయినప్పటికీ తప్పును సరిదిద్దుకోకుండా నాణ్యత సరిగ్గా లేని స్కానింగ్‌నే ఆ కంపెనీ కొనసాగించింది. అభ్యంతరం చెప్పినా పద్ధతి మార్చుకోలేదు.

ఇదీ ప్రాజెక్టు లక్ష్యం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ... ఆదాయం ఆర్జించే, ప్రజలతో నేరుగా సంబంధాలుండే శాఖ కావడంతో సేవల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని ప్రభుత్వం భావిస్తుంది. ఫిజికల్ రికార్డుల కంటే డిజిటల్ రికార్డులు భద్రపరచడం సులువు, సురక్షితం కూడా. ఒకవేళ డిజిటల్ డేటా పోయినా పునరుద్ధరించడం కోసం మెటాడేటా ఫీల్డ్స్‌ను కూడా సిద్ధం చేయాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రజల ఆస్తులకు సంబంధించిన ఈ డేటాను సురక్షితంగా ఉంచి, భూవ్యవహారాలు సజావుగా సాగేందుకోసం ఎన్‌ఎల్ఆర్ఎంపీ ఈ ప్రాజెక్టులకు నిధులిస్తోంది. ఫిజికల్ కాపీలు, డిజిటల్ కాపీలు పోతే భూ వ్యవహారాలన్నీ గందరగోళం అయిపోతాయి. ఎవరి భూములకూ చట్టప్రకారం రక్షణ ఉండదు. అందుకే ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టు లక్ష్యాల్లో భాగంగా డాక్యుమెంట్ల స్కానింగ్, వాటి నాణ్యత పరిశీలన, మెటాడేటా ఫీల్డ్స్ పూర్తయ్యాయని అధికారులు ధ్రువీకరిస్తే ఎన్‌ఎల్ఆర్ఎంపీ నుంచి రాష్ట్రానికి నిధులు వస్తాయి.

ఎందుకీ అత్యుత్సాహం?

గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. అలాంటి వారిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయినా కొందరి తీరు మారడం లేదు. రైటర్స్ బ్లాక్ కంపెనీ నిబంధనల ప్రకారం పని చేయలేదు కావున బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయినా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఉన్నతాధికారి ఒకరు అత్యుత్సాహం చూపుతున్నారు. ఈ విషయంలో ఆ అధికారికి వ్యక్తిగత ఆసక్తి ఎందుకో? ఆ కంపెనీకి బిల్లులు చెల్లిస్తే ఆయనకు వచ్చే లాభం ఏంటో? ఎన్‌ఎల్ఆర్ఎంపీ నుంచి నిధులు తెచ్చి రైటర్స్ బ్లాక్ కంపెనీకి ఇవ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. నిబంధనలను పట్టించుకోకుండా కమిషన్ల కోసం అడ్డదారి తొక్కుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఏఐ, డ్రోన్ సాంకేతికతతో
ఆలయాల్లో రద్దీ నియంత్రణ

- శ్రీవారి భక్తులకు త్వరలో వాట్సప్ ద్వారా టీటీడీ సేవలు
- ఐటీసీఎక్స్ సదస్సు ముగింపు సభలో మంత్రి నారా లోకేశ్

తిరుపతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డ్రోన్ సాంకేతికతలు వినియోగించి ఆలయాల్లో రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా మనల్ని ముందుకు నడిపించేది ఆ దేవుడేనని చెప్పారు. బుధవారం సాయంత్రం తిరుపతిలో అంతర్జాతీయ ఆలయాల సదస్సు-ప్రదర్శన (ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో- ఐటీసీఎక్స్-2025) ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రోదసిలోకి రాకెట్లు ప్రయోగించే ముందు ఇస్రో సైంటిస్టులు సైతం శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుంటున్నారని, అదే దేవుడిపై మనకున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లలకు ఫోన్లు, ఐప్యాడ్లు ఇచ్చి పుస్తకాలకు దూరం చేస్తున్నామని, ఈ విధానం మారాలన్నారు. తన కుమారుడు దేవాన్ష్ వయసు తొమ్మిదేళ్లని, అతడికి సెల్‌ఫోన్, ఐప్యాడ్‌కు బదులు దేవుడి పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. నేటి తరం పిల్లలకు స్పైడర్‌మ్యాన్, సూపర్‌మ్యాన్‌కు బదులు శ్రీకృష్ణుడి లీలలు, శ్రీరాముడు, శివుడి గురించి తెలియజేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఏపీ ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించిందని, కొన్ని ఆలయాల్లో ఆ సేవలు అమలు చేస్తున్నామని లోకేశ్ గుర్తు చేశారు. త్వరలో టీటీడీలో కూడా వాట్సప్ సేవలు అందుబాటులోకి తెస్తామని, టికెట్ల కొనుగోలుకు భక్తులు క్యూలో నిల్చోకుండా వాట్సప్ ద్వారా కొనుగోలు చేసేలా చూస్తామని పేర్కొన్నారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, భవిష్యత్తులో అలాంటివి పునరావృతం కాకుండా టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. ఐటీసీఎక్స్ వంటి భారీ, గొప్ప కార్యక్రమాలను తిరుపతిలో తరచూ నిర్వహించాలని ఆకాంక్షించారు. ఐటీసీఎక్స్ ముగింపు కార్యక్రమంలో లోకేశ్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, పులివర్తి నానీ, గాలి భానుప్రకాశ్, బొజ్జల సుధీర్‌రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఐటీసీఎక్స్ సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్

అంతర్జాతీయ ఫెడరేషన్: ప్రసాద్ లాడ్

ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మాన్ని బలోపేతం చేయడానికి, ఆలయాలన్నింటినీ ఏకం చేయడానికి వీలుగా అంతర్జాతీయ ఆలయాల ఫెడరేషన్ ఏర్పాటు చేయనున్నట్టు ఐటీసీఎక్స్ చైర్మన్ ప్రసాద్ లాడ్ ప్రకటించారు. అత్యున్నత స్థాయి ఆధ్యాత్మిక గురువులు, ప్రముఖ పండితులు, విధాన నిర్ణేతలతో సలహా బోర్డు ఏర్పాటు చేయనుండటం కీలక ముందడుగుగా అభివర్ణించారు. సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 17 దేశాలకు చెందిన 1500కు పైగా ఆలయాల నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ క్లాంప్లెక్స్

- తిరుపతిలో ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రూ.7.5 కోట్లతో నిర్మించిన అధునాతన ఇండోర్ స్టేడియాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. అంతకు ముందు వర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలోని బీటెక్ ఈఈఈ విద్యార్థుల తరగతి గదికి వెళ్లి మాట్లాడారు. వారికి బోధన, వసతి, సదుపాయాలకు సంబంధించిన ప్రమాణాలపై ఆరా తీశారు. మంత్రి లోకేశ్‌తో విద్యార్థినులు సెల్ఫీలు దిగారు.

ఏపీ రైతులకు అమెరికా సహకారం

(మొదటి పేజీ తరువాయి)

గినా మెక్‌కర్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. దావోస్ సమావేశానికి కొనసాగింపుగా జరిగిన ఈ భేటీలో రానున్న రోజుల్లో కలిసి పని చేసే అంశాలపై చర్చించారు. ప్రకృతి సేద్యంలో భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం, రైతు నుంచి వినియోగదారుడి వరకు ఎండ్ టూ ఎండ్ అనుసంధాన వ్యవస్థను రూపొందించడం, మార్కెట్ డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఈ సంస్థలు సహాయపడనున్నాయి. పబ్లిక్, ప్రైవేట్ సంస్థల నుంచి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు సహకారాన్నిస్తాయి. ప్రకృతి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఏపీని గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌గా ప్రమోట్ చేస్తాయి. ఈ మేరకు రైతుసాధికార సంస్థతో పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్ ట్రస్ట్ సంస్థలు ఒప్పందం చేసుకోనున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలో అవకాశాలను, ప్రభుత్వ లక్ష్యాలను, ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోందని, రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్, ట్రేసబులిటీ అనేవి కీలకం కానున్నాయని సీఎం చెప్పారు. ఈ దిశగా రైతులను, ఉత్పత్తిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రకృతి సేద్యం తన కల అని సీఎం చెప్పారు. దీనికి సహకరించాల్సిందిగా ఆసంస్థల ప్రతినిధులను కోరారు. కాగా, రాష్ట్రంలో ప్రస్తుతం 12.5 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోంది. 2028-29 నాటికి 40 లక్షల మంది రైతుల్ని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి, తద్వారా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు జరిగేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

కేంద్ర బడ్జెట్ విప్లవాత్మకం: పెమ్మసాని

తిరుపతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిపరంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ విప్లవాత్మకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు, యువత, మధ్యతరగతి, పారిశ్రామికవేత్తలు... ఇలా నాలుగు ప్రధాన వర్గాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. రైతులు, మత్స్యకారులకు 4శాతం వడ్డీతో రుణాలందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆదాయపన్ను మినహాయింపు వల్ల వ్యవస్థ గాడిలో పడుతుందన్నారు. ఔషధాల ధరలు తగ్గనున్నాయన్నారు. రూ.500 కోట్లతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

జగన్ భాష.. మైండ్‌సెట్ మారలేదు!

వైసీపీ అధినేత జగన్ భాష, ఆయన మైండ్ సెట్ ఏమీ మారలేదని పెమ్మసాని వ్యాఖ్యానించారు. బట్టలిప్పి నిల్చోబెడతామని బెదిరిస్తున్న జగన్ పార్టీకి ఇపుడు 11 సీట్లు ఇచ్చారని, వచ్చేసారికి ఒక సీటే మిగులుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ తీరుతోనే రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ అమలు ఆలస్యమైందన్నారు. సీఎం చంద్రబాబు కేంద్రాన్ని అభ్యర్థించడంతో జల్‌జీవన్ మిషన్ గడువు 2028 వరకూ పొడిగించారని తెలిపారు. సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు మరింత
మెరుగ్గా..

- ఆస్పత్రుల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి
- చిన్నచిన్న మరమ్మతులు వెంటనే చేయించాలి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- విజయవాడ జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు
- రోగులకు అందించే ఆహారం రుచిచూసిన మంత్రి



విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు పంపిణీ వంటి అంశాలపై సమీక్షల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.. క్షేత్ర స్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఆస్పత్రుల్లో తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. దాదాపు మూడున్నర గంటల పాటు జీజీహెచ్ మొత్తం తిరిగి పలు విభాగాలు, వార్డులను పరిశీలించారు. పరిశుభ్రత, డాక్టర్ల హాజరు, రోగులకు అందిస్తున్న మందులు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు.

రోగులతో మాట్లాడి.. భోజనం రుచిచూసి..

విజయవాడ జీజీహెచ్‌కు ప్రతిరోజూ 2,500 మంది పైగా రోగులు వస్తున్నారని తెలుసుకున్న మంత్రి.. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద పలువురితో మాట్లాడారు. 15 నిమిషాల్లో ఓపీ రిజిస్ట్రేషన్ జరుగుతోందని, డాక్టర్లను కూడా తక్కువ సమయంలోనే కలుస్తున్నామని రోగులు వివరించారు. అనంతరం ఫార్మసీకి వెళ్లి మందుల కౌంటర్లను మంత్రి పరిశీలించారు. కౌంటర్ల సంఖ్య, మందుల లభ్యతపై ఫార్మసిస్టులతో పాటు రోగుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోగులకు అందించే ఆహారం నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో భోజనాన్ని మంత్రి స్వయంగా రుచి చూశారు. ప్రతి రోగికి రోజుకు 2,417 కేలరీలు అందేలా ఆహారం ఇస్తున్నట్లు డైటీషియన్ మంత్రికి వివరించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీబీఎస్ రోగిని మంత్రి పరామర్శించారు. సీనియర్ డాక్టర్లు ఓపీ సేవలు అందించడం లేదన్న వార్తల నేపథ్యంలో ఓపీ కేంద్రాలను సందర్శించారు. అక్కడ ముగ్గురు ప్రొఫెసర్లు, విభాగాధిపతులు విధుల్లో ఉన్నారని నిర్ధారించుకున్నారు. కాగా, కొంత మంది రోగులను వారి బంధువులే స్ట్రెచర్లు, వీల్‌చైర్స్‌లో తీసుకెళ్లడాన్ని గమనించిన మంత్రి.. అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తగినంత మంది సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. స్ట్రెచర్లు, వీల్ చైర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. విరిగిపోయిన మరుగుదొడ్లు, స్నానాల గదుల తలుపులకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పార్కింగ్, ఇతర లోపాలను సరిదిద్దాలన్నారు. కాగా, మంత్రి వస్తున్నారన్న విషయాన్ని ముందే తెలుసుకున్న జీజీహెచ్ అధికారులు శానిటేషన్ విషయంలో జాగ్రత్త పడ్డారు. కొంత మంది వైద్యులు హడావిడిగా వార్డుల్లో ప్రత్యక్షమయ్యారు.

జీబీఎస్ అంటు వ్యాధి కాదు: సత్యకుమార్

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అంటు వ్యాధి కాదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో.. రోగులకు ఏయే విభాగాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సులువుగా తెలిసేందుకు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం జి.కొండూరు మండలం కందులపాడు శివారు చేగిరెడ్డిపాడు గ్రామానికి చెందిన మహిళ మృతికి కారణాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రోస్టర్ విధానంలో లోపాలు సరిచేయండి!

- ఏపీపీఎస్సీ గ్రూప్-2 అభ్యర్థుల డిమాండ్
- హైదరాబాద్‌లో ధర్నాకు దిగిన అభ్యర్థులు

హైదరాబాద్(కవాడిగూడ), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల్లో రోస్టర్ విధానంలో నెలకొన్న లోపాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ ఏపీకి చెందిన అభ్యర్థులు హైదరాబాద్‌లో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గ్రూప్-2 అభ్యర్థులు మెరుపు ధర్నాకు దిగారు. దాదాపు వంద మందికిపైగా అభ్యర్థులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ, గ్రూప్-2 మెయిన్స్‌లోని రోస్టర్ విధానంలో లోపాలు ఉన్నాయని, వీటిని సరిచేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీ వెంటనే స్పందించి తప్పులను సరిదిద్దడానికి కమిటీ వేయాలని కోరారు. రోస్టర్ విధానంలోని లోపాల కారణంగా జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యోగంలో చేరిన పదేళ్ల తర్వాత వారిని తొలగించారని తెలిపారు. అదే పద్ధతిని ఏపీలో కొనసాగించడంతో గ్రూప్-2 అభ్యర్థుల్లో గందరగోళం నెలకొందని, ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా, ఈ విషయం తెలిసి దోమలగూడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని.. అనుమతి లేకుండా ధర్నా ఎలా చేస్తారని విద్యార్థులను ప్రశ్నించారు. దీంతో నిరసనలో పాల్గొన్న అభ్యర్థులు ఎన్టీఆర్ స్టేడియం నుంచి వెళ్లిపోయారు.

దళిత విద్యార్థుల
ఆపద్బంధువు!

(మొదటి పేజీ తరువాయి)

రక్షణగా తక్షణ చర్యలు చేపట్టారు. విద్యార్థులు ఎవరైనా అనారోగ్యం పాలైతే, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందేలా అప్రమత్తం చేశారు. దీంతో ఎక్కడ విద్యార్థులు అనారోగ్యానికి గురైనా.. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రతి ఉమ్మడి జిల్లాకొక వైద్య సంరక్షణ అధికారిని నియమించారు. ఈ విధంగా అనారోగ్య, ఇతర కారణాలతో ప్రాణాపాయ స్థితికి వెళ్లిన 15 మందికి పైగా పిల్లలను కాపాడారు. మంత్రి స్వయంగా ఆ శాఖ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో మాట్లాడి విద్యార్థుల ప్రాణాలు నిలుపుతున్నారు.

పలువురి ప్రాణాలు కాపాడిన డాక్టర్..

అనంతపురం జిల్లా కురుగుంట గురుకుల విద్యార్థి జెన్ని అక్షయ తలలో రక్తనాళాలు చిట్లి.. ఇంటర్నల్ బ్లీడింగ్‌తో ప్రాణాపాయ స్థితికి వెళ్లింది. మంత్రి ప్రత్యేక చొరవతో మూడుసార్లు శస్త్రచికిత్స చేయించి, ఆ బాలిక ప్రాణాలు కాపాడారు. విశాఖ మధురవాడ గురుకులం 6వ తరగతి విద్యార్థిని డి.ప్రవీణ వైరల్ హేమరేజిక్ ఫీవర్‌తో విశాఖ కేజీహెచ్‌లో చేరింది. విషయం తెలుసుకున్న మంత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చేశారు. దీంతో ఆ పాప ప్రాణాలతో ఇంటికి చేరింది. మరికొన్ని ఘటనల్లో కార్యదర్శి, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి విద్యార్థులకు ప్రత్యేక వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. మరి కొంతమంది విద్యార్థులకు ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలోకి రాని వ్యాధులకు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి ముందుగా ఆర్థిక సాయం అందించారు. సత్తెనపల్లిలో ప్రమాదానికి గురైన ఓ విద్యార్థి ప్రాణాపాయ స్థితిలో ఉండగా.. సీఎంఆర్ఎఫ్ ద్వారా డబ్బులు చెల్లిస్తామని ఆస్పత్రికి చెప్పి ముందుగా వైద్యం అందించేలా చేశారు.

గత ప్రభుత్వంలో ప్రాణాలు కోల్పోయిన 63 మంది

గత వైసీపీ ప్రభుత్వంలో అనారోగ్యం, సరైన వైద్యం అందని కారణంగా 63 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు మంత్రి డోలా ప్రత్యేక చర్యలతో గురుకులాల్లో మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. దురదృష్టవశాత్తూ ఏదైనా కారణంతో విద్యార్థి చనిపోతే.. బాధిత కుటుంబానికి బాసటగా ప్రభుత్వం కార్పస్ ఫండ్ అందించే ప్రతిపాదనపై ప్రణాళికలు రూపొందిస్తోంది. పాఠశాల నుంచి కనపడకుండా పోయిన పలువురు విద్యార్థుల్ని సైతం పోలీసులతో సమన్వయం చేసుకుని.. సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు. గత ఐదేళ్లలో అస్తవ్యస్తమైన సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మంత్రి చర్యలు ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన పలు హాస్టళ్లు, గురుకులాలకు భవనాలు నిర్మించేందుకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేశారు.

ఆ ఆలోచనే తప్పు

- మూలాలను తెలుసుకోకుండా స్టువర్టుపురంపై ఆ ముద్ర వేశారు
- నిరుద్యోగం, ఉపాధి లేమే అసలు సమస్యలు
- ఉపాధ్యాయ వృత్తి మీద తొలినుంచీ మక్కువ
- ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నూతన వీసీ ప్రసన్నశ్రీ వెల్లడి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

"చిన్నప్పటినుంచీ చదువుకోవడం అన్నా, పదిమందికి చదువును పంచడం అన్నా నాకు ఎంతో మక్కువ. అందువల్లే డిప్యూటీ కలెక్టరుగా వెళ్లే అవకాశం వచ్చినా.. వద్దనుకుని అధ్యాపక వృత్తిలోనే స్థిరపడ్డాను" అని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నూతన వీసీ ప్రసన్నశ్రీ వెల్లడించారు. తన తండ్రి గ్రామం స్టువర్టుపురం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పుకొచ్చారు. ఒక యూనివర్సిటీ వీసీగా నియమించబడిన తొలి ఎస్టీ మహిళ తాను కావడం ఎంత సంతోషం కలిగించిందో, స్టువర్టుపురం తమ ఊరు అని చెప్పుకోవడం కూడా అంతే తృప్తిని ఇస్తోందని ఆమె తెలిపారు. ఇంకా ఆమె ఏమన్నారంటే...

స్టువర్టుపురంతో నా అనుబంధం...

మా నాన్నది స్టువర్టుపురం. అక్కడి స్థితిగతులు మార్చడానికి తాతయ్య ఎంతో కష్టపడ్డారు. తర్వాత నాన్న కూడా దానిని కొనసాగించారు. సామాజిక స్పృహ కలిగిన ఎంతో మంది దశాబ్దాల క్రితం స్టువర్టుపురం గ్రామంలో చైతన్యం తీసుకురావడానికి పనిచేసే వారు. వారితో కలిసి తాతయ్య కూడా నడిచేవారు. నాన్న రైల్వేలో పనిచేస్తున్నప్పటికీ సొంత గ్రామం మీద ఆపేక్షతో ఉండేవారు. తరచూ నేనూ స్టువర్టుపురానికి వెళ్లి వస్తుండేదాన్ని. నాన్న సమాధి అక్కడే ఉంది.

ఆ ముద్ర వేయడమే తప్పు..

స్టువర్టుపురం అనగానే ఇప్పటికీ వేరే చోట్ల ఓ దురభిప్రాయం ఉంది. అసలు అలా ఆలోచించడమే తప్పు. నా మూలాలు అక్కడే ఉన్నాయని నేనే గర్వంగా చెబుతున్నా. గతంలో కొంతమంది తెలిసో తెలియకో మాగ్రామంపై తప్పుడు అభిప్రాయం జనాల్లో వ్యాప్తి చేశారు. అది అలాగే కొన్ని దశాబ్దాల పాటు స్థిరపడింది. ఇప్పుడిప్పుడే అక్కడి స్థితిగతుల్లో మార్పు రావడం ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతి గ్రామంలోనూ మంచి చెడుల కలబోత ఉంటుంది. కాకుంటే ఆ గీతల్లో తేడా ఉంటుంది. కానీ స్టువర్టుపురం విషయంలో ఇది ఎక్కువగా జరిగింది. దీని ఫలితంగా చాలా ఏళ్లు అక్కడి ప్రజలు అవమానాలను ఎదుర్కొన్నారు. ఓ ఎస్టీ మహిళగా పేదల స్థితిగతులపై నాకు పూర్తి అవగాహన ఉంది. ఇక్కడవరకు నేను చేసిన ప్రయాణం ఓ ఎత్తు అయితే, స్టువర్టుపురం మూలాలు కలిగి ఉండడం మరింత ఆనందం కలిగించే విషయం. ఆకలితో ఉన్న వాడికి నీతులు చెప్పడం సబబు కాదు. మూలాలపై దృష్టి పెట్టాలి. తొలి తప్పు జరిగినప్పుడే అక్కడి స్థితిగతులను ఆకళింపు చేసుకుని దాని పరిష్కారానికి కృషి చేసి ఉండాల్సింది. కానీ అలాంటి ప్రయత్నమేదీ అప్పట్లో జరగలేదు. నిరుద్యోగం, కష్టపడడానికి పని దొరక్కపోవడం, సామాజిక వివక్ష, పేదరికం.... ఇలాంటి ఎన్నో కారణాలు కొంతమందిని చెడు మార్గాల వైపు వెళ్లేటట్లు చేశాయి. అది ముగిసిన కథ. ఇప్పుడు అక్కడా మార్పు వచ్చింది. అవగాహన స్థాయి పెరిగింది. మెరుగైన జీవితం దిశగా అడుగులు వేస్తున్నారు. యూనివర్సిటీ వీసీ వరకు నా ప్రస్థానం కూడా అక్కడ వాళ్లకు ప్రేరణగా ఉంటే అంతకన్నా గొప్ప ఆనందం నాకు మరొకటి ఉండదు.

తాతయ్య వారితో కలిసి పనిచేశారు..

స్టువర్టుపురం గ్రామంలో చెడు బాట పట్టినవారిని మార్చడానికి ఎంతోమంది సామాజిక వేత్తలు కృషి చేశారు. వారిలో ముఖ్యంగా లవణం, హేమలత వంటి వారు ముందుండేవారు. వారందరితో తాతయ్య కలిసి పనిచేశారు. నాన్న ప్రసాదరావు ఉద్యోగరీత్యా వేరే చోట ఉన్నా స్టువర్టుపురంతో అనుబంధం కొనసాగించేవారు. ఆ విధంగా నాకు ఈ ప్రాంతంతో, ప్రజలతో అనుబంధం ఉంది.

పూర్తి సంతృప్తికరంగా ప్రయాణం..

అధ్యాపక వృత్తి మీద ఉన్న మక్కువతోనే కస్టమ్స్ విభాగంలో అవకాశం వచ్చినా కాదనుకున్నా. తొలి నుంచీ టీచింగ్ అంటే ఇష్టం. ఈ ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు. ముఖ్యంగా ఎస్టీల జీవన విధానం, లిపిపై చేసిన పరిశోధనలకు గుర్తింపుగా 2022లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా నారీశక్తి పురస్కారం అందుకోవడం మరచిపోలేను. నా కెరీర్ మొత్తం అధ్యాపక వృత్తితోనే ముడిపడి ఉంది. ఇప్పుడు వీసీగా అవకాశం వరకు తృప్తిగానే నా ప్రయాణం సాగింది.

కల్తీ నెయ్యి కేసులో ఏ 3, ఏ 5 కస్టడీకి పిటిషన్

- విచారణకు స్వీకరణ... ఖరారు కాని తేదీ

తిరుపతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితులను మళ్లీ తమ కస్టడీకి అనుమతించాలని కోరుతూ సిట్ అధికారులు తిరుపతి 2వ ఏడీఎం కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పర్యాయం మొత్తం నలుగురు నిందితులు కాకుండా కేవలం ఏ3, ఏ5 నిందితుల కస్టడీ కోసమే పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. వాస్తవానికి ఈనెల 13న నిందితులు నలుగురినీ ఐదు రోజుల పాటు సిట్ కస్టడీకి ఇచ్చింది. అయితే బుధవారం సిట్ అధికారుల తరఫున ఏపీపీ జయశేఖర్ 2వ ఏడీఎం కోర్టులో కస్టడీకి పిటిషన్ దాఖలు చేశారు. నలుగురినీ కాకుండా ఏ 3గా వున్న పొమిల్ జైన్, ఏ 5గా వున్న అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మాత్రమే కస్టడీకి అప్పగించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారణకు న్యాయమూర్తి స్వీకరించినప్పటికీ విచారణ తేదీని ఇంకా ఖరారు చేయలేదు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.